# కథామంజరి


## పది కథల సమాహారం



మే 2023

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**మే 2023**

సంపుటి : 4 ♦ సంచిక : 5

ఈ నెల కథామంజరి సంచికకి

ఆర్థికవనరులు సమకూర్చిన

**ఓ కథాప్రియునికి**

మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**



# శ్రీ బాలి గార్కి నివాళి












కథామంజరి ఆప్తులు, మా ప్రత్యేక సంచికలన్నింటికి అడగగానే ఆనందంగా ముఖచిత్రాలను వేసి అందించిన కథాభిమాని, తెలుగువారికి పరిచయం అక్కర్లేని మరో బాపు, కార్టూనిస్టు, చిత్రకారుడు, కథారచయిత శ్రీ బాలిగారు 18.04.2023 తేదిన పరమపదించారు. వేలమంది స్నేహితులను సంపాదించి, లక్షల్లో బొమ్మలు వేసి, వేలలో కార్టూన్లు అందించి కీర్తి బావుటాను ఎగురవేశారు. ఎంతోమంది చిత్రకారులకు గురుత్వం వహించి, మార్గదర్శకత్వం చేశారు. ఆయన ప్రాణం పోసిన చిత్రాలు నిలువెల్లా తెలుగుతనం నింపుకుని మనకి ఆనందం కలిగిస్తూంటే, ఆయన మనని విషాదంలో వదిలి వెళ్లిపోయారు. ఆయన లేని లోటు పూరించలేనిది! బాలిగారి మృతితో 'కథామంజరి' ఒక ఆప్తుడ్ని కోల్పోయింది. ప్రగాఢ సంతాపంతో, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాం

★★★

**కథామంజరి బృందం**





# కథామంజరి తృతీయ వార్షికోత్సవ సందర్భంగా
# "సినిమా రంగ మార్తాండ" కథల పోటీ

సినిమా రంగానికి సంబంధించి 24 క్రాఫ్ట్‌లు ఉన్నాయని, ఆ రంగం మీద ఆధారపడి ఎన్నో వేలమంది జీవనం సాగిస్తున్నారనే విషయం అందరికి తెలిసిన విషయమే. వారూ సామాన్యులే, వారి జీవితాలు అందరి జీవితాల్లాగే ఉంటాయి! అందుకే ఈసారి కథల పోటీ 'సినిమారంగం' మీద నిర్వహిస్తున్నాం!

- నిబంధనలు -

1. పోటీకి పంపే కథలు సినిమారంగ నేపథ్యంలో ఉండాలి. నవరసాల్లో ఏ రసంలో వ్రాసిన కథలైనా పర్వాలేదు. కథనంలో ఎక్కడో అక్కడ 'సినిమారంగ' ముద్ర పడాలన్నమాట.
2. కథ 1200 పదాలకు మించి ఉండకూడదు.
3. కథతో పాటు తప్పనిసరిగా హామీపత్రం జత చెయ్యాలి. ఆ కథ స్వీయరచన అని, మరే ఇతర పత్రికలకు పంపలేదని, అలాగే ఫేస్‌బుక్, వాట్సాప్, టెలిగ్రామ్,బ్లాగులు...వంటి వెబ్‌సైట్లలో పెట్టలేదని ఆ హామీపత్రంలో ప్రస్ఫుటంగా వ్రాయాలి!
4. కథను వర్డ్ ఫైల్లో యూనికోడ్‌లో టైపు చేసి "సినిమా రంగ మార్తాండ" కథల పోటీకి అని సూచిస్తూ submissions@kathamanjari.in కి మెయిల్ ద్వారా పంపాలి.
5. మొదటి బహుమతి రు.5,000/-, రెండవ బహుమతి రు.3,000/-, మూడవ బహుమతి రు.2,000/-, నాల్గవ బహుమతి రు.1,000/-.
6. కథలు మాకు చేరవలసిన ఆఖరి తేది 31.05.2023, రాత్రి గం.10.00 లోపు.
7. ఈ కథల పోటీ విషయంలో కథామంజరి నిర్వాహకులదే తుది నిర్ణయం అని గమనించ ప్రార్థన.

రోజూ కనబడే కథలకి భిన్నంగా 'రవి గాంచని చోట కవి గాంచే' కథలను కథకులు కలం సంధించి వ్రాయగలరనే గట్టి విశ్వాసంతో, కథలను ఆహ్వానిస్తున్నాం. ఎప్పుడూ కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టే కథామంజరి ఈసారి చేసే ఈ ప్రయత్నానికి కూడా ఎప్పటిలాగే కథకులు అందరూ సహకరిస్తారని ఆశిస్తున్నాం!

***

**కథామంజరి బృందం**

# కథామంజరి
## పది కథల సమాహారం

“కథామంజరి” దాదాపు మూడు సంవత్సరాలుగా
కొత్త, పాత రచయితల రచనలను ఎంచుకుని, నెల నెలా
ఓ పది కథల సమాహారాన్ని పాఠకులకి అందిస్తోంది.

ఈ ఆన్ లైన్ సంచికలో కథలు తప్ప మరేమీ ఉండవు.

ప్రచురించిన పది కథలనూ, శబ్దీకరించి, ఇపుడు
శ్రావ్యసంచికగా కూడా విడుదల చేస్తోంది. దీనివలన
చదవలేనివారు, చదవడానికి సమయం లేని వారు కూడా
ఈ కథలకు దగ్గిరవుతున్నారు.

“కథామంజరి” ఎటువంటి లాభాపేక్ష లేని సంస్థ. ఇంతవరకు,
కొద్దిమంది కథాప్రియుల ఆసరాతో సౌఖ్యంగానే నడిచినా,
పాఠకులు దన్నుదారులైతే మరింత శోభగా ఉంటుందనే
ఆలోచనతో మీ ముందుకు వచ్చాం.

వార్షిక చందా **రూ.200/-**

ఆదరిస్తారని ఆకాంక్షిస్తున్నాం.

**చందా చెల్లించుటకు ఇక్కడ నొక్కండి**

# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నండూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- గాయత్రి రామోజి గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | iii |
| కథా మార్గదర్శి | v |
| కథా పరిచయం | vii |
| కథాపుస్తక పరిచయం | xi |
| వినదగునెవ్వరు చెప్పిన | xiii |


## కథలు, వ్యాసాలూ


| | | |
|---|---|---|
| ఏనుగమ్మ ఏనుగు... | వెంకట శివకుమార్ కాకు | 1 |
| అర్ధాంగి | విరించి | 6 |
| మేధావి | ఉగాది వసంత | 11 |
| ప్రేమార్ణవం | వాడపల్లి పూర్ణ కామేశ్వరి | 17 |
| అపవాదు | ఘండికోట విశ్వనాథం | 23 |
| అమ్మకోసం | కొలిచిన జ్యోతిర్లత | 29 |
| క్రమశిక్షణ | డా. మజ్జి భారతి | 35 |
| సర్దుబాటు | మాధవి బైటారు దేవి తనయ | 41 |
| చెమర్చిన సముద్రం | వి. రాజారామ్మోహన రావు | 46 |
| మాక్లీదుర్గంలో కుక్క | కీ. శే. విశ్వనాథ సత్యనారాయణ | 49 |


Cover Page Credit : Eberhard Grossgasteiger Italy

# కథాకీయం

'కథామంజరి' త్వరలో మూడు సంవత్సరాలు నింపుకుని నాలుగో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నది. ముప్పై ఆరు సంచికలు, అందులో ఆరు ప్రత్యేక సంచికలు, ఆరు కథల పోటీల అనుభవంతో, అనుభూతితో అడుగు ముందుకు వేస్తోంది. వందల్లో రచయితలు, రచయిత్రులు, ఆర్థికంగా వెన్నంటి ప్రోత్సహిస్తున్న దాతలు, ఆదరిస్తున్న పాఠకులు.. ఇలా ఎంతోమంది కథామంజరి ఉనికికి తోడ్పడుతున్నారు. వారందరికీ వందనాలు! కథామంజరి జన్మదిన వార్షికోత్సవం సందర్భంగా కథల పోటీ నిర్వహిస్తున్నాం. వివరాలు వేరే పేజీలో ఇస్తున్నాం. ఎప్పటిలాగే రచయితలు, రచయిత్రుల సహకారం ఉంటుందని ఆశిస్తున్నాం.

ఇక.. కథామంజరి చందా విషయంలో కూడా ప్రకటనలు ఇస్తున్నాం. మంచి స్పందనే వచ్చింది. అయితే కథామంజరి పూర్తి స్వేచ్ఛగా ముందడుగు వేయాలంటే, మరిన్ని చేతులు పడాలి. దీనికి అందరు సహకరించవలసిందిగా మరోసారి అభ్యర్థిస్తున్నాం!

ఇక మరో ముఖ్యమైన విషయం ప్రస్తావించాలి. అది...

లలితకళలన్నిటి లోనూ కథకు ఓ ప్రత్యేకత ఉంది. కథలు వ్రాయడానికి ఉండే ఆర్థిక పరమైన ఇబ్బందులు అస్సలు రచయిత ఆలోచనలకు అడ్డం రావు. కాగితం, పెన్ను ఉంటే చాలు.. మనసులో భావాలను అక్షరరూపంలో సమాజానికి అందించొచ్చు! ఏ రచయితా, ఏ కాలంలోనూ కథ మీద సంపాదన ఆశించలేదు. వస్తే ఎంత ఆనందమో, రాకపోయినా అంతే ఆనందం రచయితలకే స్వంతం! ఇంత ఉపోద్ఘాతం ఎందుకంటే... గడిచిన ఓ అరవై డబ్భై సంవత్సరాలు కథకు స్వర్ణయుగమనే చెప్పాలి. రాను రానూ ముద్రణలో వచ్చే పత్రికల సంఖ్య బాగా పడిపోయిన తరువాత, కథలకు అంతర్జాలమే వేదిక అయింది.

ఒకప్పుడు పత్రికలు విరివిగా ఉండేవి. కథల ప్రచురణలు, పారితోషికాలు బాగానే ఉండేవి. కథల సంపుటో, కవితల సంపుటో, నవలో ముద్రించుకున్నా, వాటికి గిరాకీ ఉండేది. పుస్తకాలు కొని, చదువుకునే అలవాటు పాఠకులకు ఉండేది. వాటితో రచయితలకు ఆర్థికంగా చాలా వెసులుబాటు ఉండేది. అటు పత్రికల నుంచి పారితోషికం, ఇటు కథా సంపుటాలు వేస్తే రాబడి కూడా ఉండేవి. కాలక్రమేణా ఆ గిరాకి తగ్గిపోయింది. ఇప్పుడు కథలకు పారితోషికం ఇచ్చే పత్రికలు బహు తక్కువగా ఉన్నాయి. ఒకవేళ కథా సంపుటాలు వేసినా సరే, అది ఖర్చే గాని రాబడి ఉండదు. వందేళ్ళ పైచిలుకు చరిత్ర గల తెలుగు కథని రచయితలు ఎప్పుడూ వ్యాపార దృష్టిలో చూడలేదు. ఇది చాలా ముఖ్యమైన గొప్ప విషయం. గుర్తింపదగ్గ విషయం!

ఈ నేపథ్యంలో నేటి కథా రచయితలను తప్పకుండా అభినందించాలి! తమ కథలు పదిమందికి చేరాలని కథలు వ్రాస్తున్నారే తప్ప, పత్రిక నుండి పారితోషికం ఆశించడం లేదు. కథల సంపుటాలు వేయాలంటే కనీసం ₹30,000/– ఖర్చు అవుతుంది. ఆ తర్వాత ఆ పుస్తకం కోనేవారి సంఖ్య చాలా తక్కువ. ప్రభుత్వ గ్రంథాలయాలు ఎప్పుడో ఐదారు సంవత్సరాలకోసారి వందో, రెండు వందలో పుస్తకాలు కొనుగోలు చేసినా, 40% రిబేటుకు తీసుకుంటారు. అయితే.. ఆ డబ్బులు కూడా ఓ పట్టానా రావు! గడిచిన సంవత్సరంలో గ్రంథాలయాలు కొనుగోలుచేసిన పుస్తకాల పైకం ఇప్పటికీ రచయితలు అందుకోలేదు. వెరసి... రచయితకు తాను పెట్టిన ఖర్చులో సగం కూడా రాదు.


ఐనా సరే.. రచయిత ఈ కోణంలో ఆలోచించలేదు. పుస్తక పఠనం బాగా తగ్గిపోయిన నేటి కంప్యూటరు యుగంలో కూడా... తన రచనలు పాఠకులకు చేరాలి, తాను కాలం చేసినా సరే, భవిష్యత్తులో తన రచనలు చిరంజీవిగా ఉండాలనీ, కథా

సంపుటాలను ముద్రిస్తున్నారంటే... తెలుగు కథకు ఇంతకంటే చేయగల సేవ ఏముంటుంది చెప్పండి! అలా తెలుగు కథకోసం ఆర్థికపరమైన విషయాలను కూడా లెక్కచేయకుండా ముందడుగు వేస్తున్న కథా రచయితలకు జేజేలు పలుకుతున్నాం!

ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని, ఈ సంచిక నుంచి ఇటీవల కాలంలో విడుదల చేసిన కథా సంపుటాలు, సంకలనాలను కథామంజరిలో పరిచయం చేస్తున్నాం. ఈ శీర్షిక తప్పకుండా కథారచయితలకు ప్రోత్సాహం కలగచేయగలదని ఆశిస్తున్నాం!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**శ్రీ వి. రాజారామ్మోహనరావు**

నిన్న, మొన్నటి తరం తెలుగు రచయితల గురించి తెలుసుకుంటుంటే, ఈ తరంవారు తెలుసుకోవలసిన ఆసక్తికరమైన విషయాలు, ఆశ్చర్యం కలిగించే విశేషణాలు కనిపిస్తాయి. అసలు ఏడవ తరగతి వరకు స్కూలుకి వెళ్ళకుండా, ఇంటి పట్టునే చదువు సాగించి, ఎనిమిదవ తరగతిలో ఓ డిటెక్టివ్ నవల రాయడం... తర్వాత అటు ఉన్నతమైన చదువులు చదివి, మంచి ఉద్యోగం చేస్తూ, ఇటు తెలుగు సాహితీలోకంలో పేరుగాంచిన రచయితగా పేరు తెచ్చుకోవడం... ఇవన్నీ వింటూంటే సినిమా అనుకుంటారు. ఇది నిజం! ఆ నిజం... ఐదున్నర దశాబ్దాలుగా తెలుగు సాహితీ ప్రపంచానికి ఆణిముత్యాలను అందించిన సాహితీవేత్త శ్రీ వి. రాజారామ్మోహనరావు గారు.

తన సాహితీ ప్రస్థానం గురించి చెబుతూ... "నన్ను స్కూలుకి పంపితే ఎక్కడ ఒత్తిడి పడవలసి వస్తుందో అని తలచి మా అమ్మమ్మ గారు ఏడవ తరగతి వరకూ స్కూలుకి పంపలేదు. ఎంట్రన్స్ వ్రాసి ఏడవ తరగతిలో జాయిన్ అయిన తర్వాత అక్కడ పరిచయమయిన మిత్రుడు కుమారస్వామితో సహవాసం వలన సాహిత్యం పట్ల అభిరుచి కలిగింది. కుమారస్వామి ఆ వయసులోనే పద్యాలు రాసేవాడు, అవి భారతిలో పడేవి! ఆ రోజుల్లోనే మా కుటుంబానికి బాగా సన్నిహితులైన, ప్రఖ్యాత డిటెక్టివ్ నవలారచయిత శ్రీ విశ్వప్రసాద్‌గారి నవలలు చదవడం... వాటి ప్రేరణతో నేను, కుమారస్వామి కలసి ఓ అరవై పేజీలు డిటెక్టివ్ నవల వ్రాసాం! అది చూసి 'బావుంది కాని, మూడు రెట్లు పెంచి రాస్తేనేగాని ముద్రణకి సరిపోదు!' అంటూ కొన్ని సలహాలు ఇచ్చారు. మళ్ళీ దాని జోలికి పోలేదు గాని, కథలు రాయాలనే ఆలోచనకి అప్పుడు బీజం పడిందనే చెప్పాలి! కథలు వ్రాసి, పత్రికలకు పంపుతుంటే, తిరిగి వచ్చేస్తుండేవి. అప్పట్లో... కథలు వ్రాయడానికి ప్రాథమిక విషయాలు కూడా తెలియవు. నేను కాలేజీలోకి వచ్చేసరికి, కుమారస్వామి 'కృష్ణాపత్రిక'లో పని చేసేవాడు. వాడు కూడా నా కథలు తిప్పి పంపేసేవాడు. అలా మొదలైన నా ప్రయాణం, నా పంతొమ్మిదవ ఏట, ఓ ఎనభై సంవత్సరాల ముసలాయన గురించి వ్రాసిన కథ 'ఒక్క క్షణం' కృష్ణాపత్రికలోనే 1967 లో పడింది. అదే నా మొట్టమొదటి అచ్చయిన కథ!" అంటూ ఎన్నో విషయాలు ఆనందంగా చెప్తారు.

జీవితంలో ఎదురయ్యే అనుభవమో, లేదా ఏదో సంఘటన మీదే రామ్మోహనరావు గారి కథలు రూపు దిద్దుకుంటాయి! మొదట్లో వీరి కథలు ఆర్థికపరమైన విషయాలు, మధ్య తరగతి కుటుంబాలు, పేదరికం మీద కథలు వ్రాసారు. తర్వాత కాలంలో మానవ సంబంధాలు, స్త్రీ పురుష సంబంధాలు మీద వ్రాసారు. ఈ మార్పుకి కారణం కూడా స్వానుభవమే అంటారాయన. పేదరికం,

తిరుగుబాటు, వామపక్ష ధోరణి కనబడే కథలు చదివి, చాలామంది రామ్మోహనరావు గారు చాలా పేదరికంలో మగ్గిపోతున్న వ్యక్తి అనుకునేవారుట! అంటే ఆ కథల్లో ఆయన ఎంత ఇమిడిపోయి వ్రాసేవారో అర్థం అవుతుంది. అదిగో... ఆ రోజుల్లో వారి సోదరి సూచనకు అనువుగా మరో కథావస్తువుతో ముందుకు అడుగులు వేసారు. అలాగే రామ్మోహనరావు గారు లైంగిక వాంఛలకు సంబంధించి మంచి, చెడుల గురించి, స్త్రీ పురుష సంబంధాల గురించి చాలా కథలు వ్రాసారు. ఇలాంటి కథలు వ్రాయడానికి, చుట్టూ ఉన్న పరిస్థితులతో పాటు చలంగారి ప్రభావం కారణం అంటారు. కథకత్రయం అనబడే... మల్లాది, చలం, పాలగుమ్మి పద్మరాజు... స్త్రీ పట్ల గౌరవంతో కథలు వ్రాసారు. ఆ సాహిత్య ప్రభావం కూడా రామ్మోహనరావు గారి కథల్లో కనబడుతుంది. రామ్మోహనరావు గారు వామపక్ష భావాలతో కథలు వ్రాసారనే అంటారు గాని, నిజానికి ఆయన ఓ మానవతావాదిగానే కలం ఝళిపించారు. రంగు ఏం వేసినా... అసలు సిసలైన వాస్తవ స్థితిగతుల మీదే ఆయన వ్రాసిన కథలు, నవలలు అన్నీ ఆణిముత్యాలే! "భావజాలం పేరుతో చాలా సాహిత్యం, సమస్యలు పక్కన పడిపోయాయి, పడిపోతున్నాయి కూడా! వాటిని వెలికి తీసి రచయితలు వ్రాయడం లేదు! అవకాశం ఉన్నా, ఆ పని జరగడం లేదు! కాని నా మట్టుకు సహజమైన రీతిలో, నా పంథాలో నేను సాహిత్య ప్రయాణం చేసాను!" అంటూ చెప్పే రామ్మోహనరావు గారు 300 పైగా కథలు, 21 నవలలు వ్రాసారు.


ఆయన కథల్లో ఎత్తుగడ, చిన్న చిన్న వాక్యాలతో సాగే కథనం, శైలి పాఠకుల్ని చదివిస్తాయి. ప్రతి రచయితకి 'అన్నీ నాకు తెలుసు' అనే ఓ ఇగో ఉంటుంది. అలాంటి ఇగో లేని ఏకైక రచయిత పాలగుమ్మి పద్మరాజుగారు. 'నాకు ఏం తెలియకపోయినా ఫర్వాలేదు, కాని జీవితం బావుంది' అని విస్పష్టమైన అభిప్రాయం ఉన్న పద్మరాజుగారంటే ఇష్టపడే రామ్మోహనరావుగారు మరుగుపడిన ఎన్నో మంచి తెలుగు నవలలను చదివి, పరిచయం చేసే ఓ బృహత్తర కార్యక్రమం చేపట్టి, ఎన్నో నవలలను వెతికి పట్టుకుని, వాటిని చదివి, ఇప్పటి వరకూ నూటపది నవలలను వివిధ పత్రికల ద్వారా 'నవలాహృదయం' శీర్షికగా పరిచయం చేసారు. గత నలభై సంవత్సరాలుగా అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలలో పాల్గొంటూ, వాటి మీద ఎన్నో సమీక్షలు వ్రాశారు. ఓ ఏడాది పాటు ఎన్నో నవలలు చదివితే వచ్చే విషయ పరిజ్ఞానం, పదిహేను రోజుల పాటు ఈ చలనచిత్రోత్సవంలో పాల్గొంటే కలుగుతుందనే గట్టి నమ్మకంతో ఉన్న రామ్మోహనరావుగారితో సంభాషిస్తుంటే కాలం తెలియదు. తరాలు మారడంతో తెలుగు కథలో మార్పు సహజంగానే ఉంటుంది. అయితే తెలుగు కథ ముందుకు నడవాలంటే, పాత కొత్త రచయితల మధ్య పరస్పర అవగాహన ఉండాలి. అలాగే నవలా సాహిత్యం... నవల వ్రాస్తే, ప్రచురణకు పత్రికలు లేవు. పెద్దపెద్ద సంస్థలు నవలల పోటీలు పెట్టి, పెద్ద మొత్తంలో బహుమతులు ఇవ్వడం కన్నా, ఏడాది పొడవునా వ్రాసే నవలలను ప్రచురించే బాధ్యత తీసుకుంటే తప్పకుండా తెలుగులో మంచి నవలలు వస్తాయని ఆయన చెప్పే మాటల్ని విని, ఆచరణలో పెట్టే నాథులుంటే తెలుగు కథకి, నవలకి మళ్ళీ పూర్వవైభవం వస్తుందనడంలో సందేహం లేదు!

1946లో జన్మించిన రాజారామ్మోహనరావుగారు, ఏలూరు, బందరుల్లో కాలేజీ విద్య తరువాత రైల్వేలో పనిచేసారు. ఉద్యోగరీత్యా హైదారాబాదులోనే ఉండిపోయారు. ముప్పైకి పైగా అవార్డులు, పురస్కారాలు అందుకున్న రామ్మోహనరావుగారి మొదటి కథ 'ఒక్క క్షణం' నుండి నేటి వరకు రాజారామ్మోహనరావు వ్రాసిన కథలన్నీ ఆణిముత్యాలే! 'వరద', 'తెల్లటి చీకటి', 'లోలోపల', 'మనసుకు మరోవైపు' కథాసంపుటాలు, నవలాహృదయం మూడు భాగాలు... వెలువడ్డాయి.

విలక్షణమైన కథలు, నవలలు, వ్యాసాలతో తెలుగు సాహితీప్రపంచంలో ఓ ధృవతారగా వెలుగులిస్తున్న శ్రీ రాజారామ్మోహనరావు గారిని అడిగిన వెంటనే ఈ సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసినందులకూ, కథామంజరి చేస్తున్న కథాయజ్ఞం గురించి తెలుసుకుని ఓ కథ వ్రాసి పంపినందులకూ... కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



**కీ.శే. విశ్వనాథ సత్యనారాయణ**

గడిచిన శతాబ్దకాలంలో గాని, రాబోయే శతాబ్దకాలంలో గాని తెలుగువారికి పరిచయం చేయక్కర్లేని సాహితీవేత్త, మరో శతాబ్ద కాలం పాటు తెలుగుజాతి గర్వంగా చెప్పుకునే 'కవి సామ్రాట్', తెలుగు సాహితీవనంలో మొట్టమొదటిసారిగా జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న మహనీయులు, ఆదర్శమూర్తి కీ.శే. విశ్వనాథ సత్యనారాయణగారు. ఆయన గురించి వ్రాయడం అనడం కన్నా, స్మరించుకోవడం అంటే బావుంటుంది. ఆయన గురించి కొన్ని వేల వ్యాసాలు వచ్చాయి, వస్తూనే ఉన్నాయి. భవిష్యత్తులో కూడా వస్తాయి. తెలుగు సాహితీ ప్రపంచంలో విశ్వనాథవారి ఉనికి ఓ అక్షయపాత్ర వంటిది! ఆయన గురించి ఎంత వ్రాసినా, ఎంతమంది వ్రాసినా ఇంకా విశేషాలు వస్తూనే ఉంటాయి.

తెలుగు సాహిత్యంలో విశ్వనాథవారు చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు. కావ్యాలు, కవితలు, కథలు, నాటకాలు, విమర్శలు, వ్యాసాలు, సాంఘిక చారిత్రాత్మక నవలలు... ఒకటేమిటి అన్ని ప్రక్రియలలో అగ్రస్థానంలో నిలిచిన సవ్యసాచి. ఆయన ఛాందసుడు, ఛాందస భావాలు పుణికిపుచ్చుకున్న వ్యక్తి అని వ్యంగ్యాస్త్రాలు విసిరినవారూ ఉన్నారు. కాని గ్రాంథికంలో వ్రాసిన నవలలోనైనా, వ్యవహారిక భాషలో వ్రాసిన కథల్లోనైనా, ఆ భాష సరళంగా పామరులను సైతం అలరిస్తుంది. అంతే కాదు... ఆయనలో ఉన్న అభ్యుదయం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. తన సాహిత్యం పాఠకులకు నచ్చి, వారిచేత మెప్పు పొందాలని విశ్వనాథవారు ఎన్నడూ తపన పడలేదు. తన సాహిత్య ప్రక్రియలలో విలువలను జొప్పించి, నిజమైన సాహిత్య చైతన్యాన్ని కలిగించాలనీ... అలాగే భాషాసాహిత్యాన్ని కూడా ఉన్నత స్థితికి తీసుకురావాలనీ భావించారు. ఆరు దశాబ్దాల కాలం పాటు సాగిన వారి సాహితీ ప్రయాణంలో, ఆయన వ్రాసినవి... అంటే ముద్రణలో ఉన్నవి, వ్రాతప్రతిలో ఉన్నవి, చింపివేసినవి కూడా కలుపుకుంటే, లక్ష పుటలు ఉంటాయని ఆయనే చెప్పేవారు!

అలా ఆ కాలంలోనే ఓ రికార్డు స్థాపించిన విశ్వనాథవారి రచనా శైలి ఓ ప్రత్యేకమైన శైలి. అందుకే ఆ శైలిని 'విశ్వనాథ సత్యనారాయణగారి శైలి' అని వాడుకలోకి వచ్చేసింది. వారి నవలలు వేయిపడగలు, అమృతవల్లి, ఏకవీర, కడిమి చెట్టు, జేబుదొంగలు, దంతపు దువ్వెన, దిండు క్రింద పోకచెక్క, స్వర్గానికి నిచ్చెనలు, సముద్రపు దిబ్బ... ఒకటేమిటి, వారి నవలలన్నీ తెలుగు సాహితీ జగత్తులో ఆణిముత్యాలే! వారి శ్రీమద్రామాయణ కల్పవృక్షము ఓ మహాకావ్యంగా గుర్తింపబడి, ఆ కావ్యానికే

ఆయనకి 'జ్ఞానపీఠ' అవార్డు లభించింది. జ్ఞానపీఠ అవార్డు మొదలైన తర్వాత మొట్టమొదటిసారిగా ఓ తెలుగువారికి ఆ అవార్డు రావడం విశ్వనాథవారి తోనే అరంభమయింది. ఆంధ్రపౌరుషం, దమయంతి స్వయంవరం, ధర్మపత్ని, విశ్వనాథ పంచశతి, శృంగారవీధి మొదలగు పద్యకావ్యాలు; అంతా నాటకమే, అనార్కలి, తల్లిలేని పిల్ల, త్రిశూలము, నర్తనశాల, లోపల బయట, శివాజీ–రోషనార... వంటి నాటకాలు; కిన్నెరసాని పాటలు, పాము పాట, యతి గీతం మొదలగు గీతాలు తెలుగు సాహితీ వనంలో అజరామరంగా అమృతాన్ని ఇప్పటికి అందిస్తున్నాయి. పాతిక పైగా కావ్యాలు, ఆరు శతకాలు, పదమూడు గేయకావ్యాలు, పదిహేను నాటకాలు, ఏభై ఎనిమిది నవలలు, పది సంస్కృత నాటకాలు, మరెన్నో విమర్శనాగ్రంథాలు, వ్యాసాలు, ఉపన్యాసాలు... ఇలా వారు తెలుగు భాషకు ఎనలేని సంపదను అందించారు. విశ్వనాథవారి రచనలను ఇంగ్లీషులో తర్జుమా చేసుంటే, అంతర్జాతీయ ఖ్యాతి వచ్చేదని చాలామంది అంటారు. కాని విశ్వనాథ వారి రచనలను ఆ స్థాయిలో అనువాదం చేయగల స్థాయి గలవారు లేరనే అభిప్రాయం కూడా చాలామంది వెలిబుచ్చుతారు! ఏది ఏమైనప్పటికీ... విశ్వనాథవారి రచనలు, భూమ్మీద తెలుగుభాష ఉన్నంత వరకు, అవి తెలుగువారికి తరగని ఆస్తి అని ఘంటాపథంగా చెప్పాలి.

ఇక విశ్వనాథ గారి కథల విషయానికొస్తే... పాత్రల చిత్రీకరణలో విశిష్టత ఉంటుంది. ప్రతి పాత్రని ప్రత్యేకంగా, ప్రకాశవంతంగా, స్వయం వ్యక్తిత్వం గల పాత్రలుగా శిల్పం చెక్కినట్లు తీర్చిదిద్దారు. విశ్వనాథవారు ఛాందసులు, ఛాందస భావాలు గలవారని అనుకునేవారు, ఒక్కసారి ఆయన కథలు చదవాలి. కనీసం 'ఉరి' లేదా 'మాక్లీదుర్గంలో కుక్క' కథలైనా ఓసారి చదవాలి. విశ్వనాథ వారు ఓ నలభై కథల వరకు వ్రాసారు.

విశ్వనాథ సత్యనారాయణగారు 1895 సెప్టెంబరు 10న కృష్ణా జిల్లా నందమూరు గ్రామంలో వైదిక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టారు. అక్కడే బాల్యంలో... నిత్యం ఆ గ్రామంలో దేశికవితా రీతుల్లో గానం చేసుకుంటూ తిరిగే భిక్షకులు, పురాణగాథలు నేర్పించిన స్వజనం... విశ్వనాథవారి కవిత్వానికి ప్రేరణగా చెప్పవచ్చును. దానికి తోడు విశ్వనాథవారు హైస్కూల్ చదువులు బందరులో సాగించినప్పుడు వారికి చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారు తెలుగు ఉపాధ్యాయులుగా లభించడం మరో వరం! 1921 లో మహాత్మాగాంధీ గారి పిలుపుతో, కాలేజీ చదువుని మధ్యలో వదిలేసి ఉద్యమంలోకి వెళ్ళారు. తర్వాత కాలంలో అది పూర్తి చేసి, బందరు హిందూ కళాశాలలో అధ్యాపకుడిగా చేరారు. తర్వాత కాలంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొని, విజయవాడ, కరీంనగర్‌లలో ప్రభుత్వ కళాశాలలో వివిధ హోదాలలో పనిచేసి, పదవీవిరమణ చేసారు. 1957 లో విశ్వనాథవారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షుడుగా, 1958 లో శాసనమండలి నామినేటెడ్ సభ్యులు గానూ విధులు నిర్వర్తించారు.

తన అభిప్రాయాలను, ఇష్టాయిష్టాలను నిక్కచ్చిగా చెప్పే విశ్వనాథవారు, భారతీయత, తెలుగుదనం అంటే చాలా అభిమానం, ఇష్టం చూపే వారు! 'నా కవిత్వం అంతా నా జీవితంలోని అనుభవాల మయం' అని అనేవారు. 1970 లో భారతప్రభుత్వంచే 'పద్మభూషణ్' పురస్కారం, 1971 లో జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న విశ్వనాథ సత్యనారాయణ గారు 1976 అక్టోబర్ 18 న పరమపదించారు.

ఓ మహనీయుని తలుచుకునే మహత్తర అవకాశం కథామంజరికి లభించింది. వారి మనమడు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ (తాతగారి నామధేయమే) గారితో కూడా ముచ్చటించడం ఓ అదృష్టంగా భావిస్తూ, విశ్వనాథవారికి నివాళి తెలియచేసుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

### సాయి బ్రహ్మానందం గొర్తి గారి కథ 'క్విల్ట్'

కథా ప్రపంచానికి సాయి బ్రహ్మానందం గొర్తి గారు సుపరిచితులే. తీసుకున్న ఇతివృత్తంలోనూ, శిల్పం, శైలిలోనూ కూడా ఎంతో వైవిధ్యం చూపించే ఈ రచయిత నివాసం అమెరికా. ఈ రచయిత సవ్యసాచిగా, అటు పుట్టింటి, ఇటు మెట్టినింటి (డయాస్పోరా) నేపథ్యంలోనూ కూడా రాస్తూ మెప్పు పొందారు. కేతు విశ్వనాథరెడ్డిగారు రచయిత గురించి చెబుతూ, "ప్రవాస భారతీయ జీవితాన్ని గురించీ, అక్కడి సంవేదనల గురించీ నిత్యం ఆర్తి చెందే సృజనాత్మక రచయితల్లో ఒకరు. కథల్లో ప్రముఖంగా మనస్తత్వ విశ్లేషణా, వ్యక్తిత్వ ఆకాంక్షల అన్వేషణా కనిపిస్తాయి." అంటారు. "వస్తువు, కథనం సమపాళ్ళలో రంగరించి కథలు రాస్తున్న బహు కొద్దిమంది అమెరికాలో స్థిరపడ్డ రచయితల్లో బ్రహ్మానందం ఒకరు" అంటారు వేలూరి వేంకటేశ్వరరావు గారు. బ్రహ్మానందం గారు వ్రాసిన కథలు, నవలలు ఎన్నో ప్రచురించబడ్డాయి, మెప్పు పొందాయి. ఆయన పుస్తకాలు కొన్ని – సరిహద్దు, కోనసీమ కథలు, క్విల్ట్ (కథాసంకలనాలు), నేహాల, అంతర్జ్వలన (నవలలు). ఎన్నో మంచి వ్యాసాలు వ్రాసారు. కేవలం రచనలు చెయ్యడమే కాక ఆయన పత్రికా సంపాదకులు కూడా.

అందుకే సాయి బ్రహ్మానందం గారు వ్రాసిన ఒక డయాస్పోరా కథ 'క్విల్ట్' ని ఎన్నుకున్నాను, కథామంజరి పాఠకులకు పరిచయం చెయ్యడానికి.

'డయాస్పోరా సాహిత్యమంటే?' అనడిగాడు మా స్నేహితుడొకడు. ఎందరో ఎన్నిరకాలుగానో చెప్పడం జరిగింది. వంగూరి ఫౌండేషన్‌వారు ఈ మధ్యలో ఒక పుస్తకాన్ని వెలువరించారు 'డయాస్పోరా కథ, సాహిత్యం అంటే ఏమిటి?' అనే వ్యాస సంకలనం. ఈ సంకలనం ఎందరో ప్రముఖుల వ్యాసాలున్నాయి – డయాస్పోరా సాహిత్యాన్ని నిర్వచిస్తూ, దాని వల్ల తెలుగు సాహిత్యం చూడగలిగే కొత్త అంచులు, చేరగలిగే కొత్త తీరాలు, సంతరించుకునే కొత్త హంగులను విశదీకరిస్తూ. మొట్టమొదటగా తెలుగు సాహిత్యంలో డయాస్పోరా అనే మాటకు ఒక నిర్వచనం ఇవ్వడానికి పూనుకుంది వేలూరి వేంకటేశ్వరరావు గారు. డయాస్పోరా అన్నది ఒక గ్రీకు పదం. కీ.పూ. 586 లో యూదుజాతి వాళ్ళు దేశభ్రష్టులై, చెల్లాచెదరైన సందర్భంలో వారి నుద్దేశించి వాడిన పదం. అయితే ప్రస్తుత సందర్భంలో ఆర్థికంగానో, ఉద్యోగం వల్లనో, ఉన్నత చదువులు చదువుకుని వాటికి తగిన ఉద్యోగాలను వెతుక్కుంటూనో విదేశాలకు వలస వెళ్ళిన తెలుగు ప్రజలను డయాస్పోరా అనవచ్చా? వాళ్ళు సృష్టించిన సాహిత్యాన్ని ఏదైనా డయాస్పోరా సాహిత్యమవుతుందా?

వేలూరి వారి ఉద్దేశ్యంలో డయాస్పోరాకి ముఖ్య లక్షణాలు కొన్ని ఉంటాయి. అందులో కొన్ని, మాతృదేశ జ్ఞాపకాలు, పెంపుడు దేశంలో మనని పూర్తి భాగస్వాములుగా ఎప్పటికీ ఒప్పుకోరు అనే నమ్మిక, ఎప్పుడో ఒకప్పుడు మనం వెనక్కి తిరిగి మన మాతృదేశానికి వెళ్ళి తీరతాం అన్న నమ్మకం, సామూహిక స్పృహ, దృఢమైన ఏకత్వ నిరూపణ, ఇలా వీటిలో కొన్నైనా సరే అన్నీ కాకపోయినా.

అయితే డయాస్పోరా సాహిత్యానికి నిర్వచనం ఉందా? "స్థానిక సమాజ స్పృహ, సమాజ విశేషాలు, మానసిక సంఘర్షణలు, సంఘటనలు మొదలైన కథావస్తువులుగా ఉన్న రచనలు మాత్రమే అమెరికా తెలుగు డయాస్పోరా రచనలు" – ఇవి కథలు కావచ్చు, కవితలు కావచ్చు, నవలలు కావచ్చు... ఎటొచ్చీ కేవలం కాకినాడ, గుంటూరులాంటి ఊరి పేర్లు మార్చేసి, డెట్రాయిట్, హ్యూస్టన్ లాంటి స్థలం మార్పిడి చేసినంత మాత్రాన అవి డయాస్పోరా రచనలు కాదు అని నా అభిప్రాయం

అంటారు వంగూరి చిట్టెన్‌రాజు గారు. ఆయన రాసిన 'జులపాల కథ' డయాస్పోరా కథకు మంచి ఉదాహరణ. డయాస్పోరా కథల లక్షణాలలో ఒకటి, పాత్రోచితంగా ఇంగ్లీషు వాడవలసిన అవసరం రావడం అంటారు వేలూరి వారు. "అప్పుడు డయాస్పోరేతరులు చదవడానికి ఇబ్బందిగానే ఉంటుంది. అయితే డయాస్పోరాకీ అది అవసరం" అంటారాయన. ఇంకొన్ని లక్షణాలు మిశ్రమ సంస్కృతికని చెప్పడం అంటారు అఫ్సర్‌గారు.

రచయితకు డయాస్పోరా కథలంటే ఒక నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. ఆయన అభిప్రాయంలో "డయాస్పోరా కమ్యూనిటీల ప్రత్యేకత – మిశ్రిత జీవనం, ఏకత్వంలో భిన్నత్వం." అంటే ఆ సాహిత్యంలో ఇదే నిర్వచనం ప్రతిబింబించాలి కదా! ఇక కథలోకి వద్దాం.

సాధారణంగా అమెరికాకు వచ్చే చాలామంది చదువుకోసం వస్తారు. ఈ మధ్య ఉద్యోగాలకోసం వచ్చేవారి సంఖ్య కూడా ఎక్కువే. అయితే చదువుకోసం వచ్చి స్థానిక ఆడపిల్లలను పెళ్ళి చేసుకోవడం, అక్కడ స్థిరపడిపోవడం జరుగుతూనే ఉంటుంది. ఆడ, మగ మధ్య కలిగే అనుబంధానికి వారి వారి మాతృభాషలూ, మాతృదేశాలూ అడ్డురావు. అది మనిషికి మనిషికీ ఉండే అనుబంధమే.

కథలో అలాంటి జంటే రాజ్, జెన్నీలు. కథంతా ఉత్తమ పురుషలో నడుస్తుంది. కథను జెన్నీ తన మనోభావాలు వ్యక్తం చేస్తూ నడిపిస్తుంది. జెన్నీ అమ్మమ్మ (మామీ) బోస్టన్ దగ్గర బిల్లెరికా అనే ఊళ్ళో ఉంటుంది. జెన్నీ అక్కడే పెరిగింది కూడా. మామీ ఆరోగ్యం సరిగా లేకపోవడం, ఆమెను చూసి రెండేళ్ళవడంతో జెన్నీ తన భర్త, పాప ఎమిలీతో కలసి వెళ్ళి క్రిస్మస్ కూడా అక్కడే జరుపుకోవాలని అనుకుంటుంది. రాజ్ తల్లిదండ్రులు ఇండియా నుంచి రాజ్ కుటుంబంతో ఉండడానికి కొద్దికాలం కోసం వచ్చారు. రాజ్ ఆ చలి భరించడం కష్టమని, అమ్మా, నాన్నలు ఒక్కరే ఉండాల్సి వస్తుందనే కారణం వల్ల తను రానంటాడు. వాదోపవాదాలు జరుగుతూంటాయి. అసహనాలు పెరగడం, కౌన్సిలర్లతో థెరపీల వరకూ వచ్చింది.

రాజ్ రాకపోయినా తనే పిల్లను తీసుకుని వెళ్ళాలని నిర్ణయించుకుంటుంది జెన్నీ. క్రిస్మస్‌కి గిఫ్ట్ తీసుకెళ్ళడం అమెరికాలో ఒక ఆనవాయితీ. అయితే మామీకి ఏమి తీసుకెళ్ళాలని అడుగుతుంది రాజ్‌ని. 'ఏముందీ, ఓ గిఫ్టు కార్డు తీసికెడితే పోలే!' అంటాడతాను. అలాగే ఒక 500 డాలర్ల గిఫ్టు కార్డ్ ఒకటి తీసుకుని ఇస్తాడు మామీకి ఇవ్వమని. జెన్నీకి తృప్తిగా ఉండదు. తన చిన్నప్పటిలాగానే ఎవరికి ఏమవసరమౌతుందో ఎంతో ఆలోచించి గిఫ్ట్ కొనడంలో ఉన్న ఆనందం, తృప్తి ఏదో గిఫ్టు కార్డ్ కొని ఇవ్వడంలో లేదనుకుంటుంది. తను మామీ కోసం బ్లూ ఎయిర్ ఫిల్టర్ ఆర్డరు చేసి క్రిస్మస్ ముందు డెలివరీ అయేటట్లుగా ఎరేంజ్ చేస్తుంది. మామీకి ఆస్తమా ఉండడం వల్ల ఈ ఫిల్టరు ఉపయోగపడుతుందని జెన్నీ ఆశ. చంటి పిల్లతో వెళ్తూండడం వల్ల ఫ్లైట్ లో ఫస్ట్‌క్లాస్ టికెట్ కొనుక్కుంటుంది – రాజ్ ఏమంటాడో అని ఒక మూల సంశయిస్తూనే. తెలిసిన తరవాత కొంచెం అసహనం చూపిస్తాడే కానీ ఎందుకని ప్రశ్నించడు రాజ్.

జెన్నీని చూడగానే మామీ ఎంతో సంతోషిస్తుంది. జెన్నీ వస్తోందని క్రిస్మస్ ట్రీ పెట్టి ఇల్లంతా దీపాలతో అలంకరిస్తుంది. రాజ్ రాలేదని మామీ కొంచెం చిన్నబుచ్చుకున్నా, చంటిపిల్లను చూపించడానికి, తనను చూడటానికి వచ్చిన జెన్నీ వలన ఎంతో ఆనందపడుతుంది మామీ. తన వివాహ జీవితం గురించి అడిగినప్పుడు జెన్నీ "మామీ! రాజ్, నేనూ ప్రేమించుకున్నాం. మనిషి మంచివాడే. కానీ పెళ్ళికి ముందు కనిపించని ఒక తెర పెళ్ళయ్యాక పెద్దగా గ్లోరిఫై అయ్యింది. అదీ కల్చరల్ డిఫ్ఫరెన్స్." అని చెప్తుంది. అత్త మామలు వెజిటేరియన్స్. ఎంతంటే, ఏడాదికి కొంచెం పైన ఉన్న ఎమిలీకి గెర్బర్ ఫుడ్ (చిన్న బాటిల్స్‌లో దొరుకుతుంది) పెట్టమని ఇస్తే, రాజ్ తనతో పోట్లాడాడు అలాంటి ఫుడ్ వాళ్ళచేత ఎందుకు ఇప్పించావని. ఇలా తనకూ రాజ్ కూ ఉన్న భేదాభిప్రాయాల గురించి చెబుతుంది జెన్నీ. తనను దగ్గరగా తీసుకుని "ఇట్ విల్ బి ఆల్‌రైట్" అంటుంది మామీ.

క్రిస్మస్ రేపనగా ముందురోజు సాయంత్రం రాజ్ వచ్చి సర్‌ప్రైజ్ ఇస్తాడందరికీ. జెన్నీ ఆనందంతో హగ్ చేసుకుంటుంది. బ్లూ ఎయిర్ ఫిల్టర్ వచ్చింది. అయితే అది పెద్దదిగా ఉండడం వల్ల గరాజులో ఉంచి క్రిస్మస్ ట్రీ దగ్గర ఉంచడానికి మరొక గిఫ్ట్ కొందామనుకుని మర్నాడు మాల్‌కి బయల్దేరింది జెన్నీ. మామీ కూడా వద్దన్నా వినకుండా తానూ బయల్దేరుతుంది. జెన్నీ మామీ కోసం ఒక క్విల్ట్ (వివిధ రంగు రంగుల బట్టలతో కలిపి కుట్టిన బొంత) కొంటుంది. మామీ జెన్నీకి, రాజ్‌కి, ఎమిలీకి గిఫ్ట్‌లు కొంది.

క్రిస్మస్ నాడు గిఫ్ట్‌లన్నీ తెరిచి చూస్తారందరూ. ఎమిలీకి డైమండ్ సెట్, పది జతల ఫ్రాకులూ, ఎన్నో బొమ్మలు కొనిచ్చింది మామీ. రాజ్‌కి ఖరీదైన టిఫనీ వాచ్ ఇచ్చింది. ఆరోజు రాత్రి మామీ జెన్నీ ఇచ్చిన క్విల్ట్ కప్పుకునే పడుకుంది. రెండు రోజుల తర్వాత జెన్నీ, ఎమిలీ వెనక్కి వచ్చేస్తారు. మామీ మరో రెండు గిఫ్ట్స్ చేతిలో పెడుతుంది, జెన్నీ మామగారికీ, అత్తగారికీ కూడా.

జెన్నీ వెనక్కి వచ్చిన తరువాత అత్త మామ ముభావంగా ఉంటారు. గిఫ్ట్‌లు ఇచ్చినప్పుడు మాత్రం, మామీ ఎలా ఉందని అడిగారు.

క్రిస్మస్ వెళ్ళిన నాలుగు వారాల తరువాత మామీకి సీరియస్ అయి, పోయిందని వార్త వస్తుంది. జెన్నీ ఎమిలీని తీసుకుని బోస్టన్ వెడుతుంది. ఆమె తల్లీ, భర్తా, తన తండ్రీ కూడా వచ్చారు. మామీ పోయే ముందర తన కాఫిన్‌లో బంధువులందరి ఫోటోలూ పెట్టాలనీ, వాళ్ళ గుర్తుగా తన దగ్గరున్న వస్తువులు పెట్టమనీ, నాన్సీకి (మామీ కేర్ టేకర్) చెబుతుంది. ఆమె కోరినట్లుగా బంధువుల ఫోటోలు, వారి గుర్తుగా ఒక్కో వస్తువు కాఫిన్‌తో పాటు ఉంచడం జరుగుతుంది. తిరిగి వచ్చేస్తుంటే, నాన్సీ మామీ రాసిన ఒక ఉత్తరం చేతికిస్తుంది. ఆ ఉత్తరంలో క్రిస్మస్‌కి జెన్నీ పిల్ల, భర్తతో కలిసి రావడం తనకు ఎంతో ఆనందం కలిగించిందని, తన జీవితానికది ఒక అర్థం మిగిల్చిందని, జెన్నీ తన భర్తతో కలసి ఉండాలని, అభిప్రాయ భేదాలుండడం సహజమని, అలా ఉంటేనే జీవితానికి అర్థం ఉంటుందని, ఆలింగనం (హగ్) ఒక్కటే అన్నింటిని హరిస్తుందని చెప్పి అందరికీ తన ప్రేమను వ్యక్తం చేస్తూ ముగిస్తుంది.

అంత్యక్రియలు ముగించాక ఎమిలీ ఇంటికి తిరిగి వస్తుంది. అక్కడి విశేషాలు చెబుతుంది అందరికీ. మామీ ఇల్లుని ఒక ఛారిటీకి రాసిస్తుంది. బంధువుల గుర్తుగా కాఫిన్‌లో వస్తువులు పెట్టాలన్న మామీ కోరిక మీద మామీ తనకిచ్చిన క్విల్ట్, తన చిన్నప్పుడు మామీ కొన్న డైమండ్ ఇయర్ రింగ్స్ ఇవన్నీ కాఫిన్‌లో పెట్టానని చెబుతుంది. రాజ్ పేర ఏమి పెట్టాలో అని కొంచెం సేపు ఆలోచించి, మామీ తలగడ క్రింద రాజ్ ఇచ్చిన 500 డాలర్ల గిఫ్ట్ కార్డ్ గుర్తొచ్చి, అది కాఫిన్లో పెట్టానని చెబుతుంది ఎమిలీ. 'ఆ కార్డు మీ మామీ కాష్ చేసుకుందా?' అని అడిగి, తనకి తెలీదంటే, వెళ్ళి చెక్ చేస్తాడు రాజ్. ఆ అయిదొందలు కాష్ అవలేదు. ఆ అయిదొందలూ చూస్తుండగానే వేస్ట్ అయిపోయాయని రాజ్ బాధ. విసురుగా వెళ్ళిపోయాడు.

సాయంత్రం రాజ్ వాళ్ళ అమ్మా నాన్నలతో చెబుతున్న మాటలు వినబడతాయి ఎమిలీకి. "అంతగా ఏదో ఒకటి ఆ కాఫిన్ లో పెట్టాలంటే గ్రీటింగ్ కార్డ్ పెట్టచ్చుగా... వాళ్ళందరి పేరునా అంటే అర్థముంది. నే కల్సిందే ఒక్కసారి. ఆ అయిదొందల డాలర్ల కార్డు పెట్టాలా ... జెన్నీయే పెట్టిందట. షీ ఈజ్ స్టుపిడ్. ఆ మామీ ఆస్తంతా ఛారిటీకి రాసిందిట. అది జెన్నీకి ఇవ్వచ్చు కదా? ఇలాగే ఏడుస్తాయి వీళ్ళ రిలేషన్సు..."

విపరీతమైన కోపమొస్తుంది జెన్నీకి. ఎమిలీ చదువుకోసం మామీ తన సేవింగ్స్ ఇచ్చిందని చెప్పలేదు రాజ్‌కి. ఇహ చెప్పాలని నిర్ణయించుకుంటుంది. ఇంతలో రాజ్ బయటకు వచ్చి "జెన్నీ, నీకూ సర్‌ప్రైజ్" అని ఒక పేకెట్ తీసి ఇస్తాడు జెన్నీకి. అందులో ఒక అందమైన ఫ్రేములో జెన్నీ, ఎమిలీ, మామీల ఫోటో. బిల్లరికా వెళ్ళినప్పుడు రాజ్ తీసిన ఫోటో అది. ఫోటో ఇస్తూ, జెన్నీకి, ఎమిలీకి ఒక కిస్ ఇచ్చాడు రాజ్. ఎమిలీ అనుకుంటుంది, రాజ్‌ని ఎలా అర్థం చేసుకోవాలో తెలీదని. అప్పుడే కౌన్సిలర్ దగ్గర

నుంచి ఒక మెసేజ్ వస్తుంది – Personal differences are like air balloons; pop them with a 'Kiss'!

కథ ఇక్కడితో ముగుస్తుంది.

ఇది డయాస్పోరా కథ ఎందుకైందో నేను చెప్పనక్కరలేదు. ఈ కథ ఒక అమెరికన్ అమ్మాయి ఇండియాలో పుట్టి, పెరిగి, అమెరికాలో సెటిల్ అయిన ఒక తెలుగు అబ్బాయిని చేసుకుని సాగిస్తున్న జీవనంలో రెండు విభిన్న సంస్కృతులు కలిగించే ఒడుదుడుకుల ప్రతిబింబం. రెండు సంస్కృతులు ఒక ఇంట్లో కలిసి నివసించడానికి నిర్ణయించుకున్నప్పుడే ఇద్దరికీ తెలుసు రెంటికీ తేడాలుంటాయని. అయితే ఆ తేడాలు ఎంత లోతుల్లో ఉంటాయో అన్నది తరవాత కానీ తెలీదు. అయితే ఎంత తేడాలున్నా, కలిసి ఉండడానికి అవి అవరోధాలు కాదు అని కూడా రచయిత చెప్పకుండానే చెప్పిన కథ ఇది.

పైన సూక్ష్మంగా కథ చెప్పడంలో నేను చెప్పని విషయాలు కొన్ని ఉన్నాయి. ముఖ్యంగా డబ్బుకు సంబంధించినవి. రచయిత చిన్న చిన్న సంఘటనల ద్వారా రెండు విభిన్న సంస్కృతులలో తేడా చాలా తేటతెల్లంగా చెప్పడం జరిగింది. తను వర్క్‌కి వెళ్ళినప్పుడు ఎమిలీని చూసుకోవడానికి రాజ్ తల్లితండ్రులని పిలిపించిన మాట వాస్తవమే. కాని ఆ సాయం రాజ్‌కి, తనకి మధ్య వాదనలు, పోట్లాటలు తెప్పిస్తుందని అనుకోలేదు. అత్తగారికి, జెన్నీ తన అమ్మమ్మను చూడడానికి వెళ్ళడం ఇష్టం ఉండదు. ప్రతి చిన్నదానికీ ఆరాలు. రాజ్ తల్లితండ్రులు అతన్ని వదిలి పెట్టకపోవడంతో ప్రైవసీ లేకుండా పోతుంది జెన్నీకి. ఎమిలీని హేండిల్ చేసే విధానంలో రాజ్ వాళ్ళమ్మకీ, తనకీ చుక్కెదురు. తనేమైనా అంటే, రాజ్ తన తల్లితండ్రులు తననెంతగా ప్రేమిస్తున్నదీ, తనని అమెరికా పంపడానికి ఆర్థికంగా ఎంత కష్టపడిందీ ఏకరువు పెడుతుంటాడు. జెన్నీ ఆలోచనలో, వాళ్ళనంత కష్టపెట్టడమెందుకు? తనే లోన్ తీసుకుని చదువుకోవచ్చు కదా అని. రాజ్ అనుకునేది, అలా సాక్రిఫైస్ చేస్తే దానినే ప్రేమ అంటారని. జెన్నీ, అమ్మనాన్నలతో కలిసి రెస్టారెంటుకు వెళ్ళి లంచ్ చేస్తే, ఎవరికి వారు డబ్బులు పే చేసుకోవడం రాజ్ దృష్టిలో తప్పు. అందులో జెన్నీకి ఏమీ తప్పు కనబడదు.

మామీ చనిపోయినప్పుడు ఆమె కాఫిన్‌లో తనిచ్చిన ఐదొందల డాలర్ల గిఫ్టు కార్డు పెట్టానని జెన్నీ చెబితే అంత డబ్బు వేస్ట్ చేసిందని గింజుకు పోయిన రాజ్, జెన్నీ దృష్టితో చూడగలడా ఎప్పుడైనా?

ఒకే విషయాన్ని ఇద్దరూ ఎంత తేడాగా ఆలోచిస్తారో వాళ్ళ వాళ్ళ పెరిగిన వాతావరణాన్ని బట్టి ఆధార పడుతుంది. ముఖ్యంగా ఆర్థిక పరమైన విషయాలకొస్తే రచయిత రెండు సంస్కృతులలో తేడా స్పష్టంగా చూపిస్తారు.

కథను చెప్పడంలో రచయిత జెన్నీ వైపునుంచి చెప్పించడంలో కథ చదివే తెలుగు పాఠకుడికి తనకు తెలియని సమాజంలో ఆలోచనలు ఎలా ఉంటాయన్నది తెలిసేలా చెప్పడం జరుగుతుంది. కథను క్యూరియాసిటీతో చదివిస్తుంది. బ్రహ్మానందం గారు తన కథ చెప్పే విధానం కథావస్తువుని బట్టి మారుతూంటుంది. ఇది మంచి రచయితకు ఉండాల్సిన లక్షణం.

కౌన్సెలింగ్, పరిస్థితి మితిమీరుతున్నప్పుడు ఒక చిన్న ముద్దు, ఒక కౌగిలింత, అవతలి వారికిష్టమైన బహుమతినివ్వడం లాంటి చిన్న చిన్న పనుల వలన ఇద్దరు మనుషుల మధ్య సయోధ్య కుదిరితే ఇంకేం కావాలి?


కథ చిన్నదే. కథావస్తువు కూడా విస్తృతమైనది కాదు. అందుకే పాఠకులను ఉత్సుకతతో చదివిస్తుంది.

★★★

***పరిచయకర్త –శాయి రాచకొండ, హ్యూస్టన్***

# కథాపుస్తక పరిచయం

"కాసిని కథలు – కాసిని కబుర్లు" పేరు చూడగానే రచయిత్రి శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి గారని ఇట్టే చెప్పవచ్చు. నలభై ఏళ్లుగా తెలుగువారికి కథలు, నవలలు..వాటి ద్వారా సినిమాలు, టీవీ సీరియళ్ళు తన కలం ద్వారా అందిస్తూ, హాస్య రచయిత్రిగా పేరు తెచ్చుకున్న విజయలక్ష్మి గారి 16వ పుస్తకం ఇది. నిజంగానే ఈ పుస్తకంలో కథలు, కబుర్లు చెబుతున్నట్టే ఉన్నాయి. 150 పేజీల ఈ కథలు కబుర్లు విజయలక్ష్మి గారు ఫేస్‌బుక్‌లో వ్రాసుకున్నవే... వాటినన్నిటిని కలిపి అందంగా పుస్తకరూపంలో అందించారు. దీని ఖరీదు రూ. 180/-.




ప్రతులకు ...


*Navodaya Book House,*
*Opp. Arya Samaj Mandir,*
*Kachiguda, HYDERABAD -27*
*Ph 9000413413*

*Achhamgaa Telegu books*
*WhatsApp no. 8558899478*

*Potturi Vijayalakshmi*
*Sri Vaibhava Lakshmi Nilayam*
*H No. 110130650/B1,*
*Road No. 3, Haripuri Nilayam*
*LB Nagar, HYDERABAD-500074*
*Ph. 9949059007*



"మానవ సంబంధాలు దారుణమైపోయినప్పుడు, సమాజంలో అసమానతలు చెలరేగుతున్నప్పుడు, మనుషులు మరుగుజ్జులుగా మారుతున్నప్పుడు.. నా కలం అప్రయత్నంగా కదులుతూ ఉంటుంది...' అంటూ ఆవేదనగా 22 కథలను సమాహారంగా అందించారు శరత్‌చంద్ర గారు. జర్నలిస్ట్, ఉపాధ్యాయుడుగా పనిచేసి, తర్వాత రాజకీయ రంగప్రవేశం చేసి.. ఒక కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసినా సరే.. కలం వదలకుండా సమాజ అభ్యుదయాన్ని ఆకాంక్షించే శరత్‌చంద్ర గారి కొన్ని ఆణిముత్యాలే ఈ "సమాహారం". దీని ఖరీదు రూ.200/-.




ప్రతులకు..

*Shri Sharathchandra*
*D No. 13-6-434/D/50*
*Jyothi Nagar, Pillar No. 90*
*PVNR Express Highway,*
*Golconda Post*
*HYDERABAD – 500 008*
*palapittabooks@gmail.com*

*Palapitta Books*
*D No. 16-11-20/6/1/1*
*403, Vijayasai residency*
*Saleem Nagar, Malakpet,*
*HYDERBAD – 500 036*
*Ph: 9848787284*



1941లో గోరాశాస్త్రి 'Sally' అనే అమెరికన్ కథను కొడవటిగంటి కుటుంబరావుకి ఇస్తూ 'ఇలాంటి కథను మన వాళ్ళెవరన్నా రాయగలరా?' అన్నారు. 'ఇంత కన్నా బాగా రాయవచ్చునే!' కొంకు పొగరుగా జవాబిచ్చి 'నీకేం కావాలి?' అనే నవల రాశారు.

1978లో మిత్రులు మెడికో శ్యాం ని కథకుడు దాట్ల నారాయణమూర్తి రాజు "రెణ్ణిమిషాల్లో అని కథ రాయగలవా?" అని సవాలు విసిరితే తాను రాసిన కథ, తవ్వకాల్లో కనిపించగానే, 'కథామంజరి'కి పంపగానే వాళ్ళు ఏప్రిల్ సంచికలో ప్రచురించారు. అందులోని ఒక భాగమే ఇది. ఎత్తుగడ కాదు.

జాతులు మనుషుల్లో ఎన్ని ఉన్నాయో, అంతకన్నా ఎక్కువే కథల్లో ఉన్నాయి. 'లోకో భిన్న రుచి' అన్నారుగా... కొన్ని కథలు కొందరి నచ్చవు, అంత మాత్రాన వాటి విలువ తగ్గదు. Keats కవితలను ప్రేమించే వాడు Ogden Nash ను ఇష్ట పడడు. రవిశంకర్ బొమ్మలను అభిమానించే వాడికి పికాసో బొమ్మలు పడవు. మనశ్శాస్త్రం మీద డాలీ బొమ్మలు ఆధారపడినట్టు, psycho analysis కొన్ని శ్యాం కథలకు ఆయువు పట్టు. 'రెణ్ణిమిషాల్లో' కథ ఎత్తుగడలో ప్రేమ, పెళ్లి, అనువాదం నిర్వచనాలు ఉన్నాయి.

కథ మధ్య భాగం ఇది: "ఎందుకు రాయలేను? రెండు నిమిషాల్లో ఎన్ని బస్సులు పరిగెత్తాయి? ఎన్ని కార్లు ఆగుతాయి? ఎన్ని కళ్ళు కలుస్తాయి? ఎంతమంది చస్తారు? మరెంతమంది పుడతారు? నాకు ఆవేశాలూ, కోపం, కన్నీళ్ళూ, ఆనందం, సుఖం, శృంగారం, అన్నీ రెండుకి మించని నిమిషాల్లో లభ్యం కావడం, నాకు జరిగిన అవమానాలు కూడా ఇట్టే జరిగిపోయినాయి, అట్టే మాటాడితే రెండు సెకనులలో. ఎంతెంత డ్రామాలయినా రెణ్ణిమిషాలలో జరగొచ్చు, జీవితంలో... ప్రపంచంలో. నేను ఆశ్చర్యపడను." ........

"ఉదయం నిలబడ్డాను జంక్షనులో. భారతదేశం గర్వించదగిన కామధేనువులాంటి ఆవొకటి వచ్చింది. రోడ్డు మీదికి. కాకపోతే అచ్చేసి వదిలేరేమో నాకు తెలీదు. అందంగా కంటికి బాగుంది. దేశానికి పట్టిన చీడ లేక పీడలాటి దుర్మార్గపు లారీ ఒకటి వచ్చింది. ఆవు నిబ్బరంగా హాయిగా నిజాయితీపరుడులా నడిచింది. లారీ దౌర్జన్యంగా రౌడీలా ఒంటి మీద తెలివి లేకుండా నడిచింది. సరిగ్గా ఆ సంఘటన జరగడానికి రెండు నిమిషాలు కాదు, ఇది చదవడానికి పట్టిన సమయం కూడా పట్టదు... ఆవు ముఖంలో ఒకవైపు ముక్క ఎగిరిపోయింది.

"ఎగిరిపోయిన ముక్క ఏమైందో ఎవరికీ తెలీదు. ఆవు చేసిన ఆర్తనాదం తరతరాలుగా మానవులు చేస్తున్న వినపడని విలాపాలకి ప్రతీకలా వుంది. పాపం కన్నీళ్ళు కార్చడానికి కూడా ఆ ఆవుకి రెండు కళ్ళూ లేవు. ఉన్న ఒక్క కన్నూ బిక్కచచ్చి నీళ్ళు కార్చటం మర్చిపోయింది. ఇక్కడితో ఆపి రెణ్ణిమిషాల్లో కథ ముగించవచ్చు.

ఇక రెండు నిమిషాల్లో మానవజాతి సజీవచరిత్రని గ్రహించవచ్చు. కానీ ఎన్నో ఏళ్ళ సంస్కారం, విజ్ఞానం, వివేకం, ఆవేశం, కన్నీళ్ళూ ఉంటేనే గాని కాగితానికి ఎక్కవు. ఎక్కినా, మళ్ళీ అన్నేళ్ల సంస్కారం, విజ్ఞానం, వివేకం, ఆవేశం, కన్నీళ్ళూ ఉన్నవారు... గాని కనీసం చెమర్చటం కూడా చేయరు. వాళ్ళు కూడా రెండు నిమిషాల్లో కళ్ళు తుడుచుకుని పక్క పేజీలో అర్ధనగ్న దృశ్యాన్ని చూస్తారు మిగతావి ఊహిస్తూ. "

ఆఖరి వాక్యం గమనార్హం. మనస్తత్వ పరిశీలన, తాత్వికతను ఇంతకన్నా క్లుప్త సుందరంగా వ్యాఖ్యానించటం కష్టం. చదవవలసిన కథ. చదవాలనిపిస్తే, ఏప్రిల్, కథామంజరి చూడండి.

*రామవరపు గణేశ్వరరావు, హైదరాబాద్*

రామ (తెల్లని) చిలుక (?) ముఖ చిత్రంతో వెలువడిన ఈ సంచిక ఎప్పటిలాగానే పది కథలతో వెలువడింది.

'నువ్వు ఎవరినైనా ప్రేమిస్తున్నప్పుడు అలా అని చెప్పడం మాత్రం ఎన్నడూ మర్చిపోవద్దు'– సందేశం ఇముడ్చుకుని, పరిచయంతోనే కళ్ళలో నీళ్ళు తెప్పించిన కథ 'సౌమ్యం.' ఒక దయాస్పోరా అంటూ శాయి రాచకొండ పరిచయం చేసిన కథతో మరో పుస్తకం చదవాల్సిన పుస్తకాల జాబితాలోకి చేరింది. థాంక్ యూ శాయి గారూ!

'పరువు ప్రతిష్ట' శరత్‌చంద్ర గారి కథ. కొండకచో యండమూరి శైలిని గుర్తుకు తెస్తాయి వీరి రచనలు. బహుమతులూ బాగానే గెల్చుకున్నాయి. బాగుంది. ఇందులో గ్రూప్స్‌లో ఎమ్మార్వో సర్వీస్ వచ్చింది – అని ఒక చోట వచ్చింది. అసలు గ్రూప్స్‌లో ఎమ్మార్వో సర్వీస్ ఉందా? డిప్యూటీ ఎమ్మార్వో కేడర్ మాత్రమే నింపుతారనుకుంటాను. పోనీ అదే ఉద్దేశంతో రాశారనుకున్నా ఎమ్మార్వోగా విధులు నిర్వహించినట్టే కొనసాగించారు.

తన అమాయకత్వంతో, ప్రేమతో సవతితల్లిలో మార్పు తెచ్చిన కథ గాయత్రి గారి 'అమ్మ ప్రేమ' కథ. 'మల్లెల కంటే మొల్లలంటేనే ఎక్కువ ఇష్టం.' మొల్లలంటే సన్నజాజులా? గూగుల్ వెతికితే 'మొలలు' అనే పదానికి మాత్రమే అర్థం చూపిస్తోంది పిచ్చిది. కృష్ణ శాస్త్రిగారి పాట 'ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు, పూలిమ్మని రెమ్మ రెమ్మకు....' లో 'మొల్లలివే మమ్మేలుమా స్వామికి..' అని ఉంది. మొల్ల అంటే మల్లె అనే అర్థం బ్రౌణ్య నిఘంటువు చూపిస్తోంది. బహుశా ప్రాస కోసం రాశారేమో సామి!

అంకురార్పణ – గొర్తి వాణి శ్రీనివాస్ గారి కథ. కాస్త... కాదు... కాదు... బాగానే చిరాకు తెప్పించిన కథ. మొదలు మొదలే 'కలుగులో ఎలుకలా ఇంట్లోంచి బయటికొచ్చి చూశాను.' – ఏమి ఉపమానమో! పోనీ సరిపుచ్చుకుందామా అంటే సందర్భం కూడా కుదరలేదు. 'కౌరవులు పాండవులకు సూది మోపినంత చోటు కూడా మీకివ్వం అన్నట్లు' ఇదోటి. ఎవరు కౌరవులు, ఎవరు పాండవులు? జనం, ట్రాఫిక్కా? ఏదో విరోధాభాసంలా లేదూ? న్యూ ఢిల్లీలో సెంట్రల్ యూనివర్సిటీ ఉందా? ఉన్న ఏడో ఎనిమిదో యూనివర్సిటీల్లో సెంట్రల్ యూనివర్సిటీ స్థాయి ఉన్నవి గదా అంటే ఏం చెబుతాను? పోనీ అదేదో పేరే రాయొచ్చు గదా అనడం తప్పు. 'ఎంఫిల్ చేస్తున్న నేను మంచి ఫీల్ కోసం...' ప్రాస కోసం తిప్పలు కాబోలు. ఇలాంటివి కథాగమనం మీంచి దృష్టి తప్పిస్తాయి. కనీసం నాకైతే. నా సమయం విలువైనదేగా? అదీ మీరూ గమనంలో ఉంచుకోవాలిగా?

'ఒకోసారి ఏం చెప్పినా వినే వారేరీ?' ఎవరికి ఎవరు ఏమి చెప్పాలనుకుంటున్నారు? పౌరులు సైకిల్‌పై తిరిగే విధానంపై ప్రభుత్వం చట్టం తేవాలా? దాదాపు 1500 చదరపు కిలో మీటర్ల వైశాల్యం, మూడున్నర కోట్ల జనాభా ఉన్న ఢిల్లీలో!! ఎంత సాంద్రత? ప్రాక్టికాలిటీ??

పుట్టి పెరిగిన మూలాలు ఉన్న పల్లెటూరా? మరి బడికి సెలవులు ఇస్తే పల్లెలో ఉండే బాబాయి వాళ్ళింటికి వెళ్ళడం మాటేమిటి? మొత్తం మీద కథ చదివాక మహర్షి సినిమా గుర్తుకు వచ్చినా తప్పు లేదు. ఏమిటో... కథ రాయాలని రాసిన కథ మాదిరిగా ఉంది!

'రెణ్ణిమిషాలు.' 'రెండు నిమిషాలు' అంటే దాట్ల నారాయణమూర్తి అని శ్యామ్‌గారి మిత్రుడు కొట్టినా కొడతాడు. ఈయన, అదే మెడికోశ్యామ్, దేని మీదనైనా కథ రాసేస్తాడు. రచయితలు ఎవరైనా 'ఒక్క నిమిషం' అనే కథ రాస్తే ఇప్పుడే రాసేయండి. ఈలోగా ఈయనే రాస్తే ఖర్మ! ఈ కథలో 'ఏమీ లేదు' అందామంటే రెణ్ణిమిషాల వంకతో చెప్పాల్సినవన్నీ చెబుతాడు. ఏమి చెప్పాడూ అని చూస్తే ఒక ప్లాట్ అంటూ ఇదమిత్థంగా కనబడదు. 'కనబడదా' అంటే 'చూడు' అంటాడు. చూశామనుకో... ఏదో కనబడుతుంది. అరె...ఇందాక 'కనపడలేదే' అంటే 'చూడలేదుగా...' అనొచ్చు. వదిలేయండి. అంతా అర్థం అవుతుందని, ఏమీ అర్థం కాకుండా రాస్తున్నట్టుంది.

చాగంటి తులసి గారి మూడు ప్రపంచాలు... సలహా బాగుంది. అవసరమైన వారు పాటించుట అనివార్యం.

'ఆశానిశాంతంలో', సత్యం మందపాటి గారి కథ బాగుంది. (ఎందుకో చెప్మా! ప్రతి సంచికలోనూ అతిథుల కథలు బాగుంటాయి.) కానీ ఒక్క వాక్యం ఇబ్బంది పెట్టింది. 'అక్కడ దేశంలో ఏదో తింటే ఇక్కడ ఈ మహమ్మారి రావడం ఏంటో?' నిర్ధారితంకానీ విషయాలు రాయొచ్చా? సత్యంగారి నడగాలి.

ప్రతీ నెలా ఈ సమీక్షను ఎవరైనా చదువుతున్నారో లేదో గానీ... చదివి ఎవరైనా తలంటితే బాగుణ్ణు!!! షరా: ఇవి నా అభిప్రాయాలు మాత్రమే. మీకూ అలాగే అనిపించాలని లేదు.

**–రాంబో**

# ఏనుగమ్మ ఏనుగు ...
# మా ఊరొచ్చిందేనుగు!!!

వెంకట శివకుమార్



✆ 9160730005

**దీపావళి 2022 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***"ఆ పొలం, ఇల్లు ఇచ్చేయ్యమని నేను కూడా ఇలాగే అడిగాను" అని కోపంగా అన్నాడు. "అడవిలో వుండే మృగాలకన్నా మన మధ్యే తిరుగుతున్న తోటి మనుషులతోనే ప్రమాదం ఎక్కువ అన్నావు కదా! అందుకే నీ పిల్లల్ని అడవి మధ్యలో వదిలేసాను. నువ్వు మంచి అనుకున్న మృగాలు నీ పిల్లల్ని కాపాడుతాయా?"***

ఒక పెద్ద దట్టమైన అడవి. ఆ రోజు పొద్దునే ఈ అడవిలో నివసించే జంతువుల హడావుడి మొదలయ్యింది. అడవికి రాజు సింహం తన పిల్లల్ని తీసుకుని ఎక్కడికో బయలుదేరింది. వీటికి దారి మధ్యలో పులి ఎదురయ్యింది. "పొద్దునే ఎక్కడికి సింహం మామా?" అని పులి ఆప్యాయంగా అడిగింది.

"ఎక్కడికి ఏంటి? అక్కడికే.... సమయం కూడా అయ్యింది కదా.... మీ పిల్లలు రావడం లేదా?" అని సింహం ఆశ్చర్యపోతూ అడిగింది.

"ఎందుకు రారు? మా పిల్లలు ఇంకా తింటున్నారు. ఇదిగో అయిదు నిమిషాల్లో వస్తున్నాం!" అని పులి చెప్పింది.

"ఏం పెట్టావు ఏంటి?" అని సింహం మళ్ళీ అడిగింది.

"ఇప్పుడే అలా బయటకి వెళ్ళి రెండు లేత కుందేళ్ళు పట్టుకొచ్చాను. పసి పిల్లలు కదా, నమలడానికి కాస్త తేలికగా వుంటుంది అని...." అని నవ్వుతూ చెప్పింది.

"సరే సరే మళ్ళీ కలుస్తాను ...." అంటూ సింహం తన పిల్లలతో కలిసి అక్కడ నుంచి వెళ్లింది.

ఆ అడవి మధ్యలో కలువలు అందంగా పరుచుకున్న ఒక విశాలమైన కొలను. దాన్ని ఆనుకుని ఆకాశాన్ని తాకుతున్న నల్లటి కొండలు. ఆ కొండల మధ్య నుంచి దోబూచులాడుతున్న ఎర్రటి సూరీడు. కొలను పొడవునా ఏపుగా పెరిగిన రకరకాల చెట్లు. ఆ చెట్ల మధ్యన నిలుచుని ఆనందంగా అరటిపండ్లు తింటూ ఉంది ఒక పిల్ల ఏనుగు. దాన్ని ప్రేమగా చూస్తూ నిల్చుని ఉంది తల్లి ఏనుగు.

"కథ చెప్పవే అమ్మా...." అని అంది పిల్ల ఏనుగు అరటి పండ్లు నములుతూ..."అప్పుడేనా.... మిగతా పిల్లలు కూడా రానివ్వు" అంటూ అవి వచ్చే దారి వైపు చూసింది తల్లి ఏనుగు.

అప్పుడే ఎలుగుబంటి తన పిల్లల్ని తీసుకుని వచ్చింది. వాటిని చూసి ఆ పిల్ల ఏనుగు ఆనందంగా తొండం ఊపింది. వాటికి స్వాగతం పలికింది. కాసేపటికి సింహం కూడా తన పిల్లల్ని తీసుకుని వచ్చింది. అవి రావడంతోనే అంతా నిశ్శబ్దం.

"ఏమోయ్ ఏనుగు! మా పిల్లలు జాగ్రత్త..." అని చెప్పి సింహం వెళ్లిపోయింది.

'మిగతా పిల్లలు కదా జాగ్రత్తగా వుండాలి!' అని ఏనుగు మనస్సులోనే అనుకుంది.

సింహం పిల్లలు మెల్లగా లోపలికి వచ్చారు. అప్పుడే కుందేలు తన పిల్లల్ని తీసుకుని వస్తూ ఉంది. వాటికి ఎదురుగా సింహం వచ్చింది.

"ఇదిగో సింహం రాజా... నిన్న మీ పిల్లలు మా పిల్లల్ని కొరికారు!" అని కుందేలు కోపంగా అంది.



"మీ వాళ్ళనే కాస్త దూరంగా వుండమని చెప్పు. మా వాళ్ళకి అసలే ఆకలి ఎక్కువ!" అని నవ్వుతూ చెప్పి అక్కడ నుంచి సింహం వెళ్లిపోయింది. ఆ మాటతో కుందేలు చిన్నబుచ్చుకుంది.

సమయానికి చెట్టు మీద నుంచి కోతి పిల్లలు దిగి వచ్చాయి. ఉడుత పిల్లలు గెంతుకుంటూ వచ్చాయి. అప్పటికే వచ్చిన నక్క పిల్లలు మూలన నక్కి కూర్చున్నాయి. ఇంకో మూల నుంచి తోడేలు పిల్లలు కుందేలు పిల్లల వైపు ఆకలితో చూస్తున్నాయి. కోతి పిల్లలు కుదురుగా కూర్చోవడం లేదు. ఇంతలో ఏనుగు గురువు వచ్చింది. తొండం పైకెత్తి గట్టిగా అరిచిన శబ్దంతో అందరూ నిశ్శబ్దం. అందరి వైపు చూసింది. కోతిపిల్ల సింహం పిల్ల మీసం పట్టుకుని లాగింది. అలా చేసింది ఎలుగుబంటి పిల్ల అని సింహం పిల్ల పొరపాటు పడింది. దాని వైపు కోపంగా చూసింది. ఎలుగుబంటి పిల్ల గురువుకి ఫిర్యాదు చేసింది. కోతిని కుదురుగా కూర్చోమని ఏనుగు మందలించింది.

"ఈ రోజు ఏం నేర్చుకుందాం?" అని ఏనుగు అడిగింది.

"మంచి కథ చెప్పండి గురువు గారు...." అని నోరు తెరిచి పళ్ళు చూపిస్తూ కోతి కిలకిల నవ్వింది. కోతిని చూసి మిగతా అందరూ నవ్వారు. అప్పుడే గాడిద ఆలస్యంగా వచ్చింది.

"ఏం గాడిదా... ఎందుకు ఆలస్యం అయ్యింది?" అని గురువు అడిగింది.

"నిద్ర లేచే సరికి ఆలస్యం అయ్యింది" అని ఆవలిస్తూ చెప్పింది.

"సోంబేరి గాడిద...." అని దాన్ని తిట్టింది. అందరూ పకపక నవ్వేసారు.

ఏనుగు గురువు తన ఆసనం మీద కూర్చుంది. గొంతు సవరించుకుంది.

కథ మొదలు పెట్టింది...

"కొన్నాళ్ళ క్రితం... మన అడవికి కొద్ది దూరంలో వుండే ఊరు చిత్రపురం. అక్కడ నాగయ్య కుటుంబం నివసిస్తూ వుండేది. వాళ్ళకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి పేరు చంటి. అమ్మాయి పేరు మీను. వాళ్ళ కుటుంబం చూడముచ్చటగా వుండేది. వాళ్ళ ఇంటి ముందే అందమైన తోట వుండేది. జామ చెట్టు మీద రామచిలకలు వచ్చి వాలేవి. వాటిని చూసి మీను కళ్ళు మిలమిల మెరిసేవి. రంగు రంగుల సీతాకోకచిలుకల వెంట చంటి పరిగెడుతూ ఆడుకునేవాడు. వీళ్ళ వెనుక వెంటపడుతూ అమ్మ లక్ష్మి గోరు ముద్దలు తినిపించేది. పక్కనే పాకలో ఆవులు కూడా ఉన్నాయి. మీను అయితే లేగ దూడ తోక పట్టుకుని తిరిగేది. అలా ఆ ఇల్లు, కుటుంబం ప్రకృతి ఒడిలో స్వేచ్ఛగా బ్రతుకుతూ వుండేది.

ఆ ఊరి జమీందారు పేరు చలపతి. వాడికి నాగయ్య ఇంటి మీద, పొలం మీద కన్ను పడింది. నాగయ్య పొలంలో ఉన్నాడు. చలపతి తన మనుషులతో వచ్చాడు.

"ఏంటి నాగయ్యా? నేను చెప్పిన విషయం ఏం ఆలోచించావు?" అని కోపంగా చూస్తూ అన్నాడు.

"అయ్యా! మా తాతల కాలం నాటి నుంచి ఈ పొలంనే నమ్ముకుని బ్రతుకుతున్నాం. ఇప్పుడు మీరు ఈ పొలాన్ని మీకు అమ్మేసి వెళ్లిపోమంటున్నారు? అది ఎలా కుదురుతుంది? మాకు ఈ ఇల్లు, పొలం అంటే ప్రాణం" అని సమాధానం చెప్పాడు.

దూరంగా ఇంటి ముందు ఆడుకుంటున్న చంటి, మీనుల వైపు చూసాడు.

"సరే నీ నిర్ణయం చెప్పావు. పిల్లలు జాగ్రత్త. అడవికి దగ్గరగా ఉన్నావు. క్రూర మృగాలు వుంటాయి. ఎప్పుడైనా దాడి చెయ్యొచ్చు!" అని చలపతి బెదిరిస్తూ అన్నాడు.

"అడవిలో వుండే మృగాలకన్నా మన మధ్యే తిరుగుతున్న తోటి మనుషులతోనే ప్రమాదం ఎక్కువ దొర!" అని నాగయ్య అమాయకంగా అన్నాడు. చలపతి కోపంగా అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

మరుసటి రోజు నాగయ్య పొలంలో పని చేసుకుంటూ ఉన్నాడు. లక్ష్మి పరిగెట్టుకుంటూ వచ్చింది. బాగా ఏడుస్తూ ఉంది.

"ఏమైంది లక్ష్మీ? ఎందుకు ఏడుస్తున్నావు?" అని నాగయ్య కంగారుపడుతూ అడిగాడు.

"మన పిల్లలు కనిపించడం లేదు" అని భోరున ఏడుస్తూ చెప్పింది. ఇద్దరూ కలిసి అక్కడ నుంచి ఇంటి వైపు పరిగెత్తారు. చుట్టుపక్కల వెతికారు. లక్ష్మి బాగా ఏడుస్తోంది. నాగయ్యకి ఏం చేయాలో అర్థం కావడం లేదు. జమీందారు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

"నేను ఇప్పుడే వస్తాను. నువ్వు కంగారు పడొద్దు" అని చెప్పి అక్కడ నుంచి జమీందారు ఇంటి వైపు పరుగు తీసాడు.

దట్టమైన అడవిలో చంటి, మీను ఒక చెట్టు కింద పడిఉన్నారు. మొదట మీనుకి మెలకువ వచ్చింది. అటు ఇటు చూసింది. చుట్టూ చెట్లే ఉన్నాయి. చాలా భయపడింది.

"అన్నయ్యా, అన్నయ్యా" అంటూ పక్కనే పడివున్న చంటిని లేపింది. చంటి కదలడం లేదు. మీనుకి ఏడుపు వచ్చేస్తోంది. "అమ్మా, నాన్నా!" అంటూ ఏడుస్తూ ఉంది. కాసేపటికి చంటి లేచాడు. ఒక్క క్షణం ఏం మాట్లాడ లేదు. చెల్లి మీనుని దగ్గరకు తీసుకున్నాడు. "నువ్వేం భయపడకు. నేను ఉన్నాను కదా! మనం ఇంటికి వెళ్లిపోదాం" అని ధైర్యం చెప్పాడు.

ఇద్దరూ ఒక్కో అడుగు వేసుకుంటూ నడుస్తున్నారు. "అన్నయ్య! బాగా ఆకలి వేస్తుంది" అని అంది.

చంటి చుట్టూ చూసాడు. కొంచెం దూరంలో మామిడి చెట్టు కనిపించింది. దాని మీద చాలా కోతులు ఉన్నాయి. "నువ్వు ఇక్కడే వుండు" అని మీనుని ఒక దగ్గర కూర్చోబెట్టాడు. తను చెట్టు ఎక్కడానికి ప్రయత్నం చేస్తున్నాడు. కుదరడం లేదు. జారి క్రింద పడిపోయాడు. మళ్ళీ ప్రయత్నం చేసాడు. మళ్ళీ జారిపోతున్నాడు. ఒక కొమ్మకి మామిడి పండు వ్రేలాడుతూ ఉంది. దాన్ని అందుకోడానికి ముందుకు వంగాడు.

మీను కూర్చొని ఉంది. కొంచెం దూరంలో కుందేళ్ళు తిరుగుతూ ఉన్నాయి. వాటిని చూసి నవ్వుతూ ఉంది. ఆ కుందేళ్ళు దగ్గరకి వస్తున్నాయి. మళ్ళీ భయంతో దూరంగా పారిపోతున్నాయి. అక్కడ చంటి ఆ చెట్టు సగం ఎక్కాడు. ఒక కొమ్మకు ఉన్న మామిడి పండు కోయడం కోసం ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. ఆ చెట్టు మీద ఉన్న కోతుల గుంపు చంటిని చూసి గోల చేస్తున్నాయి. ఇంకో కొమ్మ మీద ఒక తల్లి కోతి ఉంది. అది చంటి వైపే జాలిగా చూస్తూ ఉంది. ఆ పండు కోసే ప్రయత్నంలో చంటి క్రింద పడిపోయాడు. చాలా నిరాశ చెందాడు. చెల్లి దగ్గరకి వచ్చాడు.

"పండు ఎక్కడ?" అని ఆశగా అడిగింది.

"అది అందడం లేదు" అని బాధగా అన్నాడు. ఆ తల్లి కోతి పండుని తెంచింది. వీళ్ళకి దగ్గరగా వచ్చింది. ఆ పండుని వీళ్ళ వైపే విసిరేసింది. మళ్ళీ చెట్టు ఎక్కి కూర్చుంది. గెంతుతూ ఏవో సైగలు చేసింది. మిగతా కోతులు కూడా పండ్లు కోసి క్రిందకి విసిరాయి. అలా వాళ్ళ ముందు చాలా మామిడి పండ్లు ఉన్నాయి.

ఇద్దరూ కడుపునిండా తిన్నారు. కొన్ని కుందేళ్ళ వైపు విసిరారు. ఉడతలకి పెట్టారు. మీను చాలా ఆనందంగా ఉంది. అడవిలో ఉన్న సంగతి మరచిపోయింది. ఒక్కసారిగా పులి గాండ్రింపు వినిపించింది. ఇద్దరూ చెట్టు చాటున దాక్కున్నారు. కోతులు చెట్టు మీద గోల చేస్తున్నాయి. కుందేళ్ళు తొర్రల్లో దూరిపోయాయి. ఉడతలు చెట్లెక్కేసాయి. చంటి, మీను భయంతో వణికి పోతున్నారు. పులి వీళ్ళని చూసేసింది. చంటి, మీను భయంతో పరిగెడుతున్నారు. "నువ్వు ఇటు వైపు వెళ్ళు" అని మీనుతో చెప్పాడు. తను పులి పైన రాయి విసిరాడు. పులి చంటి వైపు పరిగెట్టింది. అలా ఇద్దరూ దారి తప్పారు. మీను ఒక వైపు వెళ్లింది. చంటి ఇంకో వైపు వెళ్ళాడు. పులి చంటిని తరుముతోంది.

నాగయ్య జమీందారు ఇంటికి వచ్చాడు. జమీందారు వాలు కుర్చీలో పడుకుని ఉన్నాడు. చుట్ట కాలుస్తున్నాడు. నాగయ్య జమీందారు కాళ్ళ దగ్గర చేరాడు. "అయ్యా! నా బిడ్డలు కనిపించడం లేదు. పసి కూనలు. అమాయకులు!" అని వేడుకున్నాడు.

"ఆ పొలం, ఇల్లు ఇచ్చేయమని నేను కూడా ఇలాగే అడిగాను" అని కోపంగా అన్నాడు. "అడవిలో వుండే మృగాలకన్నా మన మధ్యే తిరుగుతున్న తోటి మనుషులతోనే ప్రమాదం ఎక్కువ అన్నావు కదా! అందుకే నీ పిల్లల్ని అడవి మధ్యలో వదిలేసాను. నువ్వు మంచి అనుకున్న మృగాలు నీ పిల్లల్ని కాపాడుతాయా?" అని చెప్పి వెటకారంగా నవ్వాడు.

నాగయ్యకి చాలా కోపం వచ్చింది. "అవును దొరా! ఇప్పుడు కూడా చెప్తున్నా. అడవిలో వుండే మృగాలే మనుషులకన్నా మంచివి!" అని ఏడుస్తూ అన్నాడు. "లేకుంటే పసి పిల్లల్ని అడవిలో ఎలా వదిలేస్తావు?" అనుకుంటూ అడవి వైపు పరిగెట్టాడు. "ఒరేయ్ నాగయ్య! నీ పిల్లలు బ్రతికి తిరిగి వస్తే, నీ పొలం, ఇల్లు జోలికి రాను" అని కేకేసి అన్నాడు. నాగయ్యకి ఆ మాటల్లో వెటకారం అర్థమయ్యింది. ఆగకుండా అడవి వైపు పరుగు తీసాడు. జమీందారు పొగరుగా చూస్తూ మరో చుట్ట వెలిగించాడు.

మీను పరిగెత్తి పరిగెత్తి అలసిపోయింది. "అన్నయ్యా, అన్నయ్యా" అంటూ ఏడుస్తూ ఉంది. అప్పుడే ఒక తోడేలు గుంపు మీనుని చూసింది. నాలుకలు బయట పెట్టి మీను వైపు వస్తున్నాయి. మీను భయంతో కళ్ళు మూసుకుంది. తోడేళ్ళ మీద

రాళ్ళు విసురుతూ చంటి అక్కడకి వచ్చాడు. చెల్లిని దగ్గరకి తీసుకున్నాడు. తోడేళ్లు దగ్గరకి వచ్చేస్తున్నాయి. అప్పుడే మళ్ళీ పులి గాండ్రింపు వినిపించింది. తోడేళ్లు పారిపోయాయి. పులి దగ్గరకి వచ్చేస్తోంది.

నాగయ్య ఇంటిని దాటి అడవి వైపు వెళ్తున్నాడు. అది చూసి లక్ష్మి కూడా పరిగెట్టింది. ఇద్దరూ అడవి వైపే పరిగెడుతున్నారు. అక్కడ చంటి, మీనుల మీద దూకడానికి పులి సిద్ధంగా ఉంది. ఇద్దరూ గట్టిగా కళ్ళు మూసుకున్నారు. "అమ్మా, నాన్నా!" అంటూ కేక పెట్టారు. అప్పుడే ఒక ఏనుగుల మంద అక్కడకి వచ్చింది. అందులో నుంచి ఒక ఏనుగు, పులిని అక్కడ నుంచి తరిమి కొట్టింది.

కొన్నాళ్ళ క్రితం, జమీందారు చెరకు తోటల్లోకి ఏనుగుల మంద దాడి చేసింది. అప్పుడు జమీందారు తుపాకితో దాడి చేసాడు. అన్నీ ఏనుగులు అడవిలోకి పారిపోయాయి. పొలం పని చేసుకుని నాగయ్య ఇంటికి వస్తున్నాడు. జమీందారు పొలం దగ్గర గొయ్యిలో ఒక పిల్ల ఏనుగు పడి ఉంది. ఇంటికి పరిగెట్టుకుంటూ వెళ్ళాడు. లక్ష్మి, పిల్లలతో కలిసి మళ్ళీ గొయ్యి దగ్గరకి వచ్చాడు. గొయ్యిలో దిగి ఏనుగుకి తాడు కట్టాడు. అందరూ కలిసి చాలా కష్టపడి దాన్ని బయటకి లాగారు. తమతో ఇంటికి తీసుకుని వెళ్లారు. ఆ రాత్రంతా దాన్ని బాగా చూసుకున్నారు. చంటి, మీను కలిసి అరటి పండ్లు తినిపించారు. మరుసటి రోజు పొద్దునే ఏనుగుల గుంపు మళ్ళీ వచ్చింది. జమీందారు తుపాకీలతో సిద్ధం అయ్యాడు. నాగయ్య వాళ్ళని అడ్డుకున్నాడు. పిల్ల ఏనుగుని తీసుకుని ఏనుగుల మంద దగ్గరకి వెళ్ళాడు. అవి గట్టిగా ఘీంకరిస్తున్నాయి. నాగయ్యతో పిల్లలు కూడా ఉన్నారు. పిల్ల ఏనుగు మందలో కలిసిపోయింది. నాగయ్య, పిల్లలు ఆనందంగా ఇంటికి వచ్చారు.

పులిని తరిమింది ఆ తల్లి ఏనుగే. పక్కనే ఆ రోజు కాపాడిన పిల్ల ఏనుగు ఉంది. వాళ్ళని తొండంతో వీపు పైన ఎక్కించుకుంది. అడవి మొదటికి వచ్చిన నాగయ్య, లక్ష్మిలకి ఏనుగుల చప్పుడు వినిపించింది. భయంతో ఆగిపోయారు. కాసేపటికి ఏనుగుల మంద కనిపించింది. ఒక ఏనుగు మీద చంటి, మీను ఆనందంగా ఉన్నారు. వాళ్ళ చేతుల్లో మామిడి పండ్లు ఉన్నాయి. చాలా సంతోషంగా ఉన్నారు. ఏనుగు పైనుంచి పిల్లలు క్రిందకి దిగారు. అమ్మ, నాన్న దగ్గరకి పరిగెట్టుకుంటూ వచ్చారు. ఏనుగుల గుంపు అడవిలోకి వెళ్ళి పోయింది. పిల్లల్ని తీసుకుని నాగయ్య, లక్ష్మి ఇంటికి వచ్చేసారు. "అవును నేను అనుకున్నది నిజం. అడవిలో వుండే మృగాలే మనుషులకన్నా మంచివి" అని కళ్ళలోంచి వస్తున్న కన్నీళ్లు తుడుచుకున్నాడు.

ఇలా కథ చెప్పడం పూర్తి చేసింది గురువు ఏనుగు. "ఎలా ఉంది కథ?" అని గురువు ఏనుగు అడిగింది. ఒక్కొక్కరూ ఒక్కో జవాబు చెప్పారు.

"మనుషులకి అడవితో అవసరం ఉంది. అడవికి మనుషులతో అవసరం ఉంది. అది అర్థం చేసుకుని ఇద్దరూ ఎవరి హద్దులు వాళ్ళు తెలుసుకుని, ఎదుటి వారి స్వేచ్ఛని గౌరవిస్తూ జీవించాలి. అప్పుడు అడవులు బాగుంటాయి. ఊళ్ళు బాగుంటాయి" అని కథలో నీతిని వివరంగా చెప్పింది. అక్కడ ఉన్న శిష్య జంతువులు ఎవరి పద్ధతిలో వాళ్ళు అభినందనలు తెలిపారు.

# అర్ధాంగి

విరించి



✆ 9848789094

**దీపావళి 2023 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***"శభాష్ వసుధా! నువ్వు చేసింది సామాన్య విషయం కాదు. ఈరోజు ఎందరో స్త్రీలు ఇల్లు విడిచి సామాజిక సేవ చేస్తున్నారు. సంసారం కూడా సమాజంలో భాగమే. అందరు స్త్రీలు... నీలా ఆలోచిస్తే సమస్యలే ఉండవు. దీనివల్ల పిల్లల భవిష్యత్‌కు డోకా ఉండదు. అంతకన్న చేసే సామాజికసేవ ఏముంటుంది చెప్పు!"***

అప్పటికే ఊరు సద్దుమణిగింది!

గేటు దగ్గర స్కూటర్ హారన్ మ్రోగడంతో వసుధ గోడ గడియారంకేసి చూసింది. పదకొండున్నర! చదువుతున్న పుస్తకం టీపాయి మీద పెట్టి లేచి వెళ్ళి గేటు తాళం తీసింది. మధుసూదనం స్కూటర్ లోపల పెట్టి లాక్ చేసాడు. వసుధ గేటుకు తాళం వేసి ఇంట్లోకి వచ్చింది.

"అప్పుడే పడుకున్నావా? హారన్ కొడితే వినపడలేదా?" అన్నాడు మధుసూదనం చిరాగ్గా మొహం పెట్టి.

"పదకొండున్నర అయ్యింది. ఊరంతా నిద్రపోతోంది. ఇప్పుడీ దేశసేవ ఏమిటండీ! భోజనానికి ఆలస్యమయి పోలేదూ?" అంది వసుధ.

"ఆఫీస్‌లో పార్టీ ఉంటే తినొచ్చాను. నువ్వు తినేయ్!" అన్నాడు మధుసూదనం. వసుధ డైనింగ్ టేబుల్ మీద ప్లేట్లు అలాగే వదిలేసి బెడ్‌రూంలోకి వెళ్ళిపోయింది. పదినిముషాల్లో డ్రస్ మార్చుకుని వచ్చాడు మధుసూదనం.

"చిన్నాడు ఫోన్ చేసాడు!" అంది వసుధ.

"డబ్బులు పంపాలి అంతేగా? దొరగారి ఎం.ఎస్. ఎప్పటికి అయ్యేటట్లు?" అన్నాడు వెటకారంగా.

"అమెరికాకు వాడు వెళ్ళను మొర్రో అంటే పంపింది మీరేగా? పెద్దాడు ఎలాగూ దేశం వదిలి న్యూజిలాండ్‌లో సెటిలయ్యాడు. చిన్నాడైనా దేశంలో ఉంటే బాగుండేది కదా!"

"వెళ్ళక? ఈ దేశంలో ఏం చేస్తాట్టా? తెలివైన కుర్రాళ్ళంతా దేశం వదిలి ఎందుకు పోతున్నారో నీకు తెలియదా?" అన్నాడు మధుసూదనం.

'కొడుకులు దేశాంతరం, తండ్రి దేశ సేవ. బాగుంది!' అనుకుంది.

ఈ సమయంలో అతగాడితో వాదించడం శుద్ధ దండగని వసుధకి తెలుసు. ప్రక్కలో పడుకున్నా అతడి మందువాసన కడుపులో దేవేస్తోంది. వసుధ మౌనంగా పడుకుంది.

పడుకున్న పదినిముషాలకే మధుసూదనం నిద్రలోకి జారి, గుర్రు పెట్టడం మొదలుపెట్టాడు. వసుధ పడుకుందన్న మాటే గానీ నిద్రపట్టడం లేదు. ఆలోచన్లు పరిపరి విధాల పోతున్నాయి... 'ఈమధ్య మధుసూదనం తరుచు సామాజిక సేవని, పార్టీలని, ఫంక్షన్లనీ త్రాగొస్తున్నాడు. తాగిన మత్తులో ఏ ప్రమాదం చేస్తాడో అని భయం. తను ఎన్నిసార్లు చెప్పినా లెక్కచేయడు. పిల్లలిద్దర్నీ బలవంతంగా చదువులకు విదేశాలకు పంపించాడు. పెద్దాడు న్యూజిలాండు నుంచి ఇక వచ్చే ప్రసక్తే లేదు. చిన్నాడు బలవంతంగా వెళ్ళినా, అమెరికా మోజులో ఇండియా వస్తాడని నమ్మకం లేదు. పిల్లల్ని ఎందుకు కన్నట్లు? అమెరికా వాడికి డాలర్లకు అమ్ముకోవడానికా? రేపు వృద్ధాప్యంలో ఎవరు చెయ్యి అందిస్తారు?' వసుధ ఆలోచన్లతో ఏ అర్ధరాత్రికో నిద్రపోయింది.



మర్నాడు ఉదయమే లేచిన వసుధ తన పనుల్లో నిమగ్నమయ్యింది. తొమ్మిదైనా మధుసూదనం ఇంకా లేవలేదు. ఆఫీస్‌కి టైం అవుతోందని లేపుదామని పడకగదిలోకెళ్ళింది.

మధుసూదనం కళ్ళు మూసుకుని పడుకుని ఉన్నాడు.

"లేవండి మహానుభావా! ఆఫీస్‌కి టైం అవుతోంది!" అంది.

మధుసూదనంలో కదలిక లేదు. నుదుటి మీద చెయ్యి వేసింది. వేడిగా ఉంది.

"లేవండీ!" అంటూ కుదిపి లేపింది.

మధుసూదనం నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. రాత్రి త్రాగింది ఇంకా దిగినట్లు లేదు. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. మందు వాసన తగ్గలేదు.

"ఎలా ఉంది? ఒళ్ళు వేడిగా ఉందేమిటి?" అంది వసుధ ఆతృతగా.

"ఫీవరిష్‌గా ఉంది. కడుపులో ఒకటే దేవేస్తోంది!" అన్నాడు నీరసంగా.

"లేచి మొహం కడుక్కుని కాఫీ త్రాగండి. ఈరోజు ఆఫీస్‌కు శెలవు పెట్టేయండి. డాక్టర్ దగ్గరకు వెళ్దాం!" అంది.

మధుసూదనం నెమ్మదిగా లేచాడు. తలంతా భారంగా ఉంది. లుంగీ గట్టిగా బిగించి వాష్‌రూమ్‌కి వెళ్ళాడు. పది నిముషాల్లో బ్రష్ చేసుకొచ్చాడు. వసుధ కాఫీ ఇచ్చింది. రెండు చుక్కలు గొంతులోకి వెళ్ళేయో లేదో భళుక్కున వాంతి చేసుకున్నాడు. వసుధ గబగబా వచ్చి పట్టుకుని, వాష్‌బేసిన్ దగ్గరకు తీసుకెళ్ళింది. మొహం కడిగి సోఫాలో కూర్చోబెట్టింది. నేలంతా క్లీన్ చేసింది.

మధుసూదనం దుస్తులు మార్చి, తను కూడా తయారయ్యింది. కేబ్ బుక్ చేసిన పదినిముషాలకు వచ్చింది. నీరసంగా ఉన్న మధుసూధనాన్ని కేబ్ ఎక్కించి, తనూ ఎక్కింది. ట్రాఫిక్‌లో కార్పొరేట్ హాస్పిటల్ చేరేటప్పటికి ఓ అరగంట పట్టింది!

డాక్టర్ కన్సల్టేషన్ ఫీజు కట్టి వెయిటింగ్ హాల్‌లో కూర్చున్న గంటకు డాక్టర్‌ను కలిసారు. మధుసూదనాన్ని డాక్టర్ పరీక్షించి టెస్ట్‌లు రాసాడు. అవన్నీ దగ్గరుండి చేయించింది వసుధ. కేంటీన్‌లో కాఫీ త్రాగి, రిపోర్ట్స్ కోసం వెయిట్ చేస్తూ కూర్చున్నారు. రిపోర్ట్స్ వచ్చేసరికి టైం మధ్యాహ్నం మూడయ్యింది. డాక్టర్ రిపోర్ట్స్ చూసి, మళ్ళీ ఒకసారి మధుసూదనం కేసి చూసాడు.

"మీకు మందు అలవాటు ఎన్నాళ్ళనుంచి ఉంది?" అన్నాడు.

"అంటే… అంటే…అప్పుడప్పుడు" నసిగాడు మధుసూదనం.

"ఐదారేళ్ళనుండి ఉందండి. ఈమధ్య తరచు త్రాగుతున్నారండి!" అంది వసుధ.

డాక్టర్ "కిడ్నీలు రెండూ పాడయ్యాయి. ఫ్యాటీ లివర్. బి.పి. కూడా ఎక్కువగా ఉంది!" అన్నాడు.

తల మీద పిడుగు పడినట్లయ్యింది వసుధకు! బిక్కమొహం వేసుకుని మాట రావటంలేదు మధుసూధనానికి.

"రిపోర్ట్స్ తప్పేమో సార్! మళ్ళీ ఒకసారి చూడండి. ఎవరివైనా మారిపోయాయేమో!"అంది వసుధ ఆశగా.

"ఎప్పుడైతే హై బి పి ఉందో, మీ వారికి తాగుడు అలవాటుందని తెల్సిందో… నాకు అనుమానం వచ్చే టెస్ట్‌లు చేయించాను. ప్రస్తుతం మందులు వాడదాం. త్వరలోనే డయాలసిస్ చేయవల్సిరావొచ్చు … చూద్దాం! ప్రస్తుతం ఈ మందులు వాడి, వారం పోయాక రండి!" అన్నారు డాక్టర్. ఇద్దరూ రెండు చేతులు జోడించి బయటకు వచ్చారు. మందులు తీసుకుని కేబ్ ఎక్కి ఇంటికొచ్చారు.

మధుసూదనం దోషిలా తలవంచుకుని సోఫాలో కూర్చున్నాడు.

వసుధకు ఏమీ పాలుపోవడం లేదు. 'తాగొద్దు మొర్రో' అంటే తనని పల్లెటూరు మొద్దు అని, కల్చర్ లెస్ ఫెలో అని తీసిపారేసేవాడు. ఒక్కనాడూ తనని భార్యగా కాకపోయిన కనీసం మనిషిగానైనా చూడలేదు. ఇప్పుడు వైద్యానికి లక్షల్లో ఖర్చు ఎక్కడ్నుంచి తేవాలి? పెద్దాడు పెళ్ళిచేసుకుని మొన్ననే కాస్త సెటిల్ అయ్యాడు. చిన్నాడికి ఇంకా తామే పంపాలి. రేపు డయాలసిస్‌కు రావచ్చు. అలా ఎంతకాలం? కిడ్నీ మార్చాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. అయిన ఎవరిస్తారు?

గబగబా స్టౌ వెలిగించి, అన్నం, కూర వండి మధుసూదనానికి పెట్టి, తను తింది.

వారంలో మధుసూదనం పరిస్థితి దిగజారింది. డాక్టర్ మళ్ళీ పరీక్షించి డయాలసిస్ స్టార్ట్ చెయ్యాలన్నాడు. వారానికి రెండు సార్లు చెయ్యాలన్నాడు. కనీసం ఐదారు వేలు కావాలి.

"డయాలసిస్ వద్దు. వెళ్ళిపోదాం. డాక్టర్లు అలాగే అంటారు. మందులు వాడదాం!" అన్నాడు మధుసూదనం.

"ఇప్పటిదాకా మీ మాట నేను విన్నాను. ఇక నుండి దయచేసి నా మాట వినండి. డయాలసిస్ తప్పదు. నడవండి!" అంది వసుధ స్థిరంగా.

డయాలసిస్‌కు కావాల్సిన ప్రొసీజర్స్ అన్నీ చేసి, నాలుగు రోజుల తర్వాత డయాలసిస్ ప్రారంభించారు.

మధుసూదనంతో పాటే డాక్టర్‌తో మాట్లాడి, వసుధ కూడా టెస్టులు చేయించుకుంది. అన్నీ సరిగానే ఉన్నాయని తెలిసి వసుధ ఊపిరి పీల్చుకుంది.

ఆఫీస్ కొలీగ్స్ వచ్చి చూసి వెళ్తున్నారు. వసుధ అన్న రాఘవ వాళ్ళ ఊరు నుండి వచ్చాడు.

“డాక్టర్‌తో మాట్లాడానమ్మా! కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తే మంచిది. భార్య, పిల్లలు, అన్నదమ్ములు, తల్లిదండ్రులు అయితే వెంటనే అనుమతి వస్తుంది. ఇరవై లక్షల దాకా అవుతుంది. బయటి వాళ్ళయితే మరో పది లక్షలవుతుంది. కానీ పర్మిషన్ రావడం కొంచెం కష్టమౌతుంది. నాకు తెలిసిన ఓ మంత్రి ద్వారా ప్రయత్నం చేయచ్చునుకో!” అన్నాడు రాఘవ.

“ముప్పయ్ లక్షలు ఎక్కడ్నించి తేవాలి అన్నదే ప్రశ్న” అంది వసుధ.

“ఆలోచించు. నేను పని చూసుకుని రేపు వస్తాను!” అని వెళ్ళిపోయాడు రాఘవ.

వసుధకు ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు. ఇద్దరి పిల్లలకు అప్పు సొప్పు చేసి, విదేశాల్లో చదువులకు డబ్బు కట్టారు. ఇంక ఎక్కడ అప్పు పుట్టదు. వసుధ తెలవార్లూ ఆలోచిస్తూనే ఉంది.

మర్నాడు మధ్యాహ్నం రాఘవ వచ్చాడు. “డాక్టర్ గారితో మాట్లాడానమ్మా! ట్రాన్స్‌ప్లాంట్ చేయిస్తే మంచిది. లేకపోతే జీవితాంతం డయాలసిస్ చేయించుకోవాలన్నారు. నాకు తెల్సిన ఒకాయన కూతురు పెళ్ళికోసం కిడ్నీ ఇస్తానన్నాడు. పది అడుగుతున్నాడు!” అన్నాడు.

వసుధ ఒక్క నిముషం ఆలోచించింది.

“అంత ఖర్చు అవుతుందని మనం అనుకున్నదే కదా అన్నయ్యా! నేనొకటి చెపుతాను. విను! కిడ్నీ కొనేంత స్తోమత మనకు లేదు. న్యాయపరమైన సమస్యలు కూడా. ఇక నా పెళ్ళి నాడు నా పసుపు కుంకుమల క్రింద ఇచ్చిన ఎకరం పొలం రేట్ రావచ్చు. నేను అమ్మేది కూడా నా పసుపు కుంకుమ కాపాడుకోవడానికే కదా!” అంది వసుధ.

నిజానికి ఆ తండ్రి ఇచ్చిన పొలం అమ్మడం వసుధకు ఇష్టం లేదు. కానీ, గత్యంతరం లేక అమ్మాలని నిర్ణయించుకుంది.

“ఈ మధ్య మార్కెట్ కాస్త డౌన్‌లో ఉంది. అయినా, అమ్మడం తప్పని పరిస్థితి కదా! సరే... ఆ ప్రయత్నంలో ఉంటాను!” అన్నాడు రాఘవ.

రాఘవ వెళ్ళగానే వసుధ పిల్లలకు ఫోన్ చేసి విషయం చెప్పగానే ఇద్దరూ కంగారు పడ్డారు.

“ఎలా అమ్మా! నేను మొన్ననే కొత్త జాబ్‌లో జాయిన్ అయ్యాను. నాకు రావడానికి సెలవు దొరకదు!” అన్నాడు పెద్దాడు.

“నాకు ఎగ్జామ్స్ అమ్మా! నేను వచ్చి చేసేదేముంది అమ్మా!” అన్నాడు చిన్నాడు. అదీ కరెక్టే అనుకుంది. వాళ్ళు వచ్చి చేసేదేముంది? డబ్బు వాళ్ళేం సర్దలేరు. పైగా రానూపోనూ లక్షల్లో చార్జీలు. డాక్టర్‌తో మాట్లాడి ఆపరేషన్‌కు డేట్ నిర్ణయించుకుంది.

రాఘవ ఎంత కష్టపడ్డా వసుధ అమ్మిన పొలానికి పాతిక లక్షలు మించి రాలేదు. “ఇప్పుడెలా? మనకు ఇంకా డబ్బు అవసరం పడేటట్లుంది. నేను సర్దితే ఒక లక్ష సర్దుతాను. రెండు లక్షలు సర్దుతాను!” అన్నాడు రాఘవ.

“ఇంక డబ్బు గురించి మర్చిపో! డోనర్‌ను కూడా చూసాను. టిష్యూ మాచింగవగా అన్నీ సరిపోయాయి. నువ్వు ఆపరేషన్

టైంలో ప్రక్కన ఉండు చాలు!" అంది వసుధ ఎంతో గుండెనిబ్బరంతో.

'ఎవరూ? ఏమిటి?' అని అడగాలనుకున్నాడు రాఘవ. కానీ వసుంధర అంత గట్టిగా చెప్పాక ఇక మాట్లాడలేదు.

"సరే! తప్పకుండా నేను మీ దగ్గరుంటాను. నువ్వేం వర్రీ కాకు!" అన్నాడు రాఘవ.

ఆపరేషన్‌కు ముందురోజు మధుసూదనాన్ని హాస్పిటల్లో అడ్మిట్ చేసారు.

ఆపరేషన్ థియేటర్ లోకి వెళ్తూ కూడ మధుసూదనం అడిగాడు "వసుధా! డోనర్ ఎవరో చెప్పావు కాదేంటి?" అని.

"అది మీకు అంత అవసరమా? అన్నీ సక్రమంగా జరుగుతాయి. మీరు నిశ్చింతగా ఉండండి!" అంది వసుధ చిరునవ్వుతో!

మధుసూదనంతో బాటే వసుధ ఆపరేషన్ థియేటర్ లోకి వెళ్ళింది. రాఘవ, అతని భార్య జానకి బయట వెయిటింగ్‌హాలులో కూర్చున్నారు.

ఓ ఆరు గంటల తర్వాత పేషెంట్‌కు స్పృహ వచ్చిందని ఇన్‌టెన్సివ్ కేర్ లోకి మార్చారని, వచ్చి చూడొచ్చని చెప్పారు. రాఘవ ఐసియు లోకి వెళ్ళాడు.

మధుసూదనం మగతగా పడుకుని ఉన్నాడు. రాఘవ పలకరించగానే నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. అతని కళ్ళు వసుధ కోసం వెతుకుతున్నాయి. రాఘవ చిరునవ్వుతో పక్క బెడ్ వైపు చూపించాడు. ఆ బెడ్ మీద పడుకుని ఉన్న వసుధను చూడగానే ఉలిక్కిపడ్డాడు మధుసూదనం!

"వ...సు...ధా" అన్నాడు ఒక్కొక్క అక్షరం పలుకుతూ..

"కాదు. నీ పాలిట దేవత! అర్ధాంగి అన్న పదానికి నిర్వచనం. సతీ సావిత్రిలా నిన్ను రక్షించుకోవడం కోసం తన ప్రాణాన్ని రిస్క్ అని తెలిసి కూడా తన కిడ్నీ ఇచ్చింది!" అన్నాడు రాఘవ.

మధుసూదనం కళ్ళు వర్షిస్తుంటే చెంపలు తడిసిపోతున్నాయి!

"ఛ! బాధపడకు. ఏ ఆడదైనా మాంగల్యానికి ఇచ్చిన విలువ, తన ప్రాణానికైనా ఇవ్వదు. వసుధ అసలు ఇవ్వదు!" అన్నాడు రాఘవ.

"శభాష్ వసుధా! నువ్వు చేసింది సామాన్య విషయం కాదు. ఈరోజు ఎందరో స్త్రీలు ఇల్లు విడిచి సామాజిక సేవ చేస్తున్నారు. సంసారం కూడా సమాజంలో భాగమే. అందరు స్త్రీలు... నీలా ఆలోచిస్తే సమస్యలే ఉండవు. దీనివల్ల పిల్లల భవిష్యత్తుకు ఢోకా ఉండదు. అంతకన్న చేసే సామాజిక సేవ ఏముంటుంది చెప్పు!" అన్నాడు రాఘవ.

'అవును రాఘవా! ఎవరి కుటుంబాన్ని వాళ్ళు సక్రమ మార్గంలో ఆదుకుంటే అదే సామాజిక సేవ' అనుకున్నాడు మధుసూదనం. తను సామాజిక సేవ పేరుతో సంసారాన్ని పట్టించుకోకపోవడాన్ని గుర్తు చేసుకుంటూ!

వసుధ తృప్తిగా కళ్ళు మూసుకుంది!!

# మేధావి

ఉగాది వసంత



✆ 9849455367

**దీపావళి 2022 కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

*'డౌట్ క్లారిఫికేషన్ క్లాస్' అని పిల్లలకి వచ్చే ఇతర సందేహాలు తీర్చడానికి, మరియు కొన్నికొన్ని పాఠాలలో దాగి ఉన్న లాజిక్కుల గురించి వివరించడానికి వీలుగా, ఓ స్పెషల్ క్లాస్ నిర్వహించి, పిల్లలకి స్పష్టత కల్పించండి.*
*ఇలా ప్రశ్నించే వారే, రేపటి మేధావులు. మేధావుల్ని తయారు చేయడానికి మనవంతు సహకారం అందిద్దాము.*

"ఒసేయ్ సరస్వతీ, ఇది అహల్య కదుటే? ఇది మంచి పొడగరి అవుతుంది, అంతా నా పోలికే దీనికి!" ఓ రెండేళ్ల తర్వాత కూతురింటికొచ్చిన అన్నపూర్ణమ్మ, కూతురికి జడలు వేస్తున్న సరస్వతిని చూసి అడిగింది.

"కాదమ్మా, ఇది అమూల్య... ఆఖరుది!" అంది.

పెద్ద కూతురు అహల్య, అమూల్య కవలపిల్లల్లా ఉంటారంటారు అందరూ.

"అవునా? దీనికిప్పుడు పదమూడేళ్లు కదా! ఎంత పొడవయ్యిందే! చిన్నప్పుడు 'చిన్న గిద్దెలా' ఉండేది." ఆశ్చర్యపోయింది అమ్మమ్మ.

"ఆడపిల్ల అరటిచెట్టు అంటారందుకే!" తనలో తాను నెమ్మదిగా అనుకుంది.

"ఎందుకలా అంటారమ్మమ్మా?" ప్రశ్నించింది అమూల్య.

"ఇద్దరూ తొందరగా పెరిగిపోతారురా, అందుకు!"

"ఏం? మగపిల్లలు తొందరగా పెరగరా?" అమూల్య సందేహం వెలిబుచ్చింది.

"ఏంటే సరస్వతీ, ఇదింకా ఇలా ప్రశ్నల వర్షం కురిపించడం మానలేదా?"

"మానడమా? దాంతో పాటే పెరిగి పెద్దదవుతోందమ్మా!" నవ్వుతూ అంది సరస్వతి.

"మంచిదేలే! దానికున్న ధర్మసందేహాలు అడిగి తెల్సుకోవాలనుకుంటుంది పిచ్చిపిల్ల! నీకు గుర్తుందటే... దీనికి ఎనిమిదేళ్లనుకుంటాను, ఆ ఏడాది అట్లతదియకి నేనిక్కడే ఉన్నాను... ఎన్ని ప్రశ్నలేసిందే? సందేహాల పుట్ట!" అమూల్యని ముద్దాడి మురిసిపోయారిద్దరూనూ.

"గోరింటాకు పెడుతూ, ఎర్రగా లక్కపిడతలా పండితే, మంచి మొగుడొస్తాడు... అని అంటే 'ఏం? పండకపోతే, మంచి మొగుడు రాడా? ఐతే గోరింటాకు పెట్టుకోని వాళ్లందరికీ చెడ్డ మొగుళ్ళు వస్తారా?' అని టక్కున ప్రశ్నించేది!" పాతరోజులు గుర్తుచేసుకుంటూ, ముసి ముసి నవ్వులు నవ్వుకుంది అమ్మమ్మ.

"అమ్మమ్మా! నా చిన్నప్పుడు నేనింకా ఏయే ప్రశ్నలు వేసేనో చెప్తావా... నాకు కొన్నే గుర్తున్నాయి!" గోముగా అడిగింది అమూల్య.

"తప్పక చెపుతానులేవే! నీ తెలివికి మేమందరం తెగ అబ్బురపడిపోయేవాళ్ళంరా..."

"అబ్బా! ఇంక దీని ప్రశ్నల పరంపర చెపుతావా అమ్మమ్మ... నాకు బోరుకొడుతోంది బాబూ! నేనెళ్ళి మా ఫ్రెండ్స్‌తో ఆడుకుంటాను!" అని అక్కడినించి వెళ్ళిపోయింది అహల్య.

చిన్న నవ్వు నవ్వుకుని, అమూల్య తల నిమురుతూ చెప్పసాగింది అమ్మమ్మ.

"ఓ ఏడాది వినాయకచవితి పూజనాడు, నేనిక్కడికి వచ్చాను తల్లీ, అప్పుడు కూడా ఎన్నెన్ని ప్రశ్నలు సంధించావే గడుగ్గాయి!" అని చిన్నగా నెత్తిన మొట్టికాయ వేసింది.

"నువ్వు 'ఈశ్వరుడు దేవుడు కదా, తన ఇంటి గుమ్మంలో ఉన్న చిన్ని బాలుడు, పార్వతి పుత్రుడని, తన దివ్యశక్తులతో గ్రహించి ఉంటే, బాలుడి తల నరికే అవసరం ఉండేది కాదు.. పాపం వినాయకుడికి అందమైన రూపమే మిగిలి ఉండేది కూడా!' అని అంటే... తప్పు అలా అనకూడదు, చెంపలేసుకో... అని అనేసేదాన్ని. కొన్ని కొన్ని సందర్భాల్లో అలాంటి ప్రశ్నలకి ఏమి సమాధానం చెప్పాలో అర్థం కాక!"




"అయితే ఇది చెప్పు అమ్మమ్మా! వినాయకుడు అన్నీ ఆరోగ్యకరమైన ఆహారాలే తింటాడు, పైగా అన్ని ఆవిరి మీద ఉడికించినవే తిన్నా కూడా, అంత పెద్ద బొజ్జ ఎందుకుంది?" తన్నుకొస్తున్న ప్రశ్నని కడుపులో దాచుకోలేకపోయేదానివేమో, టక్కున అడిగేసేదానివి ఎలాంటి ప్రశ్ననైనా సరే.

"నీ అతి తెలివికి ఎంతో ఆనందం కలిగినా, నువ్వడిగే ప్రశ్నలకి సమాధానం దొరకనప్పుడు తెగ బాధపడిపోయే దాన్నే!" అమూల్యని గట్టిగా ముద్దు పెట్టుకుని చెప్పింది.

"ఎలాంటి ఆహారం అయినా మితంగా తిన్నంతవరకూ ఏ సమస్య రాదురా... స్వామి భోజన ప్రియుడు కదూ, కాస్త పెద్ద పట్టు పట్టి ఉంటాడు, అందుకే పెద్ద బొజ్జ ఉండి ఉంటుంది!" అని చెప్పి, వెంటనే లెంపలేసుకునే దాన్నిరా.

'నువ్వడిగే చాలా ప్రశ్నలకి ఎలా సమాధానం చెప్పాలో తెలియనప్పుడు!' అలా వితండవాదం చేయకూడదు అమూల్యా! దేవుడు చేసే ప్రతి పనికి ఓ అర్థం, పరమార్థం ఉంటుంది... అని కొట్టిపడేసేదాన్ని.

ఓ రోజు ఏమైందంటే, మీ పెద్దమ్మ కూతురు కవిత తన పెళ్ళయిన కొత్తలో వాళ్ళాయనతో కలిసి, మనింటికి భోజనానికి పిలిస్తే వచ్చింది. ఆ జంట బట్టలు, తాంబూలం తీసుకుని, పెద్దల కాళ్ళకి నమస్కారం పెట్టినప్పుడు, అక్షింతలు వేసి, 'సీతారాముల్లా అన్యోన్యంగా నిండు నూరేళ్లు జీవించండి' అని దీవించాం మేమంతా! కవిత వాళ్ళు ఇలా వెళ్లారో లేదో... నువ్వు ప్రశ్నల వర్షం కురిపించావు! ముఖ్యంగా నా మీద. 'అదేంటమ్మమ్మా! నువ్వే కదా సీతారాముల కథ చెపుతున్నప్పుడు, సీతకి కష్టాలే ఎక్కువని చెప్పేవు. నువ్వు చెప్పిన కథ ప్రకారం, అసలు సీతారాములు ఎప్పుడు హాయిగా కలిసున్నారు అమ్మమ్మా! పాపం వాళ్ళని అలా దీవించేసేవేంటి అమ్మమ్మా?' కళ్లనీళ్ల పర్యంతమైపోయావు. అప్పుడు నీ వయసు పదేళ్ళు!

'మన పురాణకథలన్నీ, లోక కళ్యాణార్థం ఉద్భవించినవే తల్లీ! వాటి గురించి అలా కోర్టులో లాయర్ ప్రశ్నించినట్టు అడక్కూడదే తల్లీ!' అని నిన్ను సమాధానపరిచేసరికి నా తలప్రాణం తోకకొచ్చిందంటే నమ్ము. నీ తరపున నేనే లెంపలేసుకుని, కళ్ళు మూసుకుని నమస్కరించుకునేదాన్ని!

"నువ్వడిగే ప్రశ్నలకి సమాధానం చెప్పిన ప్రతిసారీ, నేను లెంపలేసుకోడం వలన, నా బుగ్గలు ఎలా కందిపోతున్నాయో చూడు!" అంది అమ్మమ్మ నవ్వుతూ .

"మీ అమ్మ చెప్పేది, క్లాస్ టీచర్ కూడా బోల్డన్ని కంప్లైంట్స్ చేస్తూండేదిట... ఏ పాఠం చెప్పినా, క్లాసులో ఏ పిల్లలకీ రానన్ని సందేహాలు అమూల్యకి వస్తాయి అని"

"ప్రశ్నించడం తప్పు కానే కాదు అమ్మూ! ప్రశ్నలోంచే కదా జవాబు వస్తుంది. నువ్వు పెద్దయ్యాక మంచి కలెక్టరువి అవుతావురా!" మనవరాలికి దిష్టి తీసి, మెటికలు విరిచింది అమ్మమ్మ.

★★★

అమూల్య పదవ తరగతిలో ఉండగా, డీయీవో ఆఫీసు నుంచి ఓ నోటీసు వచ్చింది స్కూల్ కి. మర్నాడు, డీయీవో గారు స్కూల్ కి ఇన్స్పెక్షన్‌కి వస్తున్నారని, పదవ క్లాస్ పిల్లల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతారని, ఆ నోటీసు సారాంశం!

ఆరోజు స్కూల్ అయిపోయాక, హెడ్‌మాస్టర్ గారు పదవ క్లాసు పిల్లలని కూర్చోబెట్టి, ఆ ఇన్స్పెక్షన్ లో ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదు అనేవి చెప్పారు. ఆ ఇన్స్పెక్షన్ లో బాగా సమాధానాలు చెప్పి, డీయీవో గార్ని మెప్పించిన వారికీ స్కూల్ తరపున మంచి బహుమతి ఉంటుందని కూడా హెడ్ మాస్టర్ గారు ప్రకటించారు.

మర్నాడు, టంచనుగా పదింటికల్లా డీయీవో గారు స్కూల్‌కి వచ్చి, ఒక్కొక్కరిని తనకు నచ్చిన విధంగా ప్రశ్నలు అడుగుతున్నారు. అది కో ఎడ్యుకేషన్ అవడం వలన, అబ్బాయిలు, అమ్మాయిలు కూడా ఉన్నారు స్కూల్‌లో!

ఇంతలో ఆ మధ్య కాలంలో తనకి వాట్సప్‌లో వచ్చిన ఫార్వర్డ్ జోక్ గుర్తొచ్చింది.

"ఒక డీయీవో గారు ఒక స్కూల్‌కి ఇన్స్పెక్షన్‌కి వెళ్ళి, ఓ అబ్బాయిని 'శివధనుస్సు ఎవరు విరిచారు?' అని అడుగుతారు... ఆ అబ్బాయి ఏడుపు మొహం పెట్టి, 'నేను విరవలేదు సర్, అమ్మ తోడు' అంటాడు.

ఇంతలో అక్కడే ఉన్న క్లాస్‌టీచర్ 'అవును సర్, వీడు చాలా మంచబ్బాయండి, వీడు అలాంటి పని చేయడు' అంటాడు. ఇంతలో ఆ స్కూల్ హెడ్‌మాస్టర్ కూల్‌డ్రింక్ బాటిల్ తెచ్చిచ్చి, 'సర్ ఇది తాగి చల్లబడండి. దాని ఖరీదెంతో చెప్పండి, రేపే కొని తెచ్చి పెట్టేస్తాను' అంటాడు. అప్పటికే ఈ ప్రహసనమంతా చూసి దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయిపోయిన సదరు డీయీవో

గారు, సొమ్మసిల్లి పడిపోతే, అదే కూల్‌డ్రింక్ జల్లగా, తెలివొస్తుంది. ఒక్క సెకండ్ ఆగకుండా, వెనుతిరిగి చూడకుండా పరిగెత్తుకుంటూ బయటికొచ్చి తన కారెక్కి ముఖ్యమంత్రి ఆఫీసుకి వెళ్లి జరిగింది చెపుతాడు. 'మీరేమీ కంగారు పడకండి, ఇదంతా ప్రతిపక్షాల కుట్ర, దీనిమీద నేనో కమిటీ వేసి నిజానిజాలు బయటికి లాగుతాను' అని హామీ ఇస్తాడు ముఖ్యమంత్రి. దాంతో డీయీవో గారికి మతిభ్రమిస్తుంది, మెంటల్ హాస్పిటల్లో చేర్పిస్తారు." ఇది ఆ మధ్య సోషల్ మీడియాలో వీడియో రూపంలో బాగా వైరల్ అయింది.

ఆ వీడియోలో ఉన్న ప్రశ్ననే చివరి స్టూడెంట్‌ని అడగాలని నిర్ణయించుకున్నారు డీయీవో! వస్తున్న నవ్వుని పెదవుల మాటున దాచుకుంటూ... "శీనూ, నిన్ను ఓ చిన్న ప్రశ్న వేస్తానయ్యా. చాలా ఈజీ. ఇది నీ జనరల్ నాలెడ్జికి సంబంధించినది. శివధనుస్సును విరిచిందెవరు? నువ్వు మంచి విద్యార్థిలా ఉన్నావు. నువ్వు విరిచి ఉండవులే..." అని ధైర్యం చెపుతున్నట్టుగా వ్యంగ్యంగా ప్రశ్న సంధించాడు డీయీవో తనకి వచ్చిన జోక్ తలుచుకుంటూ!

తెలుగు మాస్టారు రాగానే, పుస్తకంలో పజిల్స్‌తో కాలక్షేపం చేస్తారు దాదాపుగా క్లాస్‌లో అందరూ... శీను కూడా ఆ కోవకి చెందినవాడే. తెలుగు పరీక్ష ముందు, జవాబులు బట్టీ పట్టి, ముక్కున పెట్టుకుని, రాసేసి, బొటాబొటీ పాస్‌మార్కులతో పాసైపోతుంటారు అందరు.

శివధనుస్సు గురించి ఎంత ఆలోచించినా బుర్రకి తట్టడం లేదు... చురుకైన కుర్రాడు కనుక అతితెలివి ఉపయోగించి, 'మీకు నామీద ఉన్న నమ్మకానికి ధన్యవాదాలు సర్! నేను క్లాస్‌కి వస్తే నా పనేదో నేను చూసుకుంటాను సర్, అది ఎవరు విరిచారో నాకు తెలియదండీ!" అన్నాడు శీను. తన సిన్సియారిటీకి మెచ్చుకుంటారని తలపోశాడు.

అస్సలు ఊహించని సమాధానం విని, దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయింది డీయీవో గారికి.

చురుకైన పిల్ల కావడం వలన, అమూల్య చేయి పైకెత్తింది తాను చెప్తానన్నట్టుగా. టీచర్లు, హెడ్‌మాస్టర్ గారు 'వద్దు' అన్నట్టుగా సౌంజ్ఞలు చేసారు.

మంచి నీళ్లు తాగి, షాక్ నుంచి తేరుకుంటున్న డీయీవో గారు, అమూల్య చెయ్యి ఎత్తడం చూసారు.

"ఆఁ నీ పేరేంటమ్మా? నీకు సమాధానం తెలుసా" అని అడిగారు అమూల్యని.

"నా పేరు అమూల్య సర్... నాకు సమాధానం తెలుసు! అయితే నాకు కొన్ని సందేహాలున్నాయి సర్!" అమాయకంగా మొహం పెట్టి అడిగింది అమూల్య.

"సరే చెప్పమ్మా, నేను నీ సందేహాలు తీరుస్తాను!" అన్నారు ధీమాగా డీయీవో గారు.

"శివధనుస్సుని విరిచింది శ్రీరాముడు సర్. ధనుస్సు వంచి నారి బిగించాలి, అయితే శ్రీరాముడు బాగా బలవంతుడు అవడం వలన, గట్టిగా వంచడం వలన, ఆ ధనుస్సు విరిగిపోయిందని మా అమ్మమ్మ చెప్పింది సర్" అంది సిన్సియర్‌గా.

డీయీవో గారి మొహం ఆనందంతో వెలిగిపోతోంది. అది చూసి, టీచర్లు, హెడ్‌మాస్టర్ గారు ఎంతో రిలీఫ్ పొందారు.

"సర్, అయితే నా సందేహాలు అడగొచ్చా సర్?"

తలూపారు డీయీవో గారు. అక్కడున్న టీచర్లు, హెడ్‌మాస్టర్ చాలా కంగారుపడ్డారు, ఏమి తిక్క ప్రశ్నలు వేస్తుందో, డీయీవో

గారికి ఎక్కడ కోపం వస్తుందో అని.

"ఒకటో సందేహం... విల్లుని వంచమంటే, విరిచి పోగులు పెట్టిన రాముడికి ఎందుకు ఏ శిక్ష వేయలేదు? మాలో ఎవరి చేతుల్లో అయినా, పొరపాటున ఏ వస్తువైనా విరిగిపోతే, మా వీపు విమానం మోత మోగించేస్తారు ఇంట్లో అయినా, స్కూల్లో అయినా సరే. రాముడికి ఏ శిక్ష వేయకపోగా, అతనే గెలిచాడని ప్రకటించి, సీతతో పెళ్లి చేయడం మరీ విడ్డూరంగా అనిపిస్తోంది సర్!"

"ఇక రెండో సందేహం... సీతని పెళ్ళాడ్డం కోసం, జనక మహారాజు, స్వయంవరానికి వచ్చినవారికి, ఈ పరీక్ష పెట్టేరని అంటారు కదా సర్. మరి ఓ అమ్మాయిని పెళ్ళాడడానికి కావాల్సింది 'భుజబలం' కాదు కదా! పెళ్లాడబోయే అబ్బాయి గుణగణాలు, బుద్ధిబలం ముఖ్యం కదా సర్? అలా చేసి ఉంటే, సీతకి ఇన్ని కష్టాలు ఉండేవి కాదేమో అని నాకెప్పుడూ అనిపిస్తుంటుంది సర్!"

డీయీవో గారు ఓ ఐదు నిముషాలు అలోచించి ఇలా చెప్పారు.

"ప్రశ్నించడం మంచి విద్యార్థికి ఉండవలసిన మొదటి లక్షణం అమ్మా. మీ తరం వారిలో తర్కం, మథనం... ఇవన్నీ ఎక్కువగా ఉన్నాయి. అప్పుడే మీలో ప్రశ్నలు, సందేహాలు కలుగుతాయి. నువ్వు అన్న మాటల్లో మంచి లాజిక్ ఉందమ్మా. కానీ రాజులు ముందుగా చూసేది ఎదుటివారిలో, దేహ దారుఢ్యం, వారి భుజబలం ఎంతుంది అనేది! వారు వారి రాజ్యాన్ని కాపాడుకోడంలో గానీ, దాన్ని మరింత విస్తరింపచేయడంలో గానీ ఎంతవరకూ సమర్థులు అనేది చూస్తారు. బుద్ధిబలం అనేది చాలా ముఖ్యమైనదే, కానీ, ఈ విషయంలో రాజులు ఎక్కువగా, వారి మంత్రుల మీద, వారి మంచి స్నేహితుల మీద ఆధారపడుతుంటారు. అన్నీ రాజొక్కడే చూసుకోడం కష్టం కదా మరి!"

అమూల్య ముఖంలో మరో ప్రశ్న కనిపించింది.

"స్నేహితులు మంచివారు కాకపోతేనో అనేగా నీ సందేహం, పుట్టుకతోనే మేధోసంపత్తిని కలిగి ఉన్న వీరు, సమఉజ్జీలతోనే స్నేహాన్ని నెరపేవారు తల్లీ! ఇక్కడ నీకో విషయం చెప్పాలి! దేవుడు చేసే ప్రతీ పనీ, ప్రజాప్రయోజనం కోసం, లోకకళ్యాణం కోసమే చేసేడు. ఉదాహరణకు, రాముడు, సీత అడవికి వెళ్లి ఉండకపోతే, రావణాసురుడు సీతని అపహరించేవాడు కాదు, ఇది జరగకపోతే, రామరావణ యుద్ధం జరిగి ఉండేది కాదు, రావణ వధ కూడా జరిగేది కాదు. అప్పుడు దుష్టశిక్షణ జరిగే వీలుండేది కాదు కదా. అందుకని, మన పురాణగాథలన్నీ, ప్రజోపయోగం కోసం నిర్దేశించినవే!" అని చెప్పారు. తర్వాత పది నిమిషాలు అక్కడ గడిపి, డీయీవో గారు ఆనందంగా కారెక్కి వెళ్ళిపోయేరు.

అమూల్య మొహంలో ఒక రకమైన తృప్తి కనిపించింది.

ఓ వారం తర్వాత, స్వయానా హెడ్‌మాస్టర్ గారు అమూల్య క్లాసుకి వచ్చారు. అమూల్య తెలివితేటల్ని మెచ్చుకున్నారు. క్లాసులో అందరు చప్పట్లు కొట్టి, అమూల్యని అభినందిస్తుంటే ... "ఇప్పుడే విద్యాశాఖ సెక్రటరీ గారు అన్ని స్కూల్స్‌కి, ఓ నోటీసు పంపారు. అదేమిటంటే తెలుసుకోవాలన్న కోరిక బలంగా ఉన్న విద్యార్థి ప్రశ్నలు వేస్తాడు. అలాంటి ప్రశ్నలని పెడచెవిన పెట్టకూడదు. వాళ్ళమీద విసుక్కోకూడదు. వారిలో కలిగిన ప్రశ్నలన్నీ, ఓ పుస్తకంలో రాసి పెట్టుకోమనండి. వారానికి ఒకరోజు, 'డౌట్ క్లారిఫికేషన్ క్లాస్' అని పిల్లలకి వచ్చే ఇతర సందేహాలు తీర్చడానికి, మరియు కొన్ని కొన్ని పాఠాలలో దాగి ఉన్న లాజిక్కుల గురించి వివరించడానికి వీలుగా, ఓ స్పెషల్‌క్లాస్ నిర్వహించి, పిల్లలకి స్పష్టత కల్పించండి. ఇలా ప్రశ్నించేవారే, రేపటి మేధావులు. మేధావుల్ని తయారుచేయడానికి మన వంతు సహకారం అందిద్దాము!' అని. ఇకమీదట

నీకు వచ్చే సందేహాలన్నింటిని ఓ పుస్తకంలో రాసి పెట్టుకుని, వారాంతంలో జరిగే స్పెషల్ క్లాస్‌లో వాటిని అడిగి స్పష్టత తీసుకో. భవిష్యత్తులో నువ్వు మంచి మేధావివి అవుతావని గట్టిగా నమ్ముతున్నాను. గుడ్ లక్. అమూల్యా!" అని హెడ్‌మాస్టర్ వెళ్లిపోతుంటే...

"క్షమించండి సర్, ఓ చిన్న సందేహం సర్, 'మేధావి' అంటే ఎవరు సర్? ఎలా ఉంటారు సర్ ?" ఉత్సుకతతో అడిగింది అమూల్య.

ఈ ప్రశ్న విని ముందుగా షాక్‌కి లోనై, ఒళ్ళు తూలి పడబోయి, బల్ల పట్టుకుని కాచుకుని... "హహ" అని గట్టిగా నవ్వుతూ, "శభాష్ అమూల్యా! ఈ ప్రశ్నని, నీ మొదటి ప్రశ్నగా నీ పుస్తకంలో రాసుకుని, డౌట్స్ క్లాస్‌లో అడిగి తెలుసుకో! అదీ... అలా ఉండాలి మంచి విద్యార్థి అంటే! ఏం పిల్లలూ, మీరంతా కూడా ఇలా అమూల్యలాగానే ఉండాలి... ఓకే!" అని ఒక్క సెకండ్ ఆగకుండా గబగబా బయటికెళ్లిపోయేరు హెడ్‌మాస్టర్.

# ప్రేమార్ణవం

వాడపల్లి పూర్ణ కామేశ్వరి



✆ 8056024790

**దీపావళి 2022 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***యువత కులాంతర వివాహాల చేసుకుంటుంటే వాటిని ఆనందంగా ఆమోదిస్తూ ప్రోత్సహించడం వల్ల సమాజానికి మేలు జరుగుతుంది. కులం అనే భాగాన్ని అన్ని దరఖాస్తులలోనూ నిషేధించే పంథాలో ప్రభుత్వం సాలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని కూడా ఇక్కడ తమ అభ్యర్థనలో శ్రీమతి అక్షయ ప్రస్తావించడం గమనార్హం.***

కనీసం పది చోట్ల కత్తిగాట్లతో, ఒళ్ళంతా రక్తసిక్తం. స్పృహ లేకుండా పడి ఉన్నాడు శివ. ఒళ్ళంతా గాయాలతో నెత్తురు చిందుతూ, శరీరాన్ని బలవంతంగా ఈడుస్తూ కొద్ది దూరంలో ఆగి ఉన్న కారు కిందకు పాకుకుంటూ దూరి దాక్కుంది అక్షయ. గాయాల నుంచి కారుతున్న నెత్తురును అదిమి పట్టుకుని, ఎప్పుడెప్పుడు అలికిడి తగ్గుతుందా అని ఊపిరి బిగపట్టి వేచిఉంది. కొంతసేపటికి అలికిడి తగ్గింది. దాడి చేసిన వారంతా పరారయ్యారని అర్థమైంది.

గాయపడ్డ కాలుని ఈడ్చుకుంటూ పరుగుతీసింది. ఆతురతగా దూరంగా పడి ఉన్న భర్త దగ్గరకు చేరింది. ఒరిగి అతని ముఖమంతా తడిమి తడిమి చూసింది. వేగంగా కుదిపి చూసింది. చలనం లేదు. తన చెవిని శివ గుండెలపై ఆన్చి గుండె చప్పుడుకై ఆశగా చూసింది. కత్తిగాట్లతో దెబ్బలతో ఉన్న శరీరం. అలసిన గుండె సవ్వడి సన్నగానే వినిపించింది. మోహంలో ఆశ బలపడింది. వెంటనే చుట్టూ చూసింది. అక్కడి నుంచి తప్పుకున్న జనమంతా ఒక్కొక్కరుగా మళ్ళీ అక్కడికి చేరుతున్నారు. పెద్ద పెద్ద కొడవళ్ళతో ఆరుగురు వచ్చి ఒక్కసారి అమానుషంగా దాడి చేస్తుండగా భయకంపితులై పారిపోయారు జనమంతా. అలికిడి సద్దుమణిగిందని గ్రహించి మళ్ళీ రాసాగారు.

"నేను సాయం పడతాను, ఆసుపత్రికి తీసుకెళదాము పదండమ్మా" అంటూ వచ్చాడు ఓ దయగలవాడు. మరొకరు గబగబా కారును తెచ్చి సహాయపడే ప్రయత్నం చేసాడు.

కారు వేగం పుంజుకుంటోంది. కొన ఊపిరితో ఉన్న భర్త ప్రాణాలను ఆసుపత్రికి చేరేవరకూ గట్టిగా పట్టుకోవాలని ఆరాటపడుతోంది అక్షయ. ఒడిలో పడుకున్న శివను రెండు చేతులతో పొదివి పట్టుకుంది. ఆసుపత్రి చేరడానికి ఇంక రెండే నిముషాలు. ఒడిలోని శివ తల ఒక్కసారిగా ప్రక్కకు వేలాడింది. చేతులు వేళ్ళాడుతున్నాయి. శివ నిర్జీవమయ్యాడు. చలనం లేని శివను గుండెలకు హత్తుకుని భోరుమంది అక్షయ.

★★★

అది పీ.ఎస్.జీ. కాలేజీ. కల్చరల్స్‌తో వాతావరణం అంతా హడావుడిగా వుంది. స్నేహితురాళ్ళు బలవంతపెట్టగా ముఖ్యపాత్ర వేయడానికి ఒప్పుకుంది. ఒప్పుకుందే కానీ అక్షయకింకా ధైర్యం చాలట్లేదు.

"ఈసారి ఏమైనా సరే, మన మెకానికల్ గ్రూపు, ఎలక్ట్రికల్‌ని ఓడించి షీల్డ్ కొట్టేయాలి!" మెకానికల్ గ్రూప్ కెప్టెన్ అన్నాడు.

"మీ వాళ్లంతా షీల్డ్ కొట్టాలన్న పట్టుదలతో వున్నారు. పైగా, అంతటి బాధ్యతను మీపై ఉంచారంటే, అది మీపై వారికున్న నమ్మకమేగా! ఇప్పుడు మీ సహకారం కావాలి, కాదనకండి!" కల్చరల్ సెక్రెటరీ శివ మొదటి సంవత్సరం చదువుతున్న అక్షయని ప్రోత్సహిస్తూ అన్నాడు. శివ మూడవ సంవత్సరంలో ఉన్నాడు.

పోటాపోటీగా జరిగిన పోటీలు ముగిసాయి. అనుకున్నట్టే మొదటి బహుమతిని సాధించారు మెకానికల్ డిపార్టుమెంట్. కాలేజీ అంతా కేరింతలు కొడుతూ అభినందించారు మెకానికల్ టీమ్‌ని. అక్షయ కళ్లు సంతోషంతో మెరిసాయి.



"చూసారా, సంశయిస్తూనే ప్రధాన పాత్ర పోషించారు. మీ టీమ్ గెలుపుకు ముఖ్యకారణమయ్యారు. కంగ్రాచ్యులేషన్స్. ఐ రిక్వెస్ట్ యూ టు కీపప్ ది గుడ్ వర్క్ ఫర్ ది కమింగ్ ఇయర్స్. ఈ సంవత్సరం అవుట్ గోయింగ్ స్టూడెంట్‌గా మిమ్మల్ని ఈ రిక్వెస్ట్ చేస్తున్నాను!" అక్షయని అభినందిస్తూ అన్నాడు శివ.

అలా ప్రారంభమైన వారి పరిచయం స్నేహంగా మారింది. శివ ఆఖరి సంవత్సరం పూర్తి అయ్యే వరకూ వారిద్దరూ, ఒకరితో ఒకరు అనేక విషయాలపై అభిప్రాయాలను పంచుకుంటూ సాగిన స్నేహం ఏడాది పాటు కొనసాగింది. శివ డిగ్రీ చదువు పూర్తయ్యింది. సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేర్ అవుతూ స్టూడెంట్స్‌కి కోచింగ్ క్లాసులు తీసుకోవడం ఆరంభించాడు. మూడో సంవత్సరంలోకి వచ్చిన అక్షయ కూడా కోచింగు క్లాసులో చేరింది. వారి స్నేహం ప్రేమగా వికసించసాగింది.

ఎప్పుడెప్పుడు నిన్ను పెళ్ళి చేసుకుని నా కౌగిట్లో బంధించేస్తానా అని ఉంది. కానీ, ఆ మధురక్షణాల కోసం వేచి ఉండాలి. అది మన లక్ష్యసాధన తరువాతే. అంతవరకూ మన ప్రేమ విషయం మన మధ్యనే ఉంచాలి. ఎన్ని ఇబ్బందులొచ్చినా మనం ప్రేమలో ఓడిపోకూడదు. నువ్వు తోడుగా వుంటే, దేన్నైనా జయిస్తానన్న నమ్మకం నాకుంది!" శివ అన్నాడు.

జీవితంలో సాధించాలనుకున్న లక్ష్యంపై దృష్టి కేంద్రీకరించి కృషి చేయసాగారు. పట్టుదలతో సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ క్లియర్ చేసాడు శివ. ఎమ్ టెక్ పూర్తి చేసి తాము చదువుకున్న కాలేజీలోనే లెక్చరర్‌గా చేరింది అక్షయ. వారిద్దరూ వారి కాళ్ళపై నిలబడ్డారు. సమాజానికి ప్రయోజనం కలిగేటట్లు బాధ్యత గల పదవులు చేపట్టారు.

"జీవితాంతం నీ ఒడిలో గడిపేయాలని ఉంది అక్షయ. మన లక్ష్యసాధన కోసం మనం ఇన్నాళ్ళూ దూరంగా ఉన్నాము. ఇంక మనం పెళ్ళి చేసుకోవడానికి ఎలాంటి అడ్డంకులూ లేవు. ప్రభుత్వంలో బాధ్యత గల పదవిని చేపట్టి, తాను పెరిగినటువంటి

వెనుకబడ్డ ప్రాంతాలకు కావలసిన కనీస సౌకర్యాలు అందించాలి. వారి అభివృద్ధికై పాటు పడాలి. ఇదే నా ఈ పదవితో నేను సాధించాలనుకున్న నా లక్ష్యం!" అన్నాడు శివ.

★★★

"మట్టి పిసుక్కునే నీకు జమీందారు కూతురు కావల్సొచ్చిందా? తారతమ్యాలు తెలుసుకోకుండా పిచ్చి వేషాలు వేస్తే తగిన ఫలితం అనుభవించాల్సి వుంటుంది. ఇదే నా మొదటి, చివరి మాటగా తీసుకుంటే మంచిది!" హెచ్చరించాడు సుబ్బారాయుడు.

"ఇద్దరు వ్యక్తులు వివాహబంధంలో ముడిపడి కలిసి జీవించడానికి కావలసింది ఒకరి మీద ఒకరికి ప్రేమ, పరస్పర గౌరవం, కలిసి జీవించడానికి కావలసిన ఆర్థిక స్వాతంత్ర్యం. భావిజీవితాన్ని తమకూ, కుటుంబానికీ, సమాజానికీ ఉపయోగపడేలా తమని తాము తీర్చి దిద్దుకుంటూ కొనసాగడం. మేమిద్దరమూ స్వయంగా మా కాళ్ళ మీద మేము నిలబడి ఉన్నాము, ఆర్థికంగా ఎవ్వరిపై ఆధారపడట్లేదు. ఒకరెక్కువ మరొకరు తక్కువ అన్న భేదాలు లేకుండా పరస్పరం గౌరవించుకుంటున్నాం! జీవితాంతం కలిసి జీవించడానికి కావలసిన అన్ని విషయాలపై అవగాహన, ఆదర్శప్రాయంగా కొనసాగాలన్న సంకల్పమూ, ఆచరణలో పెట్టగలమన్న మనోబలం మా ఇద్దరికీ మెండుగానే ఉన్నాయి. పెళ్ళి చేసుకోవడానికి ఇంతకు మించిన అర్హతలు అవసరమని నేననుకోను!" ఆత్మాభిమానంతో చెప్పాడు శివ.

గుండె నిబ్బరంతో శివ చెప్పిన సమాధానంతో రాయుడికి మరింత చిర్రెత్తింది.

★★★

సామాజిక సంక్షేమ మంత్రాలయ ఆధీనంలో చీఫ్ డెవలప్మెంట్ ఆఫీసరుగా (సీడీఓ) శివ మొట్టమొదటి పోస్టింగ్. తన లక్ష్యసిద్ధికి తనను అతి చేరువగా చేయగలిగే పదవి అది! దేవాలయంగా భావించే తన కార్యాలయంలోకి అడుగు పెట్టాడు శివ. ఒళ్ళంతా పులకరించిపోయింది. ఏళ్ళ తరబడి తాను చేసిన కృషి ఫలితం!

పదవిని చేపట్టిన వెంటనే తన అధికార పరిధిలోని ప్రాంతాలలో పేదరిక నిర్మూలనకై ప్రభుత్వ పథకాల అమలు జరగడము, మౌలిక సదుపాయాలు మారుమూలలకు అంతరాయం లేకుండా చేరడం వంటి విషయాలను పరిశీలించాడు శివ. వివిధ అభివృద్ధి పథకాలను పర్యవేక్షించడం ప్రారంభించాడు. జిల్లా మేజిస్ట్రేట్ పర్యవేక్షణ మరియు నియంత్రణలో పనిచేస్తూ అతి స్వల్పకాలంలోనే అనేక మార్పులు తీసుకుని వచ్చి అభివృద్ధిని చూపాడు. ప్రభుత్వం మరియు ఉన్నతాధికారుల మన్ననలందుకున్నాడు.

★★★

"వెలగబెట్టింది చాలు! నువ్వు ఈ రోజు నుంచీ కాలేజీకి వెళ్ళక్కర్లేదు. మన హోదాకు తగ్గ సంబంధం చూసాను. మరో నెలన్నర రోజుల్లో నీ పెళ్ళి!" అక్షయ సమాధానం కోసం కూడా చూడకుండా విషయం చెప్పాడు రాయుడు. ఆ మాట విన్న ఎవరికైనా అది ఏకపక్ష నిర్ణయంగా అనిపిస్తుంది. అదే తుది నిర్ణయం అన్నట్టుగానూ ఖరాఖండీగా అన్నాడు.

తండ్రి పట్టుదలను గురించి తెలిసిన అక్షయ, ఆ క్షణం ఏమీ మాట్లాడలేదు. మౌనం అంగీకారం అనుకున్నాడేమో, రాయుడు తన ఏర్పాట్లలో తాను ఉండిపోయాడు. కూతురు ఏ మాత్రమూ చలించలేదేంటా అన్న అనుమానం కూడా రాలేదు రాయుడికి. ఆ మాత్రం భయమున్నందుకు ఆనందించాడు.

'పెళ్ళి నిశ్చయించిన తరువాత, అక్కకు చూసిన మగపెళ్ళివారితో తేడా వచ్చింది. అక్కయ్యకు తగిన సంబంధం కాదేమోనని, ఆ ఇంట్లో సుఖపడలేదేమో అన్న సందేహం అందరికీ వచ్చింది. కాస్త నిదానించి చూడాలేమో అనుకున్నారు. కానీ తన తండ్రి రాయుడుది పట్టుదల గల స్వభావం. కూతురి జీవితం కంటే తన గౌరవానికే ప్రాముఖ్యత ఇచ్చే రకం. కుదుర్చుకున్న సంబంధం కాదనుకుంటే పరువు పోతుందనే అభిప్రాయం బలంగా వుండడంతో, ఆ సంబంధమే చేసారు. దాని పర్యవసానం అక్క నేటికీ అనుభవిస్తోంది. బావకి ఎందుకు కోపం వస్తుందో తెలీదు. ఎప్పుడు తగ్గుతుందో తెలీదు. అసలు అతడి మనస్తత్వమేంటో ఎవ్వరికీ తెలియదు. దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షుగా సాగుతోంది వారి కాపురం. అక్కయ్య కళ్ళల్లో ఆనందం కాదు కదా కనీసం ప్రశాంతపు ఛాయలు కూడా ఎప్పుడూ చూసి ఎరుగరు తాము. నాన్న మాత్రం గొప్ప ఇంట్లో ఇచ్చానని గర్వంగా చెప్పుకుంటారు. ఆయనేదో ఘనకార్యం చేసానన్నట్టు ఆనందపడుతుంటారు!' ఎన్నెన్నో ఆలోచనలు అక్షయ మనసులో.

తన ఇంటి పరిస్థితిని, తండ్రి ఆలోచనా విధానాన్ని అనేక కోణాల్లోంచి పరిశీలించింది అక్షయ. నొప్పించకుండా చెప్పి ఒప్పించే పరిస్థితి లేదు. ఎందుకంటే శివ యోగ్యుడని అర్థం చేసుకునే ఔన్నత్యం ఆయనకు లేదని తెలుసు. ఇక నిర్ణయం తీసుకోవలసింది తనే. తన కర్తవ్యం తనకు అర్థమైంది!

"అక్కయ్యా, శివ గురించి నీకు తెలుసుగా. మేము పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాం! కనీసం అక్కడి నుంచే నీ ఆశీస్సులు ఇస్తావని ఫోను చేసాను. నా నిర్ణయాన్ని నువ్వైనా అర్థం చేసుకుంటావు కదా అక్కా!" బేలగా అంది అక్షయ.

"అక్షయా, నిండు నూరేళ్లూ బతకాల్సిన జీవితాలు అర్థంలేని దర్పాలకో, గౌరవం పేరిట అణచివేతకో, కులమత విభేదాలకో లొంగవలసిన అవసరం లేదు. నీ జీవితభాగస్వామిని ఎన్నుకునే హక్కు నీకుంది. ఆలోచించి నిర్ణయించుకో!" చెప్పింది అక్క.

నలుగురు స్నేహితులు సాక్షులుగా, రాజారాం మాష్టారి ఆశీస్సులతో రిజిస్ట్రార్ కార్యాలయంలో పెళ్లి చేసుకున్నారు శివ, అక్షయలు. సమాజంలో ప్రయోజకులుగా వారిని తీర్చిదిద్దిన గురువులు రాజారాంగారు. 'కులాంతర వివాహం ఆదర్శంగా చేసుకుంటున్న మీరు, కలకాలం చల్లగా ఉండాలని' మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు రాజారాం గారు!

శివ అక్షయల కాపురం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగిపోతోంది. కాలమహిమో లేక వారి ఖర్మో కానీ, రాయుడు కోపం వారికి గొడ్డలి పెట్టు అయ్యింది. సాఫీగా సాగిపోతున్న జీవితాల్లో తుఫాను చెలరేగింది.

★★★

"ఈ చెక్కు తీసుకుని ఈ ఊరే కాదు, ఈ రాష్ట్రమే వదిలి పెట్టి వెళ్ళిపోవాలి. పెడచెవిన పెట్టి పట్టుదలతో మాట వినలేదో, ప్రాణాలే పోగొట్టుకోవలసి వస్తుంది. అక్షయని వదిలి పెట్టి వెళ్ళిపో!" బెదిరింపుతో కూడిన హెచ్చరింపు.

"ఓ, లంచమా? నాకు డబ్బు ఇచ్చి కొనుక్కునే అంత ధనవంతులా! ఈ మాత్రానికే నేను నా భార్యను వదుల్తానని ఎలా అనుకున్నారు?" అదే గుండె నిబ్బరంతో అన్నాడు.

"ఇది సరిపోకపోతే మరో రెండు సున్నాలు జోడించుకో. కళ్ళకు కనబడనంత దూరం వెళ్లిపో! నువ్వు బతికుండడానికి ఇదే నీకు చివరి అవకాశం. అక్షయ జీవితం నుంచి దూరంగా వెళ్లిపో!"

"అక్షయ నా భార్య! చట్టపరంగా రిజిస్టరు కార్యాలయంలో పెళ్ళి చేసుకున్న భార్య! పెళ్లి చేసుకున్నది నిండు నూరేళ్ళూ కలిసి

జీవించడానికి... ఇలాంటి ప్రలోభాలకో, బెదిరింపులకో లొంగిపోయి మోసం చేయడానికో, పారిపోవడానికో కాదు! అక్షయకు నేను దూరమైయ్యేది నా ఊపిరి పోయాకే!" ఖచ్చితంగా చెప్పాడు శివ.

★★★

"అమ్మా, ఎలా ఉన్నారమ్మా? ఇన్నాళ్ళకు నన్ను చూడాలనిపించిందన్నమాట. పోనీలే ఇప్పుడైనా వచ్చావు. నాన్నకు నామీద కోపం పోయిందా?" తన గుమ్మంలోకి అడుగు పెట్టిన తల్లితో కన్నీటి పర్యంతంగా అంది అక్షయ.

"అక్షయా, నేనొచ్చింది నీ క్షేమ సమాచారాలు కనుక్కోవడానికో నీ బాగోగులు చూడడానికో కాదు. నువ్వు అన్నీ తెగతెంపులు చేసుకుని వచ్చేస్తే... తీసుకెళ్ళడానికి! లేకపోతే, పర్యవసానం ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పడానికి. మర్యాదగా ఆ తాళి తీసి విసిరేసి నాతో రా. మనంతస్తుకు తగ్గ వాడితో నీ పెళ్లి జరిపిస్తాం!" కళ్ళెర్రజేస్తూ అంది శోభ.

"ఓ...అలాగా! నా మెళ్ళో తాళి మాత్రమే నీకు కనిపిస్తోంది, దాన్ని తీసి పారేయమంటున్నావు. నా మనసు నిండా ఉన్న శివ నీకు కనబడట్లేదు. మరి దాన్నేం చేయమంటావు? మనసులు కలిసి, శారీరకంగా ఒకటైన మమ్మల్ని విడదీయాలని వచ్చావు. నువ్వు నా తల్లివా అమ్మా? ఒకరికి అంకితమైన నా శరీరాన్ని మరొకరికి అర్పించడానికి మీ సామాజిక గౌరవం ఒప్పుకుంటుందా అమ్మా?" పొంగుకొస్తున్న దుఃఖాన్ని మింగుకుంటూ అంది అక్షయ.

"సరే, ఇంత వరకూ వచ్చింది కాబట్టి చెపుతున్నాను, నా మాటా విను! నేనూ శివ విడిపోయే పరిస్థితి ఎన్నటికీ లేదు! మా అత్తమామలు నన్ను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారు. వారి ఔన్నత్యం ముందు మీరు ఇప్పుడు నాకు చాలా చిన్నగా కనిపిస్తున్నారు. ఈ మాట చెప్పడానికైతే మరెప్పుడూ నన్ను చూడడానికి రావక్కర్లేదు!"

"అత్తమామలా...ఆ మట్టి పిసుక్కునే రంగయ్యా నీకు మామ, ఆ కుండలమ్ముకునే కూలీలా అత్తమామలు?" అహంకారంతో నిలువెల్లా ఊగిపోతూ అంది శోభ.

"భర్త తల్లిదండ్రులను అత్తమామలనే అంటారు!"

"ఆ అలగాజనాల్ని మన బంధువులుగా ఒక్కనాటికీ ఒప్పుకోము. ఆ కూలీలతో కలుషితమై మా కళ్ళముందే నువ్వు మా పరువు తీస్తూ వుంటే చూస్తూ ఉంటామనుకోకు. మీ ప్రాణాలను తీసైనా సరే మా పరువును కాపాడుకుంటాము. జమీందారీ పరువు ప్రతిష్ఠలను మంటలో కలిపేస్తూ ఇలా మా కళ్ళముందే కాపురం చేస్తుంటే, ఒక్కనాటికీ ఊరుకోము. మిమ్మల్ని ఊరికే వదిలి పెట్టము!" కన్నతల్లి కన్నకూతురితో అనకూడని మాటలన్నీ అంది శోభ.

★★★

పరువు హత్యాబాధితుల కోసం ఏర్పడిన శివశక్తి స్వచ్ఛంద సంస్థ అది.

"మేడం, మన కేసులోని నిందితులను నిర్దోషులుగా తీర్పు ఇచ్చింది హైకోర్టు!" కార్యదర్శి ఛాంబర్ తలుపును తీసుకుని వస్తూ చెప్పింది పర్సనల్ సెక్రెటరీ.

రవాలేదు రాధా, సుప్రీమ్ కోర్టుకు వెళ్దాం! వారిద్దరికీ శిక్ష పడాలి. నేరస్థులు ఎప్పుడూ తప్పించుకోకూడదు. అలా జరిగితే మన

న్యాయవ్యవస్థ పైనే నమ్మకం పోతుంది. వారు నిర్దోషులు కాదు, శివను చంపించిన హంతకులు అని నిరూపించి, వారికి శిక్ష పడేవరకూ పోరాడుతూనే వుంటాను!".

★★★

"కేసు పూర్వాపరాలను, సమర్పించిన ఆధారాలను పరిశీలించి, నా క్లయింటు శ్రీమతి అక్షయ విజ్ఞప్తి ప్రకారం, ఆమె భర్తను చంపించిన నేరానికి ఆమె తల్లి శోభను, తండ్రి రాయుడును కఠినంగా శిక్షించవలసిందిగా కోర్టువారిని సవినయంగా కోరుతున్నాను!" తన వాదనను ముగించాడు లాయరు విరాట్.

"స్వాతంత్ర్యం వచ్చిన ఏడున్నర దశాబ్దాల తరువాత కూడా కులమత భేదాలతో మన సమాజం అనేక వేర్పాట్లతో బాధపడుతోంది. పురోగతి అంటే సాంకేతికంగా ముందుకు వెళ్ళడం కాదు! సమసమాజాన్ని నిర్మిస్తూ, మానవకులాన్ని స్థాపించడమే. యువత కులాంతర వివాహాలు చేసుకుంటుంటే వాటిని ఆనందంగా ఆమోదిస్తూ ప్రోత్సహించడం వల్ల సమాజానికి మేలు జరుగుతుంది. కులం అనే భాగాన్నే అన్ని దరఖాస్తులలోనూ నిషేధించే పంథాలో ప్రభుత్వం సాలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని కూడా ఇక్కడ తమ అభ్యర్థనలో శ్రీమతి అక్షయ ప్రస్తావించడం గమనార్హం. సమాజంలోని వ్యక్తులు తమ పరిచయాలను వారు సాధించిన దాన్నిబట్టి, అంటే ఓ ఇంజినీరనో, ఓ సంఘ సంస్కర్త అనో, ఓ సైంటిస్ట్ అనో చెప్పుకోవాలే కానీ, కులం మతం పేరు చెప్పుకోవడంతో కాదు! అప్పుడే మన సమాజం పురోగమించినట్టు. న్యాయం కోసం పోరాడుతూ, అనేక ఇబ్బందులను ఎదుర్కుంటూ, ముందుకు సాగిన అక్షయను కోర్టు అభినందిస్తోంది. అలాగే, సదరు రాయుడు, శోభలకు యావజ్జీవ కారాగార శిక్ష విధించడమైనది!"

# అపవాదు

ఘండికోట విశ్వనాథం



✆ 8464935739

**దీపావళి 2022 కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***అప్పటికి రాత్రి మూడవ ఝాము అవుతోంది. కాలనీ వీధులు నిర్మానుష్యంగా ఉన్నాయి. గాఢ నిద్రలో ఉన్న భార్య ముఖంలోకి ఒకసారి చూసి, బట్టలు మార్చుకున్నాడు. డూప్లికేటు తాళం చెవి తీసుకొని బయటకు వచ్చి తలుపు తాళం వేసేడు. అదృష్టవశాత్తు అలికిడికి భార్య లేవలేదు.***

***గ్యారేజ్ తాళం తెరిచి స్కూటరు బయటకు తీసేడు. చప్పుడు కాకుండా గేటు తెరిచి, వీధి చివర దాక స్కూటరు నడిపించుకొని, స్టార్ట్ చేసేడు.***

అస్తమిస్తూన్న సూర్యుడు ఆఫీసర్స్ క్లబ్ పచ్చటి గోడలకు కాషాయరంగు పులుముతున్నాడు. క్లబ్బు ఎదురుగా పాతిక ఎకరాలకు పైగా విస్తరించిన ‘గోల్ఫ్ కోర్సు’ పచ్చటి కంబళీని కప్పుకుంది. చల్లటి గాలి రివట అప్పుడప్పుడు క్లబ్బు ఆవరణలో కూర్చున్న వారి సేద తీరుస్తోంది.

ఆరోజు శనివారం. ‘గోల్ఫ్’ ఆడేవారికి ఆటవిడుపు. అప్పుడే ఆట ముగించి బేరరు తెచ్చిన స్నాక్స్ తింటూ, టీ తాగుతున్నాడు ప్రసాద్. అధికారవర్గంలో కింద స్థాయిలో ఉన్నా, తన పనితనంతో పై అధికార్ల మన్నన చూరగొన్నాడతడు. ఇచ్చిన పని చక్కగా చేయడం, గోల్ఫ్ ఆడడం అతని బలహీనతలు. టీ తాగుతూంటే, ప్లాంట్ కంట్రోల్ నుంచి ఫోన్ వచ్చింది. రెండవ ప్రొడక్షన్ యూనిట్ లో ఏదో బ్రేక్‌డౌన్. ఉన్నపళంగా రమ్మని ఆదేశం.

ఇంటికి వెళ్లి బట్టలు మార్చుకోవడానికి వీలవదు. చెమట బట్టలతోనే ప్లాంట్ కి వెళ్ళక తప్పలేదు.

ప్రసాద్ ‘బ్రేక్ డౌన్’ అయిన ప్రాంతానికి చేరుకునేసరికి పెద్ద పెద్ద అధికార్లందరూ అక్కడే ఉన్నారు. అతని సహాయకుల బృందం ముందే అక్కడ ఉంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఆ ‘యూనిట్’ ఉత్పాదకతకి ఆయువుపట్టు. అందుచేత కాలయాపన చేస్తే యాజమాన్యం సహించదు. ఆ ‘యూనిట్’ నిర్వహణలో శిక్షణ పొంది ఉన్న ప్రసాద్ ఆధ్వర్యంలో యంత్రాన్ని సరిచేయడంలో నిమగ్నమైపోయింది బృందం. యంత్రం పూర్తిగా సరి అయ్యాక, ఇంటికి చేరుకునేసరికి రాత్రి పది దాటింది.

అఖిల అని ముద్దుపేరున్న అతని భార్య అఖిలాండేశ్వరి ఆత్రంగా భర్త ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూస్తోంది.

“ఏమిటి ఇంత ఆలస్యం అయింది. శనివారం లేదు, ఆదివారం లేదు. ఆట ఆడి ఇంటికి వస్తారేమోనని ఎదురు చూస్తున్నాను”

“ఆట పూర్తయ్యేసరికి కార్ఖానాలో బ్రేక్ డౌన్. క్లబ్ నుంచే నేరుగా అక్కడికి వెళ్ళవలసి వచ్చింది.”

“కార్ఖానాలో ఏ సమస్య వచ్చినా మీరే ఉండాలి. మరెవ్వరూ లేరా... యంత్రాలను సరిచేసేవాళ్ళు. అంతేనా?”

"ఈ రాష్ట్రానికి చెందని వాడినైనా నేనంటే మా అధికార్లకి ఎంతో గురి!"

"అయినా ఒళ్లు వంచి పనిచేయడం అనేది మన తెలుగువాళ్లకి అలవాటేగా. కానీండి, మీరు కష్టపడండి, ఫలితం ఆశించకండి!"

"స్నానం చేసి వస్తాను తొందరగా వడ్డించు. ఆకలిగా ఉంది." సంభాషణ పొడిగించడం ఇష్టంలేదు ప్రసాద్‌కి.

ప్రసాద్ స్నానం చేసి వచ్చేసరికి, వేడి వేడి భోజనం సిద్ధం చేసింది అఖిల. భర్తకి వడ్డించి పక్కనే కూర్చుంది. ఇద్దరూ కలిసి భోజనం చేయడం అలవాటుగా మారిపోయింది.



"మీరు కోపం తెచ్చుకోకండి. ఒక విషయం అడుగుతాను... చెబుతారా?"

భర్త సమాధానం ఇవ్వకపోయేసరికి తనే మాట్లాడింది అఖిల.

"మీరు ఆఫీసరుగా కార్ఖానాలో చేరి పదేళ్ళు దాటుతోంది. ఈ పదేళ్ళలో ఒకే ఒక్క ప్రమోషన్ తీసుకున్న ఘనత మీకే దక్కింది. ప్రమోషను వచ్చి ఆరేళ్ళు దాటుతోంది. తర్వాతి ప్రమోషను ఇప్పటికీ రాలేదు...."

"ప్రమోషన్లు అవీ నాకు అంతగా పట్టవని నీకు తెలుసుగా.."

"ఎవరికీ ప్రమోషను ఇవ్వకపోతే పర్వాలేదు. కాని మీతో బాటే కార్ఖానాలో చేరిన చాలా మందికి ఇప్పటికి మూడు ప్రమోషన్లు వచ్చేయి. చాకిరీ అంతా మీది. ప్రమోషన్లు మాత్రం వేరొకరివి.."

"నా ప్రియ భార్యామణీ, పై అధికార్లకి ఎవరు కావాలో వాళ్ళకే ప్రమోషన్లు వస్తాయి.."

"అవునవును, అందుకే ఆఫీసర్ అసోసియేషన్ సెక్రెటరీకి సమయం రాకుండానే ప్రమోషను వచ్చింది... నాకు తెలియదనుకుంటున్నారేమో... ఈ విషయం మా మహిళా సమాజం సమవేశాలలో చర్చకు వచ్చింది."

"ఆఫీసుల్లో రాజకీయాలు నీకు తెలీవులే!" భార్యకి నచ్చచెప్పాడు ప్రసాద్.

అఖిలకి తెలుసు భర్తకి విధేయతతో పనిచేయడమే తెలుసు, పై అధికార్ల కనుసన్నల్లో మెలగడం తెలీదని!

★★★

అవి ఒక ప్రభుత్వ సంస్థలో 'అప్రైజల్' రోజులు. సంవత్సరమంతా కష్టపడి పనిచేసిన అధికార్లకి తమ శ్రమకు గుర్తింపు తీసుకువచ్చే రోజులు. పదోన్నతులకు పై అధికార్లు సిఫార్సు చేసే రోజులు. కొందరు అధికార్లు తమ పై అధికార్లను మంచి

చేసుకొని దగ్గర కావడానికి ప్రయత్నిస్తున్నారు. కొంతమంది... అధికార్లు తమకు కావలసినవారిని, ప్రమోషన్‌కి అర్హత ఉన్నా లేకున్నా ఎలాగైనా ప్రమోషన్ ఇప్పించాలని చూస్తున్నారు.

అప్రైజల్ రోజులంటే ప్రసాద్‌కి మాచెడ్డ భయం. స్వతహాగా నిదానస్తుడు, సున్నిత మనస్కుడు. తన విభాగంలో జరిగే రాజకీయాలలో జోక్యం కలుగచేసుకోడు. తన పని తప్ప ఇంకొకరి విషయాలలో తలదూర్చడు. అధికార్లకి కాకా పట్టడు. అందుచేత కొంతమంది అధికార్లకి ప్రసాద్ అంటే ఇష్టముండదు.

ఇంత కష్టపడి పనిచేస్తున్నా, ప్రసాద్‌కి ప్రమోషనుకి అర్హత వచ్చి ఆరేళ్లవుతున్నా పదోన్నతి కాలేదు. అందుకే అతనికి అప్రైజల్ అంటే ఏవగింపు. ప్రమోషన్ అనేది అతని విషయంలో ఎండమావిలా తయారయింది. ప్రతి ఏటా ఒక చిన్న ఆశ రూపుదిద్దుకుంటుంది, అంతలోనే నిరాశ మిగిల్చి పోతుంది.

ప్రమోషన్ల సూచిక రావడానికి ఇంకా నాలుగు రోజులు ఉంది. ఫలితాల గురించి అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రసాద్ కూడా ఈసారి ప్రమోషను తప్పక వస్తుందనే ఆశతో ఉన్నాడు.

ఆరోజు ఆదివారం. రోజూలానే తెల్లవారకముందే తెలివి వచ్చింది అఖిలకి. ప్రక్కన ప్రసాద్ కనిపించలేదు. ఆదివారాలు పొద్దున్నే లేవడం అలవాటు లేనివాడు ఇంత తొందరగా లేచాడా అని విస్తుపోయింది. బాత్‌రూంకి వెళ్ళేడేమోనని రెండు నిమిషాలు పక్కమీద వేచి ఉంది. కాని ప్రసాద్ ఇంట్లో ఉన్న అలికిడి లేదు. అఖిల గాభరాపడింది. ఇంట్లో ప్రస్తుతం తనూ, భర్తా మాత్రమే ఉన్నారు. ఒక్కడే కొడుకు .. నరేంద్రపూర్ రామకృష్ణ మిషన్ రెసిడెన్షియల్ స్కూలులో చదువుకుంటున్నాడు.

అఖిల ఇల్లంతా వెతికింది. ప్రసాద్ సెల్ ఫోనుకి కాల్ చేస్తే 'స్విచ్ ఆఫ్' అని వస్తోంది. వీధి గది తలుపు ఇంటర్‌లాక్ తెరిచి బయటకు వచ్చి వరండాలోనూ, వీధి గేటు దగ్గర నుంచుని రోడ్డుమీద కనిపించినంత వరకూ చూసింది... ఒకవేళ మార్నింగ్ వాక్‌కి వెళ్ళేడేమోనని. భర్త దగ్గర ఇంటర్‌లాక్ తాళం చెవి ఒకటుంటుంది. కాని ఆదివారాలు మిన్ను విరిగి మీద పడినా ప్రసాద్ పొద్దున్నే పక్కమీంచి లేవడు, మార్నింగ్ వాక్ చేయడు. భర్త అలవాట్లు తెలుసామెకు. రెండుగంటల సేపు వేచి చూసింది. అయినా ప్రసాద్ జాడలేదు. సమయం గడుస్తున్నకొద్దీ ఆమెకి ఆందోళన ఎక్కువైంది.

అఖిల మనసు పరిపరివిధాల పోతోంది. ఏం అవాంతరం వచ్చిందో, ఈ మధ్య ప్రమోషను రాదేమోననే బెంగతో భర్త ఉండడం గమనించిందామె. తనలోని బాధను నలుగురితో, కనీసం తనతోనైనా పంచుకోవడం అలవాటులేదతనికి!

ఏదైనా అఘాయిత్యానికి పాలుపడ్డాడా? ఈ అలోచనతో అఖిల దుఃఖానికి అవధులు లేకపోయింది.

కొడుకుకి ఫోను చేస్తే గాభరా పడతాడని ఆలోచిస్తూ, ఇంటిలోనికి వచ్చి కుర్చీలో కూలబడింది. వెంటనే భర్తతోబాటు పనిచేసే అధికార్లకీ, పరిచయస్తులకీ ఒకరికీ ఒకరికీ ఫోను చేయడం మొదలుపెట్టింది.

బారెడు పొద్దెక్కింది. 'ప్రసాద్ కనిపించడం లే'దనే వార్త దావానలంలా కాలనీలో అంతటా వ్యాపించింది. ప్రతి నాలుగు రోడ్ల కూడలిలోను ఇదే చర్చ. పొద్దున్నే ప్రసాద్ ఇంటికి అతని సహోద్యోగులు, శ్రేయోభిలాషులు చాలమంది రావడం మొదలుపెట్టారు. అందరూ ధైర్యం చెబుతూనే, ప్రసాద్ ఏదైనా అఘాయిత్యానికి పూనుకోడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నట్లే మాట్లాడేరు.

అందరి ప్రశ్నలకీ జవాబు చెప్పలేక సతమతమౌతోంది అఖిల. తెల్లవారు ఝామున లేచిన మొదలు, ఇప్పటివరకు మరే పనులు

చేయడానికి అవలేదు. ఈ మధ్య ప్రమోషన్ రావటం లేదని తరచూ భర్త అసహనం ప్రకటించడం, తర్వాత ఇలా అకస్మాత్తుగా మాయమవడం ఆమెని కలవరపరిచాయి. ఎవరో ప్రసాద్ కొడుకుకి కబురు తెలియజేస్తే 'వోల్వో' బస్సులో కలకత్తా నుంచి వచ్చాడు. తల్లికి ధైర్యం చెబుతున్నాడు. గంటలు గడచిపోతున్నాయి. ఎందుకేనా మంచిదని కంపెనీ వారు పోలీసు రిపోర్టు కూడా ఇచ్చేరు. ప్రసాద్ జాడ లేదు.

★★★

బీహారు, బెంగాలు రాష్ట్రాలలో గంగానది తర్వాత చెప్పుకోతగ్గ పెద్దనది దామోదర్ నది. 1957లో ఆ నదికి మైథాన్ దగ్గర అతిపెద్ద ఆనకట్ట అప్పటి భారతదేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూగారు ప్రారంభించక ముందు 'బీహారు దుఃఖదాయిని' అని పేరుండేది. ఆనకట్ట కట్టినప్పుడు చాలా పెద్ద జలాశయం ఏర్పడింది. జలాశయానికి మూడు వైపులా దట్టమైన అడవి విస్తరించి ఉంది. ఒడ్డునంతా కూర్చోడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. సరస్సుకి ఒక వైపున్న దట్టమైన అడవిలోంచి తీరం చేరుకోడానికి రోడ్డు ఉంది.

సాయంకాలమౌతోంది. జగత్ చక్షువు సూర్యనారాయణుడు దిగంతాలలోకి జారుకునే ప్రయత్నాలలో ఉన్నాడు. నిశ్చలంగా ఉన్న సరస్సులోని జలాలు కెంపులు వెదజల్లినట్లు ఎర్రబారేయి.

తెల్లవారినప్పటి నుంచి ఆ జలాశయ తీరంలో కూర్చున్న ప్రసాద్ ఒక నిట్టూర్పు విడిచాడు. గత రాత్రి నుండి జరిగిన సంఘటనలు సినీమా రీలులా అతని మస్తిష్కంలో తిరుగుతున్నాయి....

శనివారం రాత్రి తొందరగా పడుకున్నవాడు అర్ధరాత్రి పక్కనే పెట్టుకున్న సెల్‌ఫోను వైబ్రేట్ కావడంతో లేచాడు. తోటి అధికారి వర్మ ఫోను చేసేడు.

"అరే యార్! ప్రమోషన్ల లిస్టు వచ్చింది. చూసుకున్నావా?"

"లేదు గురూ!"

"నేనూ ఇంకా చూడలేదు. ఇప్పుడే ఫార్వర్డ్ చేస్తున్నాను చూసుకో. ముందుగానే కంగ్రాట్స్!"

"అంత వద్దులే. ప్రమోషను ఆర్డర్లు వచ్చేక చెప్పుదువుగాని!"

ప్రక్కనే భార్య పడుకుని ఉంది. ఆమె లేచిపోతుందేమోనని వీధిగదిలోకి వచ్చి కూర్చున్నాడు ప్రసాద్.

ఇంతలో ఫోను 'టింగ్' అంది. వర్మ పంపిన సందేశం. ఆతృతగా చూసేడు. ప్రమోషన్ల లిస్టు వచ్చింది. దానిని డౌన్‌లోడ్ చేసి పరకాయించేడు. లిస్టులో ముందుగా తను పనిచేసే సంస్థ గుర్తు, చిరునామా ఉన్నాయి. గబగబా స్క్రోల్ చేస్తూ లిస్టు మొత్తం చూసేడు.

ప్రసాద్ భయపడినంతా జరిగింది. లిస్టులో అతని పేరు లేదు. ఇన్నాళ్ళు పడిన శ్రమ వృథా అయింది. తాను ఎంతో నిజాయితీతో, కుశలతతో కష్టపడి చేసిన పనులకి రావలసిన గుర్తింపు రాలేదు. ప్రసాద్ మనసు బాధతో మూలిగింది. అప్రయత్నంగా అతని కళ్ళమ్మట రెండు కన్నీటి చుక్కలు రాలేయి. ఎంతగా మనసుని సముదాయించుకుందామన్నా, ఆలోచిస్తున్న కొద్దీ అతని మనసులోని బాధ ఎక్కువవుతోందేగాని ఉపశమనం కలగడం లేదు. వృత్తి ధర్మం పాటిస్తూ దీక్షతో తన విధులు నిర్వర్తిస్తున్న

ప్రసాద్‌కి ఈ వార్త అశనిపాతంలా తోచింది. ఏంచేయాలో పాలుపోలేదతనికి!

తన బాధ ఎవరితోనూ పంచుకోలేదు. తన భార్య ఎంతో మంచిది, జీవితాన్ని బాగా అర్థం చేసుకున్నది. తనలా భావుకురాలు కాదామె. ఈ విషయం చెప్పినా తనను ఏదోలా సముదాయిస్తుంది. తాను చేయని నేరానికి శిక్ష అనుభవిస్తున్నట్టయింది.

పరిపరివిధాల ఆలోచిస్తూ, ఘూర్ణిల్లుతున్న కోపాన్ని ఎలా ఉపశమనం చేసుకోవాలో తెలియక, ఇంటి బయటకు వచ్చాడు ప్రసాద్. ప్రమోషన్లు సమయానికి ఇచ్చినా ఇవ్వకపోయినా కంపెనీవారు ఇంటి విషయంలో మాత్రం సీనియారిటీకి గౌరవం ఇస్తారు. సీనియారిటీ ప్రకారం తనకి ఇంకొంచెం పెద్ద ఇల్లు వచ్చినా, కొడుకు రెసిడెన్షియల్ స్కూల్లో చేరేక పెద్ద ఇల్లు అవసరంలేకపోయింది.

అప్పటికి రాత్రి మూడవ ఝాము అవుతోంది. కాలనీ వీధులు నిర్మానుష్యంగా ఉన్నాయి. గాఢ నిద్రలో ఉన్న భార్య ముఖంలోకి ఒకసారి చూసి, బట్టలు మార్చుకున్నాడు. డూప్లికేటు తాళం చెవి తీసుకొని బయటకు వచ్చి తలుపు తాళం వేసేడు. అదృష్టవశాత్తు అలికిడికి భార్య లేవలేదు.

గ్యారేజ్ తాళం తెరిచి స్కూటరు బయటకు తీసేడు. చప్పుడు కాకుండా గేటు తెరిచి, వీధి చివర దాక స్కూటరు నడిపించుకొని, స్టార్ట్ చేసేడు. ముందు ఎక్కడికెళ్ళాలో తోచలేదు. కొంతసేపు కాలనీ అంతా చక్కర్లు కొట్టి, హైవే మీదుగా మైథాన్ ఆనకట్ట చేరుకున్నాడు.

ప్రసాద్ మైథాన్ ఆనకట్ట చేరుకొనేసరికి ఇంకా తెల్లవారలేదు. ఆనకట్ట ప్రవేశ మార్గంలో ఒక 'డ్రాప్ గేట్' ఉంది. దానికి ముందరే కుడివైపు వెడల్పైన మట్టిదారి ఉంది. డ్రాప్ గేటు దగ్గర సెక్యూరిటీ గార్డు కునుకుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తూంది. స్కూటరు ఆఫ్ చేసి నెమ్మదిగా నడిపించుకుంటూ మట్టి దారిలో కొంత దూరం వెళ్ళాక స్కూటరు స్టార్ట్ చేసేడు. ఆ మట్టిదారి ఎక్కడికి పోతుందో ప్రసాద్‌కి బాగా తెలుసు. ప్రతి ఏడూ జనవరి నెలలో ఆ జలాశయ తీరానికి పిక్నిక్‌కి రావడానికి ఇదే మార్గం!

ప్రసాద్ ఆలోచనలకి అంతరాయం కలిగింది. ఎక్కడో దూరం నుంచి చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. సాయంకాలం వేళ దట్టమైన చెట్ల గుబుర్లతో చీకట్లు ముసురుకుంటున్నాయి. టార్చ్ లైట్ల వెలుగు చెట్లను చీల్చుకుంటూ ప్రసాద్ మీద పడింది. ఎంతసేపటి నుండి తను పరధ్యానంలో ఉన్నాడో కాని చీకట్లు ముసరడం అతనికి తెలియలేదు.

ఇంతలో మాటలు దగ్గరగా వినిపించాయి. తనకి బాగా తెలిసిన వాళ్ళే అనుకుంటూ లేచి నిలుచునేసరికి 'సెర్చ్' బృందం అక్కడికి చేరుకుంది.

★★★

ఈ సంఘటన జరిగిన వారం రోజులకి, మిడిల్ లెవెల్ యాజమాన్యం వరకు ఉన్న అధికార్ల బృందాల ప్రమోషన్ ఆర్డర్లు వచ్చాయి.

అదే రోజు ప్రసాద్, అఖిల మధ్యాహ్నం వోల్వో బస్సు పట్టుకొని కలకత్తా చేరుకున్నారు. అక్కడ ఒక ఐదు నక్షత్రాల హోటలులో దంపతులిద్దరూ పూల్ సైడు అమర్చిన టేబిలు దగ్గర కూర్చుని నెమ్మదిగా షాంపేను సేవిస్తూ, ప్రసాద్‌కి వచ్చిన అపురూపమైన ప్రమోషన్ సెలెబ్రేట్ చేసుకుంటున్నారు. సాయంత్రం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. చిక్కని చీకట్లలో మిణుకు మంటున్న దీపాలు, నీలం రంగులో వెలిగిపోతున్న స్విమ్మింగ్ పూలు మనసుకు ఎంతో హాయినిస్తున్నాయి.

గత వారం రోజులలో జరిగిన సంఘటనల నుండి బయటపడి, ఆహ్లాదకరమైన వాతావరణంలో భర్తతో గడపడం కలలో ఉన్నట్లుగా ఉంది అఖిలకి. వారిద్దరి మధ్యా మౌనం రాజ్యమేలింది.

"నువ్వేదో అఘాయిత్యం చేస్తావని ఆలోచన రాగానే... నా గుండె బేజారైపోయింది. నువ్వు అలాటివేవీ చెయ్యవని నాకు నమ్మకం ఉన్నా, బలహీన క్షణాల్లో మనసు పరిపరి విధాల పోతుంది..." అంది అఖిల మౌనాన్ని భంగపరుస్తూ.

"అవును నిజమే. ఆ రాత్రి అలా పూనకం వచ్చిన వాడిలా ఇంట్లోంచి వెళ్ళిపోయాను. మైథాన్‌లో సుమారు పన్నెండు గంటలు పైగానే ఆలోచనలలో మునిగితేలాను. ఆఖరికి మనసు సమాధాన పరుచుకొని ఇంటికి వద్దామనుకునే సమయంలో వర్మా వాళ్ళు వచ్చేరు."

"అవును ఆరోజు మీకు ప్రమోషన్ రాలేదని ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్నారని ఊరంతా అపవాదులు___ ప్రతీ ఒకరు వారికి తోచిన విధంగా ఊహాగానాలు చేసేరు. ఆయితే ఇంత సంకట పరిస్థితిలోను వర్మా భయ్యా, భాభీ మాత్రమే నాకు అండగా నిలిచి ధైర్యాన్నిచ్చేరు."

"అవును, వర్మ చేసిన మేలు మరచిపోలేం.. తన పరపతి ఉపయోగించి పోలీసు కేసు అవకుండా చూసుకున్నాడు."

"శనివారం రాత్రి నాకు వర్మ పంపిన లిస్టు 'ఫేక్' అని తేలిందని మైథాన్‌లో నన్ను కలిసిన వెంటనే చెప్పేడు. అప్పటికి నా మనసు ఊరటచెందింది. ఆ లిస్టే నిజంగా సరియైనదే అయితే మనమేం చేయగలం చెప్పు?"

"చూడు ప్రసాద్, ప్రమోషను ఒక్కటే జీవితానికి పరమావధి కాదు కదా..."

"ఏదైతేనేం, వర్మ దయవల్ల ఒక పెద్ద అపవాదు నుండి బయటపడ్డాం."

"అవును నిజమే. అన్నీ మరచి వర్తమానంలో జీవిద్దాం. షాంపేను ఎంజాయ్ చేద్దాం"

హాయిగా నవ్వుకున్నారు దంపతులిద్దరూ.

# అమ్మకోసం

కొలిచిన జ్యోతిర్లత



✆ 9948666067

**దీపావళి 2023 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***పెద్దవాళ్లు పిల్లలకు సాధారణంగా వారి సమస్యల్ని, బాధల్ని చెప్పరు. మీరే కనుక్కోవాలి. వీలైనంత సాయం చేయాలి. అప్పుడే ఫ్యామిలీ రిలేషన్‌షిప్ బావుంటుంది. ఏ విషయాలు కూడా వారి నుండి దాచద్దు... ఎందుకంటే మీ మంచిని కోరుకునేది వాళ్లే కాబట్టి! ఇదే నేను మీకు ఇచ్చే సిన్సియర్ అడ్వైస్.***

"అమ్మా! ఈ సంవత్సరం 'ది బెస్ట్ పేరెంట్ అవార్డ్' నీకు వస్తుందని మా క్లాస్‌మేట్స్ అంతా అంటున్నారు!" హైదరాబాద్‌లోని ఒక అత్యున్నత పాఠశాలలో పన్నెండవ తరగతి చదువుతున్న శైలజ కూతురు నిహారిక తల్లితో రాత్రి డిన్నర్ సమయంలో సంతోషంగా చెప్పింది.

కూతురు మాటలు విని ఆశ్చర్య పోయింది శైలజ. "నాకా... నాకెందుకు ఇస్తున్నారు? నేనేం చేశానని?"

"ఏమోనమ్మా నాకు తెలియదు! స్కూల్ మేనేజ్‌మెంట్ వాళ్లకి కొన్ని పారామీటర్స్ ఉంటాయట. అవి పాటించిన పేరెంట్స్‌కి ఇలా అవార్డ్ ఇస్తారట. ఈసారి నా పెర్ఫార్మెన్స్ బట్టి నీకు వస్తుందని మా ఫ్రెండ్స్ అనుకుంటుంటే నేను విన్నాను. నీకు సంతోషంగా లేదా అమ్మా?" కూతురు అడుగుతుంటే నవ్వు వచ్చింది శైలజకి.

"వచ్చినప్పుడు చూద్దాం లే!" నవ్వుతూ కొట్టి పారేసింది.

"నువ్వెప్పుడూ అంతే అమ్మా. ఎంతమంచి న్యూస్ చెప్పినా సంతోషించవు!" బుంగమూతి పెట్టింది నీహారిక.

"సరేలే, నీ ఎగ్జామ్స్‌కి ప్రిపరేషన్ ఎలా ఉంది?" మాట మారుస్తూ అడిగింది శైలజ.

"సూపర్ అమ్మా! ఈసారి స్కూల్ ఫస్ట్ వస్తాను. గోల్డ్‌మెడల్ కూడా సంపాదిస్తాను!" ధీమాగా చెప్పింది కూతురు.

"చూడు నీహా! కాన్ఫిడెన్స్ ఉండటం మంచిదే... కానీ అది ఓవర్ కాన్ఫిడెన్స్ కాకుండా జాగ్రత్తగా చదువు. నిన్ను బీట్ చేయాలని నీ ఫ్రెండ్సే చాలామంది, నీకు తెలియకుండా అవకాశం కోసం చూస్తున్నారని మరిచిపోవద్దు. అది తెలుసుకుని మసలుకుంటే నీకే మంచిది!"


"సరే... సరే... నువ్వు చెప్పినట్టుగానే చదువుకుంటాను. మాట్లాడితే చాలు, లెక్చర్లు యిస్తావు!" అంటూనే తన రూములోకి వెళ్ళిపోయింది నీహారిక.

కూతురు చెప్పినట్లుగానే మర్నాడు స్కూల్ ప్రిన్సిపాల్ నుండి ఫోన్ వచ్చింది శైలజకి! తనని స్కూల్లో జరిగే వార్షికోత్సవ కార్యక్రమంలో స్పెషల్ గెస్ట్‌గా ఇన్వైట్ చేస్తున్నామని, తప్పకుండా రావాలని ఆహ్వానిస్తూ మాట్లాడారు. మొదట తటపటాయించినా పిన్సిపాల్ గారు అభ్యర్థిస్తూ మాట్లాడేసరికి కాదనలేకపోయింది.

ఒప్పుకుంది కానీ మనసులో ఒకటే సంశయం... తనను అవార్డ్‌కి ఎంపిక చేశారా... లేకపోతే తనను విశిష్ట అతిథిగా పిలవటం ఏమిటి?

వార్షికోత్సవ తేదీన అన్యమనస్కంగానే స్కూల్ ఫంక్షన్‌కి వెళ్లింది. నీహారిక స్నేహితురాళ్లంతా తన చుట్టూ చేరి అభినందిస్తుంటే, కూతురి కళ్లలో మెరుపు పసికట్టింది. ప్రిన్సిపాల్ గారు శైలజని సాదరంగా ఆహ్వానించి స్టేజీకి అభిముఖంగా ముందు వరుసలో కూర్చోపెట్టారు. ఇంతలో సాంస్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి. నీహారిక వాటిల్లో ఉత్సాహంగా పాల్గొంది. ఆ కార్యక్రమం తరువాత వివిధ పోటీల్లో పాల్గొని గెలిచిన వారికి బహుమతి ప్రదానం జరిగింది. నీహారిక చాలా వాటిల్లో ప్రథమ బహుమతులనందుకుంది. బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ ట్రోఫీ అందుకుంటుంటే చప్పట్లతో ఆడిటోరియం మారు మ్రోగింది. చివరిగా బెస్ట్ పేరెంట్ అవార్డ్ అనౌన్స్ చేసి శైలజ పేరు పిలవగానే కరతాళ ధ్వనులతో ఆడిటోరియం ప్రతిధ్వనించింది. తప్పనిసరిగా లేచి స్టేజీ ఎక్కి ముఖ్య అతిథి ఇచ్చిన మెమెంటో స్వీకరించి మెమెంటోని పక్కగా పెట్టింది. ప్రిన్సిపాల్ గారు మైకు ముందుకొచ్చి నాలుగు మాటలు మాట్లాడమని అభ్యర్థించారు.

మైకు ముందుకు వచ్చి నిలుచుని ఒకసారి ఆడిటోరియం మొత్తం పరికించి చూసింది. తాను చెప్పే మాటలు వినటానికా అన్నట్లు అంతా నిశ్శబ్దంగా ఎదురు చూస్తున్నారు.



"అందరికీ నమస్కారం! ఈరోజు నాకు ఈ అవార్డ్ ఇవ్వటం నన్ను ఇరకాటంలో పడేసింది. నేను ఇది తీసుకోవటానికి అర్హురాలినో కాదో నాకు తెలియదు! ఎందుకంటే ఈ రోజు నా గతాన్ని మళ్లీ గుర్తుకు తెచ్చింది. నా బాల్యం, వాటి స్మృతులను మీ అందరితో పంచుకోవాలని అనిపిస్తోంది..." అంటూ కాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయింది.

మళ్లీ కొనసాగిస్తూ "నాకు చిన్నప్పుడే మా నాన్నగారు ఆక్సిడెంట్‌లో పోయారు. మా అమ్మే నన్ను అన్నీ తానై పెంచింది. నాన్న పోయాక నాన్న ఉద్యోగం అమ్మకిచ్చారు. ఒక పక్క ఉద్యోగం చేస్తూ నన్ను చదివించింది. నా చదువు కోసం అమ్మ ఎంతో కష్టపడింది. ఒక్కదాన్నే అవ్వటం వల్ల నేను ఏది అడిగితే అది ఇచ్చేది. నా చదువు పట్ల ఎంతో శ్రద్ధ చూపెట్టేది. నాకు స్నేహితులు ఎక్కువగా ఉండేవారు. వాళ్ళందరి తోటి కూడా అమ్మ చనువుగా ఉండేది. నేను డిగ్రీ పూర్తి చేసిన తరువాత, మా ఫ్రెండ్స్ అందరిలాగే ఎంబీఏ చేయడానికి అమెరికా వెళతానని పట్టుపట్టాను.

అమ్మకి యిష్టం లేకపోయినా నా ఇష్టాన్ని కాదనలేక అమెరికా పంపటానికి సిద్ధపడింది. నేను వెళితే అమ్మ ఒంటరై పోతుందని

నేను అప్పుడు ఆలోచించలేదు. ఫ్రెండ్స్ అంతా వెళుతున్నారు. నేను కూడా అమెరికాలో చదువుకోవాలని క్రేజ్ తప్ప వేరే ఆలోచన లేదు. మంచి యూనివర్సిటీలో సీటు సులభంగానే సంపాదించాను. అమ్మ ఎన్నో జాగ్రత్తలు చెప్పి ఎప్పుడూ ఫోన్లో టచ్‌లో ఉండమని మరీ మరీ చెప్పి పంపించింది. ఆ టైంలో స్మార్ట్‌ఫోన్లు లేవు. రెగ్యులర్‌గా కాల్స్ చేస్తానని అమ్మకి ప్రామిస్ చేసి, నేను అమెరికా వెళ్ళిపోయాను. అమెరికా వెళ్లిన కొత్తల్లో అమ్మ కోసం బెంగగా అనిపించేది. వారంలో రెండు మూడు సార్లు ఫోన్ చేసేదాన్ని.

అక్కడి లైఫ్‌కి అలవాటు పడ్డాక అమ్మ మీద బెంగ తగ్గింది. స్నేహితులతో వీకెండ్స్ బాగా గడిచిపోయేవి. అమ్మకి కాల్స్ చెయ్యటం తగ్గిపోయింది. ఎప్పుడూ ఫ్రెండ్స్‌తో గడపడం ఎక్కువైంది. అలాగని చదువు నిర్లక్ష్యం చెయ్యలేదు. నా నుండి ఫోన్ రాకపోతే అమ్మ కంగారుగా అప్పుడప్పుడు ఫోన్ చేసి నా బాగోగులు అడిగి పెట్టేసేది. రెండు మూడు నిమిషాలు మాట్లాడితేనే అమ్మకి ఫోన్ బిల్ వేలల్లో వచ్చేది. అమ్మని ఫోన్ చేయవద్దని నేనే చేస్తానని చాలా సార్లు చెప్పేదాన్ని, కాని ఎప్పుడూ మాట నిలబెట్టుకోలేదు. అమ్మ బాగానే ఉంటుందిలే అన్న ధీమా ఉండేది.

అదే టైంలో శ్రీనివాస్, అదే నీహారిక నాన్నగారు నాకు దగ్గరైనారు. మేమిద్దరం బ్యాచ్‌మేట్స్. అతని మాటలు, నా పట్ల బిహేవియర్ నన్ను అతనంటే ఇష్టపడేలా చేసింది. ఇద్దరం కలిసినప్పుడల్లా భవిష్యత్తు గురించి, చేయబోయే వ్యాపారం గురించీ బంగారు కలలు కనే వాళ్లం. అమ్మకి శ్రీనివాస్ గురించి ఎన్నోసార్లు చెప్పాలని అనుకున్నాను. కానీ పోస్ట్‌పోన్ చేస్తూ వచ్చాను. అమెరికాలో నా లైఫ్ హ్యాపీ గా గడిచిపోతోంది.

ఒకరోజు రాత్రి మా మామయ్య దగ్గరనుండి ఫోన్ వచ్చింది. ఆ సమయంలో మామయ్య ఫోనెందుకు చేశారా అని ఆశ్చర్యపడుతూ ఫోన్ తీశాను. "అమ్మా శైలూ, నువ్వు అర్జెంటుగా హైదరాబాద్ బయలుదేరి రావాలమ్మా!" అని అన్నారు. నా మనసేదో కీడు శంకించింది. "అమ్మ బాగానే ఉంది కదా మామయ్యా?" అని అడిగాను. "అదేనమ్మా, అమ్మకి ఆరోగ్యం బాగాలేదు. హాస్పిటల్‌లో ఉంది. కొంచెం సీరియస్‌గా ఉంది. నిన్ను చూడాలని అంటోంది. నువ్వు ఎంత తొందరగా వస్తే అంత మంచిది." అని చెప్పి ఫోన్ పెట్టేశారు. నాకు కాళ్లు చేతులూ ఆడలేదు. శ్రీనివాస్‌తో చెప్పి నెక్స్ట్ ఫ్లైట్ బుక్ చేసుకుని బయలుదేరి పోయాను. ఎయిర్ పోర్ట్‌కి శ్రీనివాస్ నాతో పాటూ వచ్చి ధైర్యం చెప్పి దిగబెట్టి వెళ్ళిపోయాడు.

ప్రయాణం చేస్తున్నంత సేపూ నా మనసు పరిపరి విధాల ఆలోచనలో పడింది. అమ్మకి అనారోగ్యం ఏమిటీ, నేనెప్పుడూ ఊహించనైనా ఊహించలేదు. అమ్మ ఫిజికల్‌గా, మెంటల్‌గా చాలా స్ట్రాంగ్ అనే అభిప్రాయం నాది. ఏ రోజు కూడా అమ్మ ఆరోగ్యం గురించి అడిగి కనుక్కోలేదు. అసలు అమ్మతో మనసు విప్పి మాట్లాడి ఎన్నో రోజులయింది. శ్రీనివాస్‌తో పరిచయమయ్యాక అమ్మకు నేను ఫోన్ చెయ్యటమే తగ్గించేసాను. అమ్మతో గడిపిన రోజులు గుర్తుకు రాసాగాయి. అమెరికా వచ్చిన తరువాత ఒక్కసారి కూడా ఇండియాకి రాలేదు నేను. అమ్మ ఒంటరిగా ఉందన్న విషయం కూడా గుర్తుంచుకోలేదు. అమ్మని నేను బాగా నిర్లక్ష్యం చేసాను... ఇలాంటి ఆలోచనలు చుట్టుముట్టగా నా మనసులో అపరాధ భావం కలిగింది.

భగవంతుడా, అమ్మకి ఏమీ కాకూడదు అని మనసులో దండం పెట్టుకుంటూనే వున్నాను. కానీ, ఏ మూలో భయం చోటు చేసుకుంది. అమ్మని ఏ పరిస్థితిలో చూడవలసి వస్తుందో అని. ఆలోచనలతో పిచ్చెక్కేట్టుగా ఉంది. హైదరాబాదులో అమ్మని ఎప్పుడు చూస్తానా అనే ఆత్రం ఇంకో వైపు.

ఫ్లైట్ హైదరాబాద్‌లో లాండ్ అయినట్లు అనౌన్స్‌మెంట్ చేశారు. మావయ్యకి నేను హైదరాబాద్ వస్తున్న సంగతి తెలుసును కాబట్టి ఎయిర్‌పోర్టుకి వచ్చాడు. మావయ్యను చూడగానే పరిగెత్తుకుంటూ వెళ్లి చేతులు గట్టిగా పట్టుకుని "అమ్మకెలా ఉంది

మావయ్యా?" అంటూ కంగారుగా అడిగాను. మావయ్య దానికి జవాబు ఏమీ చెప్పకుండా "పద" మంటూ లగేజ్ వున్న ట్రాలీని తోసుకుంటూ ముందుకు నడిచాడు. మావయ్య ప్రవర్తనకి ఇంకా కంగారేసి "చెప్పు మావయ్యా... అమ్మకి ఇప్పుడు ఎలా ఉంది. అడుగుతుంటే మాట్లాడవేం?" కొంచెం గట్టిగా అడిగాను. మావయ్య మౌనంగా క్యాబ్‌లో తనని ఎక్కమని చెప్పి హాస్పిటల్ అడ్రస్ డ్రైవర్‌కి చెప్పి పక్కన కూర్చుని "చూడమ్మా శైలజా, అమ్మ హాస్పిటల్‌లో ఉంది. మనం అక్కడికే వెళుతున్నాం. నువ్వు ధైర్యంగా ఉండాలి. ఇంతకన్నా ఇప్పుడింకేమీ చెప్పలేను!" అంటూ నా చేతిని నిమురుతూ మౌనంగా అయిపోయాడు. నా మనసు ఏదో కీడును శంకించింది.

అమ్మకి ఏమీ కాదు అంటూ నాలో నేనే ధైర్యం చెప్పుకుంటూ ఉండిపోయను. ఇంతలో క్యాబ్ హాస్పిటల్ ఆవరణలోకి వచ్చి ఆగింది. కారు దిగుతుంటే నా గుండెలు దడదడ లాడాయి. మావయ్య టాక్సీ బిల్ కట్టి లగేజి రిసెప్షన్లో ఒక మూల పెట్టి, నా చేతిని పట్టుకొని లాక్కెళుతున్నట్టు తీసికెళ్ళసాగాడు. ICU వైపు తీసుకొని వెళుతున్నాడని అనుకున్నాను. కాని అవన్నీ దాటి ముందుకు నడుస్తున్న మావయ్య ఒక చోటుకి రాగానే ఆగిపోయాడు.

పైన రాసి వున్న బోర్డును చూడగానే నా గుండె ఆగిపోయినట్లు అనిపించింది. అది మార్చురీ. "మావయ్యా, ఇక్కడికెందుకు తీసుకొచ్చావు, అమ్మకేమయింది?" వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ గద్గద స్వరంతో అడిగాను. "మీ అమ్మ లేదమ్మా... మనల్ని వదిలి వెళ్ళిపోయింది." బాధతో చెప్పాడు. ఏ మూలనో అమ్మకి బాగానే ఉండొచ్చు అనుకున్న నాకు ఈ నిజం తెలియగానే భోరున ఏడిచాను.

మార్చురీలో చేయాల్సిన ఫార్మాలిటీస్ అన్నీ పూర్తిచేసి అమ్మ శవాన్ని తీసుకొని ఇంటికొచ్చారు. అమ్మకి జరగాల్సిన కర్మకాండలన్నీ మావయ్యే దగ్గరుండి చేశారు. నేను మాత్రం అలా షాక్‌లో ఉండిపోయి, స్తబ్దుగా జరిగే కార్యక్రమాన్ని చూస్తూ ఉండిపోయాను. ఏదో తెలియని బాధ, వెలితి నా మనసును చుట్టేసాయి. అమ్మ మరణానికి కారణం నేనే కదా అని గిల్టీగా అనిపించసాగింది!

కళ తప్పి వెలవెల పోతున్న ఇంట్లో, అమ్మ జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఇల్లంతా కలియ తిరుగుతూ అమ్మ వాడుకున్న వస్తువులను అపురూపంగా చూస్తూంటే, టేబుల్ దగ్గర అమ్మ వాడే సంచీ కనపడింది. గబుక్కున సంచీలో వున్న బట్టలను బైటికి తీస్తుంటే అందులో ఒక డైరీ కనపడింది. ఆదుర్దాగా డైరీ చేత్తో పట్టుకుని మంచం మీద కూర్చొని పేజీలు తిప్పాను. అది అమ్మ రాసుకున్న పర్సనల్ డైరీ. ఆత్రంగా ఒక్కో పేజీ చదవసాగాను.

ఒక పేజీలో ఇలా రాసుంది. "ఈ రోజు శైలజ ఫోన్ చేస్తుందేమో అని ఎదురు చూసాను. ఫోన్ రాలేదు. చాలా నీరసంగా అనిపిస్తోంది." మరో పేజీలో "శైలజ ఫోన్లు చేయటం తగ్గించింది. ఎందుచేత? చదువులో బిజీగా ఉండి ఉంటుంది. నేను చేద్దామంటే డబ్బులకి ఇబ్బంది అవుతోంది. ఇంటర్నేషనల్ కాల్ కదా. నిమిషం మాట్లాడితేనే బిల్ వందల్లో వస్తోంది. అందుకేనా నన్ను కాల్స్ ఎక్కువ చేయవద్దని చెప్పింది! మరి అన్నీ తెలిసి కూడా అమ్మ కాల్ కోసం వెయిట్ చేస్తోందని తెలియదా? ఈ విషయంలో శైలజ తీరు నాకు నచ్చడం లేదు. ఎలా తెలియాలి దానికి?" ఇంక చదవలేకపోయాను.

చాలా పేజీల్లో అమ్మ నా ఫోను కోసం ఎంత ఎదురు చూసింది అన్నది స్పష్టంగా కనిపిస్తుంది. కానీ నేను అమెరికాలో ఏం చేసాను? స్నేహితులతో కాలక్షేపం చేస్తూ అమ్మని నిర్లక్ష్యం చేశాను. అమ్మ బాగానే ఉంటుందనే ధీమాతో వున్నాను. అమ్మ నాతో మాట్లాడాలని ఎంత క్షోభ అనుభవించి ఉంటుంది! ఆ క్షణం నాకు కన్నీళ్లు ఆగలేదు. ఇంకొన్ని పేజీలు తిప్పాను...

ఒక పేజీలో ఇలా రాసుంది...

"ఈ రోజు ఎందుకో రోజూ కన్నా నీరసంగా అనిపిస్తోంది. ఆఫీసుకి వెళ్ల గలిగే ఓపిక లేదు. సాయంత్రం డాక్టర్‌ను చూడాలి."

"మెడికల్ రిపోర్ట్స్‌లో ఏదో తేడా కనిపించింది. డాక్టర్ని అడగాలి"

"డాక్టర్ చెప్పినది వినగానే నా కాళ్ల కింద భూమి కదిలిపోయింది."

"నాకు లంగ్ క్యాన్సర్. అడ్వాన్స్ స్టేజీలో ఉందని డాక్టర్ చెప్పాడు. నాకు ప్రపంచం మొత్తం తల్లకిందులైనట్లు అనిపించింది."

ఇంకో పేజీలో ఇలా రాసుకుంది.

"శైలజకి ఈ విషయం గురించి ఎలా చెప్పాలి? పిల్ల దూరంగా ఉంది. ఇది వింటే తను తట్టుకోగలదా? తన చదువుకు విఘాతం కలుగుతుంది. చెప్పకపోవడమే మంచిది."

"ఈ ఒంటరి పోరాటం ఎన్నాళ్ళు? ట్రీట్మెంట్ తీసుకుంటున్నా ఫలితం ఏమీ కనిపించటం లేదు. నేను ఇంకెన్నాళ్లో బతకను అని అనిపిస్తోంది!"

"డబ్బు సరిపోవడం లేదు. మంచి నీళ్ళల్లా ఖర్చు అవుతోంది మందుల వల్ల. శైలజకి ఫోన్ చేసి నా పరిస్థితి చెప్తే? వద్దు... అంటోంది మనసు. విషయం తెలియగానే చదువు మానేసి వచ్చేస్తే? ఇన్నాళ్లు నేను కన్న కలలు అన్నీ చెదిరిపోతాయి."

ఇంకో పేజీలో....

"శైలజ మీద కోపం వస్తోంది. అసలు ఫోన్ చెయ్యదేంటి? ఎందుకు ఇంత బాధ్యతారహితంగా ప్రవర్తిస్తోంది?"

"ఈ రోజు తమ్ముడు వచ్చాడు. వాడికి తెలియదు నా జబ్బు సంగతి. నేనే ఎవరికీ చెప్పలేదు. నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. "ఇలా అయిపోయావేంటక్కా... శైలజ మీద బెంగా ఏమిటి?" అంటూ ఆరా తీసాడు. నేను ఏమీ చెప్పలేదు. "అక్కా, హెల్త్ జాగ్రత్త. పాడు చేసుకోకు," అని చెప్పి వెళ్ళిపోయాడు."

మరో పేజీలో ఇలా రాసుంది.

"శైలజ మీద కోపంగా ఉంది. ఎంత బిజీగా ఉన్నా అమ్మతో మాట్లాడలేనంతగానా?"

"ఆఫీసుకి సిక్‌లీవ్ పెట్టేసాను. ఈ సెలవులు కూడా అయిపోతే ఇంక జీతం రాదు. డబ్బులు జాగ్రత్తగా ఖర్చు చేయాలి."

ఒక్కో పేజీ చదువుతున్ననా కళ్ల నుండి ధారాపాతంగా కన్నీళ్లు కారసాగాయి.

అలాగే ఇంకో పేజీ చదవసాగాను.

"ఈ రోజు ఒంట్లో ఎంతో నిస్సత్తువగా ఉంది. ఊపిరి తీసుకోవటం కూడా కష్టంగా ఉంది. తమ్ముడికి ఫోన్ చేసాను అర్జెంటుగా రమ్మని. మంచం మీద పడుకుని వున్న నన్ను చూసి భయపడి పోయాడు. 'ఏమిటక్కా ఇలా అయిపోయావేమిటి?' అంటూ అడిగాడు. మాట్లాడకుండా మెడికల్ రిపోర్ట్స్ వాడి చేతిలో పెట్టాను. రిపోర్ట్ చూసి హతాశుడయ్యాడు. 'ఇన్ని రోజులు ఎందుకు చెప్పలేదు అక్కా, నేను నీకేమీ కాకుండా పోయానా? ఇంత దారుణ పరిస్థితి వచ్చే వరకు నాకెందుకు చెప్పలేదు?' అరిచినట్టే అడిగాడు. 'మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం ఎందుకని చెప్పలేదు. ఇప్పుడు ఇంక టైమ్ లేదు. హాస్పిటల్‌కి తీసుకెళ్ళు...' అని చెప్పగానే, గబగబా నా బట్టలు, మందులు అవీ బ్యాగులో సర్దేసాడు. హాస్పిటల్‌లో జాయిన్ అయ్యాను. బ్యాగులో నా డైరీ కూడా పెట్టుకున్నాను."

అమ్మ రాసిన ఆఖరి పేజీలో ఇలా రాసుకుంది. 'నాకు బ్రతుకుతాననే నమ్మకం లేదు. ఈ ట్రీట్మెంట్ తట్టుకోవడం కష్టంగా ఉంది. శైలజే మాటిమాటికి గుర్తుకొస్తోంది. నేను నా పెంపకంలో ఏదైనా లోపం చేశానో ఏమో. అది నాతో మాట్లాడటం ఎందుకు తగ్గించింది? తన ఇష్టానుసారం అన్నీ చేశానే. అమెరికాలో చదువుతాను అంటే నాకు భారమైనా పంపించానే. ఇంకా ఏం చేయాలి. నేను అనుభవిస్తున్న ఈ నరకం నాతోనే పోవాలి. దానికి తెలియకూడదు. నేను లేకపోయినా అది సుఖంగా ఉండాలి. భగవంతుడా.... నా శైలుని నువ్వే కాపాడు...' తరువాతి పేజీలు అన్నీ ఖాళీగా ఉన్నాయి!"

ఆడిటోరియంలో శైలజ చెప్పేది వింటున్న విద్యార్థులు అందరూ నిశ్శబ్దంగా వింటున్నారు.

ఒక్క క్షణం తర్వాత మళ్ళీ చెప్పడం మొదలెట్టింది.

"అమ్మ డైరీ చదివిన తరువాత నేను చేసిన తప్పులు నాకు తెలిసాయి. అందుకే అమ్మ జ్ఞాపకాలతో బ్రతకాలని ఇండియా వచ్చేసాను. నా నిర్ణయానికి శ్రీనివాస్ కూడా సమ్మతించాడు. పెళ్లైన తరువాత నీహారిక పుట్టింది. నీహారికని అమ్మ నన్ను పెంచిన విధంగా పెంచాలి అని అనుకున్నాను. నీహా నాన్నగారు బిజినెస్ పెట్టి ఇండియా అమెరికా మధ్య తిరుగుతూ బిజీగా ఉంటారు. నీహాని ఒక అమ్మలాగే కాకుండా ఒక స్నేహితురాలుగా చూడటం మొదలు పెట్టాను. నా విషయాలు అన్నీ తనతో పంచుకుంటూ తన విషయాలన్నీ నాతో పంచుకునే విధంగా చేశాను. మా ఇద్దరి మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ లేదు. అరమరికలు అస్సలు లేవు. నేను అమ్మకు దూరమైన నా తప్పిదాన్ని నీహాకు దగ్గరై సరిచేసుకున్నాను. ఇంతే నేను చేసింది..." అని చెప్పటం ఆపింది.

ఆడిటోరియం చప్పట్లతో మార్మోగింది.

"నేను పిల్లలకి చెప్పేది ఒకటే... దయచేసి మీరు విదేశాలలో వున్నా, మరెక్కడున్నా తల్లితండ్రులతో మీ ఆలోచనలు, అభిప్రాయాలు షేర్ చేయండి. నా చిన్నతనంలో స్మార్ట్‌ఫోన్లు లేవు. లాండ్‌లైన్ తప్పించి. ఇప్పుడు మీకు స్మార్ట్‌ఫోన్, వాట్సప్, ఫేస్‌బుక్ మొదలైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. అట్లాగే వాళ్ల ఆరోగ్యం పట్ల కన్సర్న్ చూపిస్తూ, అప్పుడప్పుడు అడుగుతూ ఉండండి. ఎందుకంటే పెద్దవాళ్లు పిల్లలకు సాధారణంగా వారి సమస్యల్ని, బాధల్ని చెప్పరు. మీరే కనుక్కోవాలి. వీలైనంత సాయం చేయాలి. అప్పుడే ఫ్యామిలీ రిలేషన్షిప్ బావుంటుంది. ఏ విషయాలు కూడా వారి నుండి దాచద్దు... ఎందుకంటే మీ మంచిని కోరుకునేది వాళ్లే కాబట్టి! ఇదే నేను మీకు ఇచ్చే సిన్సియర్ అడ్వైస్. ఇంక ఈనాటి అవార్డ్ విషయానికి వస్తే... నాకు బెస్ట్ పేరెంట్ అవార్డ్ మీరు ప్రకటించారు. కానీ దానికి నేను అర్హురాల్ని కాను అని నా మనస్సాక్షికి తెలుసు. నేను నా జీవితంలో చేసిన తప్పును సరిదిద్దుకోవడానికి, నా కూతురి ద్వారా ప్రయత్నించాను. అమ్మలాగానే కాకుండా ఒక గురువు లాగా, స్నేహితురాలిలాగా తనతో గడిపాను. నన్ను అర్థం చేసుకుంది కాబట్టి ఈ రోజు నాకు తను గర్వకారణం అయింది. నాకు ఈ తృప్తి చాలు. వేరే అవార్డ్స్ వద్దు. నన్ను క్షమించండి. మీరు ప్రకటించిన అవార్డు నేను తీసుకోలేను!" అని సున్నితంగా తిరస్కరించి, వడివడిగా అడుగులు వేసుకుంటూ స్టేజ్ దిగి వచ్చేసింది శైలజ.

తర్వాత ప్రిన్సిపాల్ గారు ఎంత బ్రతిమిలాడినా తీసుకోలేదు.

ఇప్పుడు నీహారికకు వాళ్ల అమ్మ శైలజని చూస్తుంటే గౌరవం ఇంకా పెరిగింది!

# క్రమశిక్షణ

డా. మజ్జి భారతి



✆ 94406 15206

*'నాకు డాక్టర్ అవ్వాలని ఉంది.*
*కానీ నేను డాక్టరై భవిష్యత్తులో ఎక్కువ కష్టపడటం ఇష్టంలేదు డాడీకి.*
*డాడీ నా గురించి ఇంతగా ఆలోచించినప్పుడు,*
*డాడీ కోరిక ప్రకారం ఎంపీసీలో జాయిన్ అయి ఐఐటీలో మంచి సీటు తెచ్చుకుంటాను!"*

"ముసలి నాకొడకా! ఏంట్రా! ఆ మూటలెత్తుకోవడం? అంత ఓపిక లేనివాడివి పనికెందుకు రావాలిరా? డబ్బులు తీసుకునేటప్పుడు మాత్రం, అందరితో సమానంగా కావాలి. పనిచెయ్యడానికి మాత్రం పనికిరారు!" మండిపడుతున్నాడు శ్రీహరి, ఏభై కేజీల బస్తాని వీపు మీద పెట్టుకొని నెమ్మదిగా అడుగులు వేస్తున్న నారాయణను చూసి.

అక్కడ కూర్చున్న మగవాళ్ళంతా అదేదో మామూలు విషయమన్నట్టు వాళ్ళ మాటల్లో పడిపోయారు.

అక్కడే కూర్చుని ఆడుకుంటున్న ఏడేళ్ల రాజాకి, ఆ మాటలు నచ్చలేదు.

"పెద్దవాళ్లను ఏమీ అనవద్దని నువ్వే చెప్పావు కదా డాడీ! మరి శ్రీహరి అంకుల్ ఆ తాతను తిడుతుంటే నువ్వు ఊరుకున్నావేమి, అంకుల్ని దెబ్బలాడకుండా? మొన్న తాతను ఏదో తీసుకోమని నేను చెబితే, పెద్దవాళ్ళతో పని చేయించకూడదు, మనమే చెయ్యాలని చెప్పావు కదా! మరి ఆ తాతతో పనెందుకు చేయిస్తున్నారు?" అడిగాడు తండ్రి నరసింహని.

రాజా మాటలు విని అక్కడ వాళ్ళంతా గట్టిగా నవ్వేశారు.

"ఏమిట్రా నీ కొడుకుని ఇంత సున్నితంగా పెంచుతున్నావు?" పెద్దనాన్న వరసైన రామకృష్ణ అడిగాడు నరసింహని.

"ఇప్పుడే ఇలా ఉంటే పెద్దయ్యాక ఏ రాడికల్ గానో తయారవుతాడు. జాగ్రత్తపడరా బాబూ!" హాస్యానికి అంటున్నట్టు అన్నాడు నరసింహకి బావ వరసైన రాజేష్.

"చిన్నప్పటి నుండి పిల్లలను క్రమశిక్షణలో పెట్టకపోతే, పెద్దయ్యాక వాళ్లు మన మాటేం వింటారు?" జనాంతికంగా అన్నాడు శ్రీహరి.

"పిల్లల్ని క్రమశిక్షణలో పెట్టడం శ్రీహరిని చూసి నేర్చుకోవాలి ఎవరైనా! వాడు ఎంత అంటే, అంతే ఇంట్లో!! పిల్లలు వాడు గీచిన గీత దాటరు. ఈ కాలంలో కూడా పిల్లలను అలా పెంచుతున్నాడంటే, నిన్ను మెచ్చుకోవాలిరా అబ్బాయ్!" శ్రీహరిని ఉద్దేశించి అన్నాడు రామకృష్ణ.

"మొక్కై వంగనిది మానై వంగునా, అనే సామెత ఉంది కదా మావయ్యా! అందుకని చిన్నప్పటి నుండే క్రమశిక్షణలో పెడితే, వాళ్లు పెద్దయ్యాక వాళ్ల భవిష్యత్తూ బాగుంటుంది. మనకా లేనిపోని తలనొప్పులు తగ్గుతాయి!" బదులిచ్చాడు శ్రీహరి.

"నిజమేరా నువ్వు చెప్పింది. లేకపోతే పెద్దయ్యాక వాళ్లని ప్రేమించాను, వీళ్లను ప్రేమించాను. ఒప్పుకోకపోతే ఛస్తాం, అని

బెదిరిస్తారు తల్లితండ్రులని!" వ్యంగ్యంగా అన్నాడు నరసింహకు మామ వరసైన రామ్మూర్తి. చిన్నప్పటినుండి అనుకున్న ఆయన కూతురిని కాక, ప్రేమించి, ఇంట్లో గొడవపడి మరీ శిరీషను పెళ్లి చేసుకున్నాడని నరసింహ మీద ఆయనకు కోపం. ఆ కోపాన్ని అవకాశం దొరికినప్పుడల్లా ఇలా తీర్చుకుంటాడాయన!

తండ్రి తన మాటకి సమాధానం చెప్పకపోవడం, పైగా వీళ్ళందరూ ఏదో ఒక మాట అంటుండడం, రాజాకు అస్సలు నచ్చలేదు. "ఆ తాతను తిట్టొద్దని చెప్పు డాడీ!" నరసింహ చెయ్యి పట్టుకు లాగుతూ అన్నాడు రాజా.

అందరి ముందు అలా అడిగిన కొడుకుకి సమాధానం ఏం చెప్పాలో తెలియక, "పెద్దవాళ్ల విషయాలు నీకెందుకురా? వెళ్లి ఆడుకో!" విసుక్కుంటూ చెప్పాడు నరసింహ.



"నువ్వెప్పుడూ ఇంతే డాడీ! ఏమీ సరిగ్గా చెప్పవు. అదే మమ్మీ అయితే కరెక్ట్‌గా చెప్తుంది. ఉండు మమ్మీనే అడుగుతాను!" అనుకుంటూ అక్కడనుండి వెళ్ళిపోయాడు రాజా.

"ఏమిట్రా! మీ ఆవిడ ట్రైనింగా?" వేళాకోళం చేశాడు రామ్మూర్తి.

"ఏమిట్రా! ఇంట్లో మా కోడలుపిల్ల మాటేనా ఏమిటి?" అడిగాడు శోభనాద్రి.

"నువ్వు వింటే విన్నావు గాని, పిల్లాడు మాత్రం నీ మాట వినేటట్టు పెంచు!" సలహా ఇచ్చాడు సుబ్రహ్మణ్యం.

"ఆడవాళ్లకు పెత్తనమిస్తే, పేనుకు పెత్తనమిచ్చినట్టే!" రామ్మూర్తి.

"శ్రీహరిని చూడండిరా! ఇంట్లో వాడెంత చెప్తే అంతే! మీరేమనుకుంటే అనుకోండి గాని, ఆడవాళ్ళను, పిల్లలను మన మాట వినేటట్లు కట్టడి చేయాలి. అప్పుడే జీవితం సుఖంగా సాగిపోతుంది!" శ్రీహరిని చూపిస్తూ అన్నాడు నారయ్య బట్టతలను తడుముకుంటూ.

భార్యను, పిల్లలను అదుపులో ఉంచే విషయంలో, చుట్టాలందరూ శ్రీహరితోనే పోల్చుకుంటారు. ఇంట్లో అతని మాటే శిలాశాసనం.

భార్యనే కాదు, పిల్లలనూ క్రమశిక్షణగా పెంచుతాడని అందరూ శ్రీహరిని ముక్తకంఠంతో పొగుడుతుంటారు. ఎప్పుడు చూసినా శ్రీహరి పిల్లలు పుస్తకం పట్టుకునే ఉంటారు. శ్రీహరికి ఇద్దరు పిల్లలు, బాబు కార్తీక్, పాప స్వప్న. స్కూలు, ట్యూషన్, చదువు.... ఇవి తప్పించి వేరే ధ్యాస ఉండదు ఆ పిల్లలిద్దరికీ! ఫస్ట్‌ర్యాంకు రాకపోతే డాడీకి కోపం వస్తుందని, కష్టపడి చదువుతారు. ఆ పిల్లలెప్పుడూ కడిగిన ముత్యాల్లా ఉంటారు. వాళ్ళ ఇల్లు కూడా ముట్టుకుంటే మాసిపోయేటట్టు ఉంటుంది. ఎక్కడి వస్తువు

అక్కడే ఉంటుంది. శ్రీహరి ఇంటికి వచ్చేసరికి ఎక్కడి వస్తువు అక్కడ ఉండకపోయినా, పిల్లలు చదువుతూ ఉండకపోయినా, ఇంట్లో టీవీ మోగుతూ ఉన్నా, శ్రీహరికి చెడ్డ కోపం వస్తుంది. అందుకని ఇంట్లో అందరూ చాలా జాగ్రత్తగా ఉంటారు. శ్రీహరి మాటే శిలాశాసనం ఆ ఇంట్లో. అందుకని క్రమశిక్షణ విషయంలో అందరూ శ్రీహరితోనే పోలిక తెస్తూ ఉంటారు. శ్రీహరిని పొగుడుతూ ఉంటారు అంతా.

నరసింహలాంటి వాళ్ళు తామెందుకు పిల్లలను అలా పెంచలేక పోతున్నామా? అని బాధపడుతూ ఉంటారు. తమ పిల్లలను శ్రీహరి పిల్లలతో పోల్చి, అలా ఉండమని చెబుతూ ఉంటారు.

ఇవన్నీ గుర్తుకొచ్చాయి నరసింహకు. ఏమి చెప్పాలో తెలియక ఒక నవ్వు నవ్వి ఊరుకున్నాడు. మనసులో మాత్రం ఏమి చేస్తే శ్రీహరి పిల్లల్లా, తన కొడుకు తన మాటకు విలువ ఇస్తాడా అని మథన పడుతూ ఉన్నాడు.

పెళ్ళిళ్ళలో, ఫంక్షన్లలో శ్రీహరి పిల్లలు కార్తీక్, స్వప్నలను అందరూ పొగుడుతుంటే, అదే వయసు పిల్లలున్న తనలాంటి తండ్రులు కొందరు, శ్రీహరిని చూస్తే కొద్దిగా అసూయపడుతూ ఉంటారు... తమ పిల్లలను అలాగ పెంచలేక పోతున్నందుకు! శ్రీహరి పిల్లలు ఎప్పుడూ స్కూల్ ఫస్టే. అయినా వారిలో గర్వం ఏ కోశానా కనిపించదు. అందుకే వాళ్లను చూస్తే ముచ్చట అవుతుంది ఎవరికైనా.

★★★

పదవ తరగతి రిజల్ట్స్ వచ్చేసాయి. కార్తీక్ వాళ్ళ స్కూల్ ఫస్ట్. గాని లెక్కల్లో మూడు మార్కులు తక్కువ వచ్చాయని, వాడు స్టేట్ ర్యాంకుల్లో వెనుకబడి పోయాడు. శ్రీహరి చాలా అసంతృప్తి చెందినట్లు తెలిసింది. ఎంత ప్రయత్నించినా స్టేట్ ఫస్ట్‌ర్యాంకు తెచ్చుకోలేక, డాడీ తలదించుకునేటట్లు చేశానని కార్తీక్ చాలా బాధపడ్డాడట.

కార్తీక్ అలా అనుకుంటే, తొంభై ఒక్క శాతం మార్కులు తెచ్చుకున్న తన కొడుకు ఏమనాలి? చుట్టాలలో, స్నేహితులలో చూసుకుంటే తన కొడుకుకే చాలా తక్కువ మార్కులు వచ్చాయి. అందరూ తొంభైఐదు శాతం దాటి మార్కులు తెచ్చుకున్న వాళ్లే. మరి తనేమైపోవాలి? తన కొడుకుకి మార్కులు తక్కువ వస్తే తనకు తలవంపులు కాదా? కాని పొరపాటున ఎప్పుడైనా... "వాళ్లు మంచి ర్యాంకులు తెచ్చుకుంటున్నారు. నువ్వు కొంచెం ప్రయత్నిస్తే మంచి ర్యాంకు, నీకూ వస్తుంది కదా!" అంటే తన భార్య శిరీష ఒప్పుకోదు.

"పిల్లలను ఇంకొకరితో పోల్చకండి. ఇంకొకరితో పోలిస్తే పిల్లలు చిన్నబుచ్చుకుంటారు. అది వాళ్ళ మనసుల మీద తీరని గాయం చేస్తుంది. ర్యాంకులతో వారి తెలివితేటలను తూచకండి. ర్యాంకులు వచ్చిన వాళ్ళే తెలివైనవాళ్లు, రానివాళ్లు తెలివితక్కువ వాళ్ళు, అన్న అపోహను విడిచిపెట్టండి. మన పిల్లలు తెలివైనవాళ్ళు. బుద్ధిమంతులు. జీవితం మీద చక్కని అవగాహన ఉన్న వాళ్ళు. అందుకే భవిష్యత్తులో ఏమవాలన్న నిర్ణయాన్ని వాళ్లకే వదిలిపెట్టండి!" అని తిరిగి తనకే కౌన్సిలింగ్ ఇస్తుంది. నరసింహ ఆలోచనలు సాగిపోతున్నాయి.

"పదిహేనేళ్ల కుర్రవాడు భవిష్యత్తు గురించి నిర్ణయాన్ని తీసుకునేంత పెద్దవాడా?" అంటే, "వాడికి ఇష్టంలేని గ్రూపులో పెట్టి, రేపు వాడు మార్కులు తెచ్చుకోకుంటే బాధపడేది ఎవరు? పాడయ్యేది ఎవరి భవిష్యత్తు?" అని తిరిగి తననే ప్రశ్నిస్తుందామె.

"ఏమిట్రా ఇంట్లో మా కోడలుపిల్ల మాటేనా ఏమిటి?" అన్న శోభనాద్రి మాటలు...

“నువ్వు వింటే విన్నావు గాని, పిల్లాడు మాత్రం నీ మాట వినేటట్టు పెంచు!” అని సలహా ఇచ్చిన సుబ్రహ్మణ్యం మాటలు...

“ఆడవాళ్లకు పెత్తనమిస్తే, పేనుకు పెత్తనమిచ్చినట్టే.” అన్న రామ్మూర్తి మాటలు గుర్తు వచ్చాయి నరసింహకు. వాళ్ల మాటలు విని ఉండవలసింది. వినక పొరపాటు చేశాను అని ఇప్పుడు బాధపడ్డాడు. తనతో సమానంగా చదువుకుందని, ఇంట్లో సమాన హోదా ఇవ్వడం పొరపాటనిపించింది ఇప్పుడు.

“ఆడవాళ్ళను, పిల్లలను మన మాట వినేటట్లు కట్టడి చేయాలి. అప్పుడే జీవితం సుఖంగా సాగిపోతుంది!” అన్న నారయ్య మాటలు ఇప్పుడు నిజమనిపించాయి. కాని ఇప్పుడు చేయడానికి ఏమీ లేదు అంతా తన చేయి దాటిపోయింది, అనుకుంటూ బాధపడ్డాడు నరసింహ.

తను చెప్పినట్లుగా బైపిసి గాని, ఎంపీసీ గాని తీసుకోలేదు తన కొడుకు రాజా. హెచ్.ఈ.సి తీసుకుంటానన్నాడు. దానికి శిరీష వంత పాడుతుంది. “అది తీసుకొని భవిష్యత్తులో ఏమవ్వాలి అనుకుంటున్నావంటే... “డాడీ నేను సివిల్స్ రాయాలనుకుంటున్నాను. దానికి హెచ్.ఈ.సి. అయితేనే మంచిది. చదువుకోవడానికి ఎక్కువ టైం ఉంటుంది!” అని ఎంతో నమ్మకంగా చెప్పాడు. ముచ్చటగా చూసింది శిరీష. వాళ్ళిద్దరినీ చూసి ఒళ్ళు మండిపోయింది నరసింహకు. ‘పదవ తరగతిలో తొంభై ఒక్క శాతం మార్కులు తెచ్చుకున్న వీడికి సివిల్స్! ఆశ పడటానికైనా హద్దు ఉండాలి కదా! రేపు చుట్టాలలో తెలిస్తే నవ్వుకోరా? శిరీష తెలివైనదని పిల్లల బాధ్యత ఆవిడకి వదిలినందుకు, చెప్పుచ్చుకుని తనను తానే కొట్టుకోవాలి!’ మనసులోనే అనుకున్నాడు నరసింహ. బయటకు అంటే శిరీష ఇంకేమంటుందో అన్న భయమేసి, మాట్లాడకుండా బయటకు వెళ్ళిపోయాడు.

శ్రీహరి కొడుకు ఎంపీసీ తీసుకున్నాడట. ఐఐటి కోచింగ్ ఇచ్చే కాలేజీలో జాయిన్ చేశాడట. ఫ్రీ కోచింగ్ అట. అది విన్న నరసింహకు ఎంత వద్దనుకున్నా, పాము పిల్లలా అసూయ ఏమూలో కదిలింది. ఎంత అదృష్టవంతుడో శ్రీహరి, అని మరొక్కసారి అనుకోకుండా ఉండలేకపోయాడు. ఎందుకంటే కార్తీక్‌కి లెక్కల కన్నా, సైన్స్ సబ్జెక్ట్ అంటే చాలా ఇష్టం. అయినా వాళ్ళ నాన్న ఇష్టం ప్రకారం ఎంపీసీ తీసుకున్నాడు. మరో ఆరేళ్లలో, లక్షలు సంపాదించే ఉద్యోగంలో చేరతాడు. మరి తన కొడుకో? ఎందుకూ పనికిరాని డిగ్రీ చేసి, ఉద్యోగాల కోసం ఆశగా ఎదురు చూస్తుంటాడు. దేనికైనా పెట్టి పుట్టి ఉండాలి మరి! నిరాశగా అనుకున్నాడు నరసింహ.

‘బాగా చదువుకోండి, ర్యాంకులు తెచ్చుకోండి,’ అని చెప్పకుండా మ్యూజిక్ క్లాసులని, డ్రాయింగ్ క్లాసులని, స్పోర్ట్స్ క్లాసులని తెగ తిప్పుతుంది శిరీష పిల్లలనిద్దరినీ. “అవేమైనా ఉద్యోగాలనిస్తాయా?” అంటే “వీటిద్వారా పిల్లల వ్యక్తిత్వం వికసిస్తుంది!” అని పిల్లలు తెచ్చిన కప్పులు చూసి, మురిసిపోతూ ఉంటుంది.

‘నీ పిల్లలు ఏం చేస్తున్నారురా నరసింహా?’ అని ఓ ఐదారేళ్లు పోయాక ఎవరైనా అడిగితే, ఈ కప్పులే చూపించుకోవాలేమో! నిట్టూర్చాడు నరసింహ.

‘రాజాని ఎంపీసీ తీసుకొని ఇంజనీరింగ్ సైడ్ వెళ్లమంటే... ‘మరీ ఐఐటీలు కాకపోయినా, కష్టపడి చదివితే ఏ నిట్ లోనో సీటు రావచ్చు కదా అన్న చిన్న ఆశ.’

“డాడీ! నాకు ఇంజనీరింగ్ సైడ్ ఇష్టం లేదు. ఇంజనీరింగ్‌కు ఇప్పుడు పెద్ద వేల్యూ లేదు. నేను సివిల్స్ ట్రై చేద్దామనుకుంటున్నానని మీకు చెప్పాను కదా! అర్థం చేసుకోండి డాడీ” అని తిరిగి సమాధానం చెప్పాడు.

"అది కాదురా! సివిల్స్‌కే వెళ్దువు గాని ముందు ఎంపీసీ తీసుకుని, ఆ తర్వాత ఇంజనీరింగ్ డిగ్రీ కంప్లీట్ చేసుకుంటే, సివిల్స్ రాకపోతే కనీసం ఇంజినీరింగ్ డిగ్రీతోనైనా ఏదైనా జాబ్ వస్తుంది. బ్యాకప్ ఏమీ లేకుండా, ఒక్క సివిల్స్ అనుకుంటే కష్టంరా!" అని ఎంత వివరంగా చెప్పినా ససేమిరా అన్నాడు రాజా.

"పిల్లలు మన మాట వినేటట్టు చేయడమే క్రమశిక్షణ!" శ్రీహరి మాటలు నరసింహకిప్పుడు అర్థమయ్యాయి. మన మాట పిల్లలు వినకుంటే, భవిష్యత్తులో వాళ్లతో పాటు మనమూ బాధపడాల్సి వస్తుంది. రాజా భవిష్యత్ గురించి తనకు ఇప్పటి నుండే బెంగ మొదలైంది.

"పిల్లలు బంకమట్టిలాంటి వాళ్ళు. కష్టపడితే ఎలా కావాలనుకుంటే అలా వాళ్ళను మలచవచ్చు. చిన్నప్పటి నుండే పిల్లలను మన మార్గంలోకి తెచ్చుకోవాలి. మనమాట వినేటట్టు చేసుకోవాలి. అదే క్రమశిక్షణంటే" అనేవాడు శ్రీహరి. వాడి మాటలు ఇప్పుడు తనకు అర్థమవుతున్నాయి. వాడు పిల్లలను క్రమశిక్షణలో పెట్టుకొని, వారికి ఏది మంచిదో అది వాళ్లకు ఇస్తున్నాడు. కార్తీక్‌కు, బైపిసి ఇష్టం కదా, ఎంపీసీలో ఎందుకు జాయిన్ చేస్తున్నావంటే, వాడు అన్న మాటలు గుర్తుకు వచ్చాయి తనకు. "వాడికి మ్యాథ్స్ కన్నా, సైన్స్ అంటే ఇష్టం అని నాకు తెలుసు. గాని మెడికల్ ఫీల్డ్‌లో జీవితాంతం చదవాలి. ప్రాక్టీసు కోసం ఇరవైనాలుగు గంటలు కష్టపడాలి. భవిష్యత్తులో వాడంత కష్టపడటం నాకు ఇష్టం లేదురా! వాడి తెలివితేటలకు వాడు ఏ ఐఐటి లోనైనా సీటు సంపాదించుకోగలడు. ఆ తర్వాత మంచి జాబ్ తెచ్చుకోగలడు. నాకా నమ్మకముంది" అని ధైర్యంగా చెప్పగలిగాడు. మరి తానో! నీ భవిష్యత్తుకు ఇది మంచిదని ఎంత చెప్పినా, కొడుకుని ఒప్పించ లేకపోతున్నాడు. వాడి పెంపకానికి, తన పెంపకానికి ఎంత తేడా?

★★★

చూస్తుండగానే రెండేళ్ళు గడిచిపోయాయి. కార్తీక్‌కు ఐఐటీలో మంచి సీటే వచ్చింది. గాని టాప్ ఫైవ్ ఐఐటీలలో, ముందునుండి అనుకుంటున్న కంప్యూటర్స్‌లో సీటు రాలేదని శ్రీహరి అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది.

ఏదో ఒక ఐఐటీలో, ఏదో ఒక బ్రాంచిలో కార్తీక్‌ని జాయిన్ చెయ్యాలా? లేకపోతే మరలా లాంగ్‌టర్మ్ కోచింగ్‌లో కార్తీక్‌ని జాయిన్ చెయ్యాలా? అని, శ్రీహరి ఆలోచిస్తున్నాడని తెలిసింది.

వెంటనే ఫోన్ చేశాను."చెప్పు, ఏమిటి విషయం?" నీరసంగా అన్నాడు శ్రీహరి.

ముందు వాడికి, కార్తీక్‌కి అభినందనలు చెప్పి, "ర్యాంకు 302 తెచ్చుకున్నాడంటే చాలా తెలివైనవాడు కింద లెక్క. మరలా వాడికి లాంగ్‌టర్మ్ కోచింగ్ ఎందుకురా? టాప్ ఫైవ్‌లో కాకపోతే, ఆ నెక్స్ట్ దాన్లో జాయిన్ చెయ్యి చక్కగా. ఐ.ఐ.టి అన్న బ్రాండ్ ముఖ్యం గాని, ఏ ఐఐటీ అయితే ఏమిటి?" అన్నాను.

"అది కాదురా! వాడంత తెలివైనవాడు, ఏదో ఒక ఐఐటీలో జాయిన్ అవ్వడం ఎందుకా అని ఆలోచిస్తున్నాను. అంతే. ఏదైనా తుది నిర్ణయం వాడిదే. జాయిన్ అవ్వాలా? మరల లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకోవాలా? అని వాడి నిర్ణయాన్ని బట్టే ఉంటుంది!" అన్నాడు.

"వాడికి ఏది మంచో, ఎప్పుడూ నువ్వే నిర్ణయిస్తావు కదా! ఈసారి కూడా నువ్వే నిర్ణయం తీసుకొని మంచి ఐఐటీలో జాయిన్ చెయ్యి!" అని తన సలహా చెప్పాడు, నరసింహ.

ఆ తర్వాత తెలిసింది... కార్తీక్ మరల లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాడని. ఎందుకనో "అయ్యో పాపం" అనిపించింది.

★★★

మరొక సంవత్సరం గిర్రున తిరిగింది. ఐఐటి రిజల్ట్స్ వచ్చేసాయి. ఏ ర్యాంకు వచ్చిందో కార్తీక్‌కు అనుకుంటుండగానే, పిడుగులాంటి వార్త చెవిన పడింది. నిలువునా కుప్పకూలిపోయాడు నరసింహ. తనకే ఇలా ఉంటే శ్రీహరి ఏమవుతాడో అనిపించింది. దొరికిన ఫ్లైట్ బుక్ చేసుకొని శ్రీహరి దగ్గరకు వెళ్లాడు.

మనిషిలో కళాకాంతులు లేవు. ఒక్కసారే పదేళ్లు వయసుమీద పడ్డట్టు అయిపోయాడు. నరసింహను పట్టుకొని భోరుమన్నాడు.

"ఆ రోజు నీ మాట వినవలసిందిరా! చేజేతులా నేనే చేశానీ పని. నిర్ణయం నన్నే తీసుకొని, వాడిని ఏదో ఒక ఐఐటీలో జాయిన్ చెయ్యమన్నావు. క్రమశిక్షణ, క్రమశిక్షణ అంటూ నా అభిప్రాయాలు వాళ్లమీద రుద్దానే గాని, వాళ్ళ అభిప్రాయం ఏమిటో ఎప్పుడూ తెలుసుకోవడానికి ప్రయత్నించలేదు. చూడరా, ఈ డైరీలు చూడు. వాడు ఏం రాసుకున్నాడో తెలుసా! 'నాకు డాక్టర్ అవ్వాలని ఉంది. గానీ నేను డాక్టరై భవిష్యత్తులో ఎక్కువ కష్టపడటం ఇష్టంలేదు డాడీకి. డాడీ నా గురించి ఇంతగా ఆలోచించినప్పుడు, డాడీ కోరిక ప్రకారం ఎంపీసీలో జాయిన్ అయి ఐఐటీలో మంచి సీటు తెచ్చుకుంటాను!" అంటూ వ్రాసుకున్నాడురా నా చిట్టితండ్రి. వాళ్లకి ఏది ఇష్టమో, ఏది కాదో తెలుసుకోవడానికి నేను ఏనాడూ ప్రయత్నించలేదు. వాళ్ళు నా మాట వింటున్నారనుకున్నాను గాని, నా కోరిక తీర్చడానికి వాడు జీవితాన్నే బలి చేసుకుంటున్నాడని తెలుసుకోలేక పోయాను. చేజేతులా నేనే, వాడిని చంపుకున్నాను. చదవరా ఇది. నాలుగు వాక్యాలలో, జీవితాంతం నాకు సరిపడే శిక్ష వేశాడు. నాకిలా జరగాల్సిందే" అంటూ నరసింహ చేతిలో ఒక ఉత్తరం పెట్టాడు.

ఉత్తరం మడతలు విప్పాను గాని, కన్నీళ్ళతో మసకైన నా కంటికి, అక్షరాలేవీ కనిపించడం లేదు.

"డాడీ! నన్ను క్షమించండి. మీరు తలదించుకునేలా చేశాను. ఈసారి వందలోపు ర్యాంకు తెచ్చుకొని మీ కళ్ళల్లో వెలుగు చూద్దామనుకున్నాను. కష్టపడే చదివాను. కాని, అనుకున్నట్లు చేయలేకపోయాను. క్షమించండి. మీ కార్తీక్."

ఈ నాలుగు వాక్యాలు చదవడానికి నరసింహకు చాలాసేపు పట్టింది. చదివాక గుండె పట్టేసినట్టయింది. దుఃఖం ఆపుకోవడం అతని వశం కాలేదు.

"క్రమశిక్షణ అంటే మనం చెప్పినదానికి గంగిరెద్దులా తలూపడం కాదండి. మనం చెప్పినది మనస్ఫూర్తిగా నిజమని నమ్మి దానిని ఆచరించడం. ఒకవేళ మనం చెప్పినది వాళ్ళకు నచ్చకపోతే, వాళ్ళ అభిప్రాయాలను మనతో నిర్భయంగా పంచుకోవడం, మనతో దానిని గురించి డిస్కస్ చెయ్యడం. అంతేగాని నా కొడుకు నేను గీచిన గీత దాటడు అని చెప్పుకోవడం మాత్రం కాదండి క్రమశిక్షణంటే. ఒక విషయం మీద, అందరూ కూర్చుని మాట్లాడుకుని, ఏది మంచిదో! ఏది కాదో! నిర్ణయించుకోవడం. అంతేగాని, చిన్నపిల్లలు మీకేమి తెలుసు? పెద్ద వాళ్ళం మేము. అనుభవంతో చెప్తున్నాం. మీరు వినండి, అని మన అభిప్రాయాలను వాళ్ల మీద రుద్దటం కాదండీ క్రమశిక్షణంటే. తప్పు, ఒప్పులు రెండూ చెప్పి, విజ్ఞతగా పిల్లలు నిర్ణయాలు తీసుకునేటట్లు ప్రోత్సహించడం నిజమైన క్రమశిక్షణ" అన్న భార్య మాటలు జ్ఞాపకమొస్తున్నాయి నరసింహకు.

# సర్దుబాటు


మాధవి బైటారు దేవి తనయ



✆ 974 33952728


*మిమ్మల్ని మనసు్సు చంపుకుని బ్రతకమని చెప్పడం లేదు. మీరిద్దరూ విద్యాధికులు. సమస్యని ఎలా తగ్గించుకోవాలో ఆలోచించండి. సమస్యల తీవ్రతని క్రమేణా తగ్గించుకోండి. వయస్సులో ఉన్నప్పుడు అంతా బాగానే ఉంటుంది. కొన్నేళ్ళకి రెక్కలు వచ్చిన పక్షులు... అదే మీ పిల్లలు ఎగిరిపోతే, భార్యాభర్తలైన మీ ఇద్దరే మిగిలిపోతారు! మీరెప్పటికీ కలిసి ఉండాలనే ఇవన్నీ చెప్పాము. ఇక మీ ఇష్టం.*

"జీవన్, బస్సు వచ్చే సమయం అయిపోతోంది. ఈ చపాతీలు పిల్లల బాక్స్‌లో పెట్టవా... వీలయితే మనిద్దరికి కూడా సర్దేయి! ఈలోగా నేను వీళ్ళకి స్నానం చేయించి తీసుకువస్తాను!" అంది తరుణి, లేవగానే చరవాణిలో స్నేహితులు పంపిన సందేశాలు చూసుకుంటున్న జీవన్‌తో.

అతను విన్నాడో, లేదో చూసుకోకుండా ఇద్దరు పిల్లల్ని హడావుడిగా స్నానాలగదిలోకి లాక్కెళ్ళింది. అలా లేచి లేవగానే చరవాణిలో సందేశాలు, అందులోనూ కొన్ని వ్యతిరేక, ఆవేశం రగిల్చే సందేశాలు చూడటం వలన వాటి ప్రభావం రోజంతా పడుతుందని తెలిసినా మానలేని బలహీనత అతనిది.

కాసేపయ్యాక పిల్లలకి స్నానం చేసి తీసుకువచ్చేసరికి, ఇంకా అక్కడే సోఫాలో ఉన్న జీవన్ని చూడగానే అర్థమైంది... చపాతీలను బాక్స్‌లో సర్దలేదని! వెంటనే చిర్రెత్తుకొచ్చింది ఆమెకి.

"పెట్టమని చెప్పాను కదా. అలా నీపాటికి నువ్వు ఖాళీగా కూర్చుంటే ఎలా... పెట్టేస్తే నీ సొమ్మేం పోతుంది. అయినా ఈరోజు పదోన్నతి కోసం నాకు ఇంటర్వ్యూ అవ్వబోతోందని తెలుసు కదా! అందుకే నేను గంట ముందు ఆఫీసులో ఉండాలి! అసలే వీళ్ళు ఈరోజు ఆలస్యంగా లేచారు. వీళ్ళని బడికి పంపి, నేనెప్పుడు ఆఫీసుకి వెళ్లగలను?" అని గట్టిగా అరిచేసింది తరుణి... ఎక్కడ తను ఆఫీసుకి చేరుకోవడం ఆలస్యం అయిపోతుందోననే భయంతో!

"అబ్బా తరుణి... పొద్దున్నే లేవగానే ఏంటి ఈ గోల. ఓ పది నిముషాలు ప్రశాంతంగా కూర్చోనివ్వవు!" అని తిరిగి అరిచాడు జీవన్.

"అవున్లే, నీకు గోలగానే ఉంటుంది. పొద్దుటినుండి ఒక్కదాన్నే అన్ని పనులు చేసుకోవడం ఎంత కష్టమో తెలుసా నీకు?" అనగానే...

"అయితే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేయ్. అంతలా పనులు చెయ్యలేనిదానివి ఉద్యోగం పట్టుకు వేళ్ళాడ్డం ఎందుకు ... ఇంట్లో కూర్చోక!" విసురుగా అన్నాడు.

"అంటే ఇంట్లో పనులు చెయ్యడానికి, పిల్లల్ని చూసుకోవడానికి ఇన్నాళ్ళు కష్టపడి సాధించిన ఉద్యోగానికి నేను రాజీనామా చేసేయాలా? అంతేకాని... పిల్లల బాధ్యత మాత్రం కొంచెమైనా తీసుకోనంటావు. కానీ ఏ మాత్రం సమయం ఉన్నా స్నేహితులు, పార్టీలంటూ మాత్రం తిరుగుతావు!" అని నిష్టూరమాడేసరికి...

"ప్రతిరోజూ వెధవ సంత!" అని కోపంగా తలుపు వేసి బయటికి వెళ్లిపోయాడు.

తల్లితండ్రుల మాటల్ని, అరుపుల్ని వింటున్న పిల్లలు బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు.

'అసలు ఈ ఉద్యోగం కోసం ఎంత వేచి చూసింది. ఇప్పుడు పదోన్నతికి కూడా దగ్గరలో ఉంది. అలాంటిది బంగారంలాంటి ఉద్యోగం మానేయ్యాలట' అని ఉక్రోషంగా ముక్కు ఎగబీల్చి పిల్లలిద్దరిని తయారుచేసి బస్సెక్కించి, తను కాస్త ఎంగిలి పడి ఆఫీసుకి వెళ్లింది.



వెళ్లిందన్నమాటే గాని మనస్సు ప్రశాంతంగా లేదు. జీవన్ అన్న మాటలే గుర్తు వస్తున్నాయి. ఇంతలో మొబైల్ మోగింది. "హలో" అనగానే, "మేడమ్! మీతో మాట్లాడాలి. రేపు మీ భార్యాభర్తలిద్దరూ బడికి రాగలరా?" అని ఫోన్లో అడిగిన ఉపాధ్యాయురాలు లహరితో సరేనని చెప్పి, మర్నాడు సాయంత్రం ఆమెను కలిశారు తరుణి, జీవన్‌లు.

"కూర్చోండి" అని కుర్చీలు చూపిస్తూ "ఈమధ్య మీ అబ్బాయిలో ఏదో తేడా కనిపిస్తోంది. ఎప్పుడూ ముభావంగా ఉంటున్నాడు. అప్పుడప్పుడు కారణం లేకుండానే ఏడుస్తున్నాడు. పక్కవాళ్ళని కొడుతున్నాడు కూడా! ఎంతో హుషారుగా ఉండే, మా అందరి ఉపాధ్యాయులకి ఇష్టమైన విద్యార్థి ఇలా మారిపోతుండటం చూసి బాధేసి మీతో మాట్లాడటానికి రమ్మన్నాను!" అంది లహరి.

"మేము మాట్లాడి కనుక్కుంటాం!" అని ఉపాధ్యాయురాలికి కృతజ్ఞతలు చెప్పి పిల్లలు సంహిత, సాకేత్ లను తీసుకుని ఇంటికి బయలుదేరారు.

ఈమధ్య సాకేత్ నిద్రలో ఉలిక్కిపడి లేచి "అమ్మా! నన్ను వదలొద్దు" అని తరుణిని గట్టిగా పట్టుకుంటున్నాడు. పక్క కూడా తడుపుతున్నాడు. సంహిత కూడా చలాకీగా తిరగకుండా ఆందోళనగా కనిపిస్తుంది.

తరుణి, జీవన్‌ల మధ్య ఈమధ్య కీచులాటలు పెరిగాయి. రోజూ గొడవలు పడే బదులు విడిపోయి హాయిగా బ్రతకొచ్చనుకుంటున్నారు. పసిమనస్సులకి విషయం అర్థం కాక, అమ్మా నాన్న ఎందుకిలా ప్రవర్తిస్తున్నారో తెలియక, బిక్కమొహం వేస్తున్నారు.

ఒకరోజు రాత్రి తరుణికీ వాళ్ళ నాన్నమ్మ వర్ధనమ్మ నుండి ఫోన్ వచ్చింది.

"అమ్మా తరుణీ, నువ్వు, జీవన్, పిల్లలు అందరూ కలిసి సంక్రాంతికి రండి" అని ఆప్యాయంగా ఆహ్వానించింది. నాన్నమ్మ పిలుపు వినగానే ఎంతో ఆనందంగా, "సరే, నానమ్మా!" అంటూ, "ఇదుగో జీవన్‌కి కూడా చెప్పు!" అని జీవన్‌కి ఫోన్ ఇచ్చింది.

"నమస్కారం బామ్మగారు" అంటూ వర్ధనమ్మ చెప్పింది విని, "తప్పకుండా వస్తాం!" అని చెప్పాడు జీవన్.

తరుణికి తమ చిన్నపుడు నాన్నమ్మ గారింట్లో ప్రతి పండగకి ఎంతో సరదాగా గడిపిన రోజులు గుర్తుకువచ్చాయి.

ఇప్పుడున్న ఒత్తిడుల మధ్య కాస్త ఉపశమనంగా ఉంటుందని ఆనందించింది.

పిల్లలతో, "మనం పండగకి రావులపాలెం వెళ్తున్నాం. సరేనా?" అని నవ్వుతూ అనగానే, "హుర్రే! అక్కడయితే ఎంచక్కా ఆడుకోవచ్చు!" అన్నారిద్దరూ ఉత్సాహంగా.

భోగి ముందురోజు సాంత్రో కారులో నలుగురు బయలుదేరారు. తరుణి వాళ్ళ అమ్మా, నాన్న, పెదనాన్న, పెద్దమ్మ విజయవాడలో ఉంటారు. వాళ్ళు అప్పటికే నాన్నమ్మ ఇంటికి చేరుకున్నామని ఫోన్ చేశారు.

ప్రకృతి అందాలకి పెట్టిన పేరైన గోదావరి జిల్లాల్లో ఆ గ్రామానికి చేరుకోగానే, పచ్చటి పొలాలు, అందమైన రంగవల్లికలు, గొబ్బెమ్మలతో ఊరంతా ఎంతో అందంగా ఉంది. సంక్రాంతి హడావుడితో మరింత బాగుంది. ఆ ఊరిని చూడగానే పిల్లల ముఖాలు వికసించాయి. బాబాయి కుటుంబం మాత్రం తాతయ్య, నానమ్మలతో కలిసి ఉంటుంది. అమ్మ, నాన్న, మామయ్యలు, అత్తయ్యలు, పెద్దమ్మ, పెద్దనాన్న, పిల్లలతో ఇల్లంతా చాలా సందడిగా ఉంది.

భోగి మంటలు, గాలిపటాలు ఎగరేయడం, కోడి పందేలు చూడటంతో నాలుగు రోజులు ఆనందంగా గడిచిపోయాయి. వర్ధనమ్మ చేతి వంటల్ని పిల్లలు, పెద్దలు "ఎంత బాగున్నాయో" అంటూ లొట్టలు వేసుకుని తిన్నారు.

"అమ్మా, మీ అల్లుడుగారికి మైసూరుపాక్, బాదుషా అంటే ఇష్టం. అవి కూడా చేయించవా... మా ఇంటికి తీసుకువెళ్తాను!" అని గారాలు పోయింది వర్ధనమ్మ చిన్న కూతురు.

"మీరు చేసిన కోడికూర ఉంటే, మీ కొడుకు కంచం మొత్తం ఖాళీ చేసేస్తారు. అత్తయ్యగారు..." అంది నవ్వుతూ పెద్దనాన్న భార్య రమణి.

ఇలా ఎవరికి వారు తమ భర్తలకు నచ్చిన వంటలు చేయించుకోడానికి తాపత్రయపడుతూ, భోజనాల దగ్గర కొసరి కొసరి వడ్డిస్తున్నారు. అవన్నీ గమనిస్తున్న తరుణికి తానెందుకు అలా జీవన్‌తో ఉండలేకపోతోందని బాధగా అనిపించేది. జీవన్‌కి కూడా అక్కడున్న జంటల్లాగ తామెందుకు అన్యోన్యంగా ఉండలేకపోతున్నామా... అని దిగులుగా ఉంది.

పండగ అంతా అయ్యాక ఎవరింటికి వాళ్ళు బయలుదేరుతుంటే సాకేత్ మాత్రం, "ఇంటికి వెళ్తే అమ్మ నాన్న మళ్ళీ గొడవలు పడతారు. ఎంచక్కా ఇక్కడే బాగుంది. నేనింటికి రాను!" అంటూ ఏడుపు మొదలుపెట్టాడు. "ఇక్కడైతే మమ్మల్నెవరూ తిట్టడం లేదు. పైగా ఆడుకోవచ్చు హాయిగా!" అని సంహిత కూడా ససేమిరా వెళ్లనంది.

ఇంటికి వెళ్ళమని మొరాయిస్తున్న పిల్లల దగ్గరికి తాతయ్య వచ్చి "తర్వాత వెళుదురులే పిల్లలు... తొందరేం లేదు. ఇక్కడి కొత్త స్నేహితులతో ఆడుకోండి." అని సముదాయించి బయటికి పంపారు.

తరుణి, జీవన్‌లను పక్కకి పిలిచి కాసేపు మాట్లాడాలని కూర్చొబెట్టారు "మీరు విడాకులు గురించి ఆలోచిస్తున్నారని మీ నాన్న చెప్తే మీతో మాట్లాడాలని పండగ పేరుతో పిలిచాము తరుణీ. మీ తల్లిదండ్రుల మాట కూడా వినకుండా మొండితనంతో ఉన్నారని, అందుకే మమ్మల్ని మాట్లాడమని చెప్పారు. అసలు ఏమయ్యిందమ్మా?" ప్రశ్నించారు తాతయ్య, నాన్నమ్మ.

వెంటనే ముఖాముఖాలు చూసుకున్నారు తరుణి, జీవన్‌లు. విషయం వీళ్ల వరకు వచ్చిందన్నమాట అని అనుకుని... వెంటనే తరుణి, “తాతయ్యా! ఈయన  సంగతి తెలుసా... ఆఫీస్ నుండి వచ్చిన తర్వాత లాప్‌టాప్, మొబైల్ వదలరు. వెళ్ళేముందు కూడా చూస్తుంటారు. ఇంటిపనిలో సాయం చేయరు. కనీసం బడికి వెళ్ళేటప్పుడు కానీ, చదువులో కానీ పిల్లల్ని పట్టించుకోరు. ఆఫీస్ పని, ఇంటిపనితో పాటు, పిల్లల చదువులు నేనే చూసుకోవాలి. కూరలు, వెచ్చాలు నేనే తెచ్చుకోవాలి. పైగా ఉద్యోగం మానేసి ఇంటిపట్టునే ఉండాలట! నా అభిప్రాయాలను గౌరవించరు. ఏ విషయంలోనూ ప్రోత్సహించరు! ఇన్ని సమస్యలున్నప్పుడు విడిపోతే తప్పేమిటి?” అని ఆవేశంగా ప్రశ్నించింది.

“చూసారా, తాతయ్యగారూ! ఇలాగే ప్రతీదానికీ అరుస్తుంది. ఏవైనా కాస్త ఎక్కువ తెచ్చేస్తే, ఎందుకు ఎక్కువ తెచ్చారు అంటుంది. లేకపోతే తేలేదంటుంది. ఏదో ఒక విషయానికి గొడవలు పెట్టుకుంటుంది. ఇంట్లో అస్సలు మనశ్శాంతి ఉండదు! అలిసిపోయి వచ్చి కాసేపు టీవీ, మొబైల్ చూస్తే పెద్ద రాద్ధాంతమే చేస్తుంది. పైగా అన్నీ తనకే తెలుసు, నాకేం తెలియదన్న అహంకారం కూడా...” అంటూ ఫిర్యాదు చేసాడు జీవన్.

“సంపాదించిందంతా ప్రతీ పైసా లెక్క చెప్పమంటారు. కానీ తను మాత్రం చెప్పరట!” అని తరుణి అనేసరికి, “ప్రతీది తనకి చెప్పడమెందుకు. డబ్బులు ఎలాగూ దాస్తున్నాను. అవసరం వచ్చినప్పుడు చెప్దామనుకున్నాను!” అని సమర్థించుకున్నాడు జీవన్.

వాళ్ళ మాటల్ని తాతయ్య, నాన్నమ్మ శ్రద్ధగా వింటున్నారు.

“ఇలాంటి చిన్నచిన్న కారణాలకే విడాకుల వరకు ఆలోచిస్తున్నారంటే ఆశ్చర్యమేస్తోంది.”

“జీవితం అంటేనే సర్దుబాటు. నా వాళ్లే కదా అని కొద్దిగా సర్దుకుంటే చివరికి దక్కేది ఆనందమేగా!” అంది వర్ధనమ్మ.

“ఆ... నువ్వు ఎన్నైనా చెప్తావు నాన్నమ్మా! ఒక్కసారి నా స్థానంలో ఉండి ఆలోచించు... అప్పుడు తెలుస్తుంది!” అని రుసరుసలాడుతున్న తరుణితో, “ఎప్పటి సమస్యలు అప్పుడే ఉంటాయి మనవరాలా... మీ తాతయ్య ఏమైనా తక్కువ తిన్నారనుకున్నావా? నేను కూడా పెళ్ళయిన కొత్తలో ఇబ్బందులు పడ్డాను. ఓపికతో అన్నీ భరించి ఇంతవరకు లాక్కొచ్చాను. ఈరోజు ఇంత పెద్ద కుటుంబాన్ని చూసుకుంటుంటే గర్వంగా ఉంటుంది!” అంటూ “అయినా నాకు తెలియక అడుగుతున్నాను కాని, ప్రపంచంలో అంతెందుకు భారతదేశంలో ఏ ఇంట్లోనయినా భార్యాభర్తలన్నాక గొడవలు రాకుండా ఉంటాయా? కలిసి కాపురాలు చెయ్యడం మానేస్తున్నారా? పోనీ ఏ ఒక్కరైనా లోపాలు లేకుండా వందశాతం పరిపూర్ణంగా ఉన్నారా?” అని ప్రశ్నించింది వర్ధనమ్మ.

“అది కాదు బామ్మ గారు! నా స్నేహితుడు రెండేళ్ల కిందట విడాకులు తీసుకున్నాడు. కొడుకు తన దగ్గర, కూతురు వాళ్ళావిడ దగ్గర ఆనందంగానే ఉంటున్నారు!” అన్నాడు జీవన్ తమ ఆలోచనే సరైనదని చెప్పడానికి ఉదాహరణలు చెబుతూ.

“ఎక్కడో అలా అయ్యుండొచ్చు జీవన్, మీ బాల్యం మీ తల్లితండ్రులతో ఎంత సంతోషంగా సాగిందో ముందు గుర్తు తెచ్చుకోండి. వాళ్లకి కూడా ఇలాంటి ఆలోచనలే వచ్చి ఉంటే మీరెంత అల్లాడిపోయేవారో ఆలోచించండి!” అన్నారు నాన్నమ్మ.

“పైగా ఇలాంటి అననుకూల పరిణామాలు పిల్లల ఎదుగుదలపై ఖచ్చితంగా ప్రభావం చూపిస్తాయి. ఇప్పటికే మీ పిల్లలలో వ్యతిరేక లక్షణాలు కనిపిస్తున్నాయి. అసలు పిల్లలు తల్లీ తండ్రి ఇద్దరి ప్రేమను కోరుకుంటారు. ఏ ఒక్కరి ప్రేమో సరిపోదు కదా.

మీకు మీ బాల్యం ఎంతటి తీపి జ్ఞాపకమో, వాళ్ళకు అలాగే మధురమైన జ్ఞాపకంగా ఇవ్వండి!” అని అనునయంగా అన్నారు తాతయ్య.

“పిల్లల కోసమనే ఇంకా ఆలోచిస్తున్నాను లేకపోతే ఎప్పుడో విడిపోయుందును. అయినా ఈ రోజుల్లో ఇవన్నీ మామూలే తాతయ్యా!” అంది తరుణి.

“అవును, నేనూ వింటున్నాను. వివాహం అంటే ఇద్దరు మనుషులు, మనసులు కలిసి ఉండటానికి. అంతేకాని విడిపోవడానికి కాదు. ఎవరో అలా చేసారని మనం అనుసరించకూడదు కదా. నిన్ను శారీరకంగా, మానసికంగా జీవన్ ఇబ్బందులు పెడుతున్నాడంటే, మేమే విడాకులు ఇప్పించేవాళ్ళం. మీరిప్పుడు విడిపోయి కొన్నాళ్ళకి మళ్ళీ వేరే పెళ్లిళ్లు చేసుకున్నారనుకుందాం. మరి వచ్చేవాళ్లలో లోపాలు ఉండవా? గొడవలు రావా? అప్పుడు సర్దుకోడానికి ప్రయత్నించరా?” అని ప్రశ్నించారు తాతయ్య.

“పురుగు పడితే కొమ్మని కత్తిరిస్తాం, కానీ చెట్టునే కొట్టేయం కదా! భాగస్వామి పట్ల గాఢమైన ప్రేమని పెంచుకుంటే పెద్ద లోపాలైనా చిన్నవిగా కనిపిస్తాయి. ఒకరి పనుల్లో ఒకరు సహకరించుకుంటూ మాటల్లో, చేతల్లో ప్రేమని వ్యక్తం చేసుకోండి. చిన్న చిన్న బహుమతులు ఇచ్చుకోండి. ఒకరి భావాలను ఇంకొకరు అర్థం చేసుకోండి!” అని ఇద్దరికీ వివరించారు తాతయ్య.

“అలాగే మనం ఇంట్లోవాళ్ళే కదా అని తేలికగా తీసుకుంటాం కానీ, వాళ్ళకే ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి! వాళ్ళ తర్వాతే మిగతా ఏదైనా...” అని జీవన్‌కి అర్థమయ్యేలా చెప్పి... “ఇకపై ఏ విషయానికైనా అరవకుండా, నీ మనస్సులోని మాటలను ప్రశాంతంగా, సున్నితంగా చెప్పడానికి ప్రయత్నించు తరుణీ, కోపం వస్తే తగ్గించుకోడానికి ప్రయత్నించు! తన కోపమే తన శత్రువు అని తెలుసు కదా!” అని వర్ధనమ్మ అంది.

“సరే! జీవన్, తరుణీ... మిమ్మల్ని మనస్సు చంపుకుని బ్రతకమని చెప్పడం లేదు. మీరిద్దరూ విద్యాధికులు. సమస్యని ఎలా తగ్గించుకోవాలో ఆలోచించండి. సమస్యల తీవ్రతని క్రమేణా తగ్గించుకోండి. వయస్సులో ఉన్నప్పుడు అంతా బాగానే ఉంటుంది. కొన్నేళ్ళకి రెక్కలు వచ్చిన పక్షులు... అదే మీ పిల్లలు ఎగిరిపోతే, భార్యాభర్తలైన మీ ఇద్దరే మిగిలిపోతారు! మీరెప్పటికీ కలిసి ఉండాలనే ఇవన్నీ చెప్పాము. ఇక మీ ఇష్టం. కానీ ఒకటి మాత్రం గుర్తు పెట్టుకోండి, పిల్లలకి మీ ఇద్దరూ కావాలని. కొన్నాళ్ళు మేము చెప్పిన విషయాలు పాటించండి. అప్పటికి అవ్వకపోతే చూద్దాం!” అన్నారు పెద్దవాళ్ళిద్దరూ.

అన్నీ విన్న తరుణి, జీవన్‌లు, “విడిపోతే కలిగే లాభాలు గురించి చాలా మంది చెప్పారు కానీ ఎలా కలిసుండాలో మాత్రం ఎవ్వరు చెప్పలేదు. ఇకపై తప్పకుండా మారడానికి ప్రయత్నిస్తాం!” అని అంగీకారంగా ఏకకంఠంతో అన్నారు.

“నన్ను క్షమించు, జీవన్” అని తరుణి అనగానే, “నిన్ను చాలా బాధ పెట్టాను. ఇకపై నీకు తోడునీడగా ఉంటాను. ప్రామిస్” అన్నాడు జీవన్.

ఆ తర్వాత వర్ధనమ్మ “సాధనమున పనులు సమకూరు ధరలోన....” అంటూ మనవరాలి చెవిలో ఏదో చెప్పేసరికి విషయం అర్థమైన తరుణి, “ప్రయత్నిస్తాను!” అంటూ సిగ్గుపడింది.

# చెమర్చిన సముద్రం

వి. రాజారామ్మోహన రావు



✆ 9394738805

**విశిష్ట అతిథి కథ**

ఆ ఫోన్‌కాల్ వచ్చిందగ్గర్నించీ మనసు అదోలా ఉంది. ఆశనిరాశల కలగలుపులా ఉంది!

కాస్టింగ్ కోచ్ సుబ్బారావు ఫోన్ విషయం ఏమిటంటే మణికొండలో కొత్త ప్రొడక్షన్ ఆఫీసు తెరిచారు. సినిమా మరీ పెద్దదీ కాదు... చిన్నదీ కాదు... మధ్యరకం. ప్రయత్నిస్తే వీళ్ళిద్దరికి మంచి వేషాలు దొరికే అవకాశం ఉంది. మర్నాటి ఉదయం పదింటికి తను, ఆ ఆఫీసుకి వస్తాననీ, వీళ్ళిద్దర్నే రమ్మనమనీ సుబ్బారావు చెప్పాడు. ప్రొడ్యూసర్ కొత్తాయనని, డైరక్టర్ రమేష్ అని చెప్పాడు.

రవి, రమా భార్యాభర్తలై యాడాదిన్నర అయింది. ఇద్దరూ సినిమా వేషాలు మీదే బతకాలి. ఆ రంగంలోనే పరిచయం అయింది. మొదటి సంవత్సరం బాగానే గడిచింది. ఆరు నెలలుగానే బాగా ఇబ్బందిగా ఉంది. సినిమాలు లేవు. నాలుగు నెలల ఇంటి అద్దె కట్టాలి. మూడు నెలలుగా కిరాణాకొట్లో అప్పు, పాలవాడు పాలు ఆపేశాడు. ఈ స్థితిలో వేషం దొరకటం అంటే, నిధి దొరికినట్టే! సుబ్బారావు ఫోన్‌తో ఆశగా వుంది.

కానీ రవికే మనసు పీకుతోంది. డైరక్టర్ రమేష్ ఎలాంటి వాడో తెలుసు. చాలా పచ్చిగా ప్రవర్తించే మనిషి. ఆడది అందంగా కనపడితే వదలడు. రమ అందమైంది. సూటిగానే అడిగేస్తాడు లేదా సుబ్బారావుతో అడిగిస్తాడు. రమేష్ ఈ రకం అయితే, ఇంక ఆ కొత్త నిర్మాత ఏ రకమో?

ఇలాంటి విషయాలు రవికి తెలియనివి కాదు. ఎంతైనా రమని భార్య అనుకున్నాక, ఆ ప్రసక్తి మనసులో ముల్లు దిగినట్లు ఉంటుంది. ఓనాటి మందు పార్టీలో సుబ్బారావుతో అదే విషయం ప్రస్తావించాడు.

"ఎంతైనా, భార్యాభర్తలుగా బతుకుతున్నప్పుడు, మరీ భర్తనే, భార్యని తార్చమనటం అన్యాయం. పూర్తిగా చచ్చి బతుకుతున్నా! ఏ మగాడికేనా అది మహానరకం..!" అన్నాడు రవి.

దానికి సుబ్బారావు, "ఎవడి గురించి వాడు ఆలోచించుకోటమే, ఈ రంగం గొప్పతనం. ఆడది అందితే పొందటమే. నువ్వు దాన్ని పెంచావా? ఉంచుకున్నావా? కట్టుకున్నావా? ఎవరికీ అక్కర్లేదు. మనిషిగా చచ్చిపోయానంటున్నావుగా, మగాడిగా కూడా చచ్చిపో!" అన్నాడు.

సుబ్బారావు మాటలు కరకుగా ఉన్నా అదే పచ్చినిజం. నిన్నెవరూ ఇలా బతకమని బలవంతం చెయ్యటం లేదు. నీ ఆశే నిన్నిలా తయారు చేసింది. ఒక్క హిట్, ఒక్కసారి అదృష్టం, జీవితం మొత్తం మారిపోయి, లక్షల్లో... కోట్లల్లో బతకచ్చన్న తీరని దాహం! శ్లేష్మంలో ఈగ కన్నా దారుణ స్థితి, వెనక్కి తిరిగి వెళ్ళలేని దుస్థితి. ఆ ఒక్క పెను ఆశ... ఎప్పటికైనా అందలం ఎక్కుతామన్న కాంక్ష, కొన్ని లక్షలమంది ఆడవాళ్ళ మానాల్ని, కొన్ని వేల మంది మగవాళ్ళ అభిమానాల్ని శాసిస్తోంది.

★★★

పదింటికల్లా ప్రొడక్షన్ ఆఫీసుకి చేరారు రవి, రమ. అలా వెళ్ళకుండా మానెయ్యలేమని ఆ భార్యాభర్తలిద్దరికీ బాగా తెలుసు. సుబ్బారావు వచ్చాక, లోపలికెళ్ళి వీళ్ళిద్దరి గురించి చెప్పివచ్చాడు. మరికాస్సేపటికి వీళ్ళని లోపలికి పిలిచారు. చాలా వినయంగానే లోపలికి వెళ్ళారు.

అలాంటి సంఘటనలు గతంలో అనుభవంలో ఉన్నా, ఇదే మొదటిసారి అన్నంతగా, గుండె దడదడలాడుతోంది రవికి. ఏం జరగాలని కోరుకుంటున్నాడో రవికే స్పష్టంగా తెలియదు!

డైరక్టరు, ప్రొడ్యూసరూ ఎదురుగా పక్క పక్కనే కూచుని ఉన్నారు. ఈ భార్యాభర్తలని ఇద్దరినీ నఖ శిఖ పర్యంతం పరీక్షగా చూసాడు డైరక్టర్ రమేష్. కొన్ని ప్రశ్నలు వేశాడు. కాస్సేపు అవీ ఇవీ మాట్లాడాడు. అన్నీ అయ్యాక ప్రొడ్యూసర్ వైపు వొంగి నెమ్మదిగా ఏదో చెప్పాడు. ఆయన 'సరే' నన్నట్టు తలూపాడు.

"మీ ఆవిడ రమ చాలా అందంగా ఉంది. మేం చూస్తున్న వేషానికి సరిపోతుంది!" అన్నాడు రమేష్.

"థాంక్యూ సార్!" అన్నాడు రవి నవ్వు తెచ్చుకుంటూ.

"మీ ఇద్దరికీ వేషాలు ఇస్తున్నాం. ఇద్దరికీ చెరో ఇరవై రోజులూ పనుంటుంది. వెళ్ళి మేనేజర్ని కలవండి... ఫార్మాలిటీస్ పూర్తి చేసి, ఎడ్వాన్స్ ఇస్తాడు. తీసుకోండి!" అన్నాడు రమేష్, రమ వైపు నవ్వుతూ చూస్తూ.

రవికి సంతోషం తన్నుకొచ్చింది. 'అమయ్య, ఇద్దరికీ పని దొరికింది' అనుకున్నాడు. మరోసారి వాళ్ళద్దరికీ ధన్యవాదాలు చెప్పి, బైటికొచ్చి మేనేజర్ దగ్గరికి వెళ్ళారు.

మేనేజర్ కూడా బాగానే మాట్లాడాడు, వివరాలు చెప్పాడు. రమకి రోజుకి పదివేలు, రవికి రోజుకి ఐదువేలు పేమెంట్. ఓ ముప్ఫైవేలు ఎడ్వాన్సు ఇచ్చి, కాయితాల మీద సంతకాలు తీసుకున్నాడు.

రవికి కలల లోకంలో ఉన్నట్టుంది. మొత్తం పేమెంట్ ఎంతో లెక్క లేసుకున్నాడు. 20 x 10 రమకి రెండు లక్షలు, తనకి లక్ష. మొత్తం మూడు లక్షలు. అనుభవిస్తున్న తీవ్ర ఆర్థిక ఇబ్బందంతా దూరమైపోతుంది. సంతోషంగా రమ వైపు చూశాడు. భార్య ముఖంలో అంత సంతోషం కనపడలేదు రవికి! అంతే అతని ఆలోచన మరోదారి పట్టింది. డైరక్టర్ వేషమిస్తూ, రమ వేపు నవ్వుతూ చూట్టం గుర్తొచ్చింది. అంటే ఈ ఇరవై రోజులు ఎప్పుడు పడితే అప్పుడు రమని, శారీరికంగా వాడుకోటం జరుగుతుందా? రమా అదే ఆలోచిస్తుందా?

కొద్ది క్షణాల్లోనే ఆ ఊహ రవిని విపరీత క్షోభకి గురిచేసింది. ఫీల్డులో, రమేష్ పెద్ద ఉమనైజర్ అన్న పేరుంది. అందులోనూ 'రమ చాలా అందంగా ఉంది' అని అననే అన్నాడు. ఇప్పుడేం చెయ్యాలి. రమ నుంచి రమేష్ నిజంగా అదే కోరుకుంటున్నాడా? అసలు అతని ఉద్దేశం అదేనా? ప్రొడ్యూసర్‌తో, నెమ్మదిగా, తమకి వినిపించకుండా ఇదే మాట్లాడాడా? తనే ముందుగా బైటపడి... అదీ తమకి సమ్మతమే అని ఒప్పుకుంటేనే వేషాలుంటాయా? పిచ్చెక్కినట్టు తయారైంది రవి పరిస్థితి! ఇంక తట్టుకోలేక, డైరక్టరున్న రూమ్ కెళ్ళాడు. గదిలో రమేష్ ఒక్కడే ఉన్నాడు. ప్రొడ్యూసర్ లేదు.

"ఏమిటీ విశేషం.. మళ్ళీ వచ్చావు?" అన్నాడు డైరక్టర్ రమేష్ నవ్వుతూ.

"సారీ.. మా పరిస్థితులు అసలేం బాగోలేవు! ఈ టైములో, ఈ అవకాశం మాకు పెద్ద వరం లాంటిది. మీరు ఎలా చెపితే అలాగే నడుచుకుంటాం. కానీ వేషాలు ఉండేలా చూడండి" అన్నాడు. అలా అంటుంటే రవికి తెలియకుండానే దుఃఖం వచ్చింది.

కన్నీటి తెర, రెప్పల చివరిదాకా వచ్చింది. పరిస్థితుల బాధో, భర్తగా భార్యని

తనే అప్పచెపుతున్న ఇబ్బందో, మగాడిగా అవమానమో మొత్తానికి అదో నరకం.

"మీ ఇద్దరికీ వేషాలిచ్చాంగా ఎడ్వాన్సు కూడా ఏర్పాటు చేశానుగా ఏమిటి నీ సందేహం!"

"నిజమే సార్. కానీ భయం. నోటి వరకు వచ్చిన కూడు ఎక్కడ దూరం అవుతుందోనని... రమతో మీకు రాత్రి కమిట్ మెంట్ ఏమైనా కావాలేమోనని... " ఇంక మాట పూర్తి చెయ్యలేదు రవి.

మళ్ళీ నవ్వాడు రమేష్... "అదా నీ డౌటు. నేను తిరుగుబోతునే. ఆవిషయం చాలా మందికి తెలుసు. కానీ, ఈ ప్రొడ్యూసర్ గారు వాటికి పూర్తిగా వ్యతిరేకం. ముందే చెప్పారు, అలాంటివి ఏం జరక్కూడదని! ఈ సినిమా వరకూ, నేనూ పవిత్రంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. అలాంటివేం లేవు. నెక్స్ట్ వీక్ నుంచి షూటింగ్ హాయిగా వెళ్ళిరా!" అన్నాడు.

ముందు ఓ క్షణం అయోమయం అనిపించింది రవికి. 'కలా? నిజమా!' అనీ అనిపించింది. పూర్తిగా సముద్రంలో మునిగిపోయిన మనిషి, అకస్మాతుగా ఒడ్డు చేరినట్టుంది. పూర్తిగా ఊబిలో ఉన్నట్టున్న తమ పరిస్థితిలో ఈసారికేనా, కనీసం ఒక్కసారికేనా, రమేష్ చూపిస్తున్నది గొప్ప కరుణ, ఔదార్యం అనిపించాయి. ఆ ప్రొడ్యూసర్ దేముడు అనిపించాడు. చుట్టూ కుళ్ళు నిండిపోయిన వాతావరణంలో, ఓ సుగంధపు గాలి సేద తీర్చినట్టుంది. రవి ఒళ్ళు ఒక్కసారిగా జలదరించింది. ఎంత కఠినత్వంలోనైనా, కొంతేనా సున్నితత్వం బతికి ఉంటుందన్నమాట అనుకున్నాడు.

వ్యవహారాలు సవ్యంగా ఉంటే, కాస్తంత పవిత్రతేనా ఇలా కనపడుతుంటే, అదే అమృతసమం అనుకున్నాడు. ఏమో ఎప్పటికేనా, కొన్ని దశాబ్దాలుకేనా ఈ పరిశ్రమలోనూ పరిస్థితులు స్వచ్ఛంగా తేటపడితే, అంతకు మించిన అదృష్టం ఇంకేముంటుంది అనుకున్నాడు. బైటికొచ్చి ఆతృతగా ఎదురుచూస్తున్న రమతో జరిగిందంతా చెప్పాడు. ఆ సమాచార పంపకంలో, మరోసారి ఆ భార్యాభర్తలు కళ్ళు చెమర్చాయి. అంతటి క్లిష్టజీవితం గడుపుతున్న ఆ భార్యాభర్తలు అపురూప అనురాగం ఎంతో గొప్పది. వారి ప్రేమగాథ అసామాన్యం!

# మాక్లీదుర్గంలో కుక్క

కీ. శే. విశ్వనాథ సత్యనారాయణ



**కథామార్గదర్శి కథ**

మాక్లీదుర్గం రైల్ స్టేషన్ గుంతకల్లు నుంచి బెంగుళూరుకు పోయే త్రోవలో నాల్గు స్టేషనుల కివతల నున్నది. ప్లాటుఫారం కన్నా రైలు స్టేషను పదిగజాలు ఎక్కి వెళ్ళాలి. రైలు రోడ్డు పక్కనే పెద్దకొండ ఉన్నది. దాన్నిండా రాళ్ళూ రప్పలూ, చెట్లూ చేమలూ ఉన్నవి. అప్పుడప్పుడూ వేగోలాలు (వేగోలం అంటే హైనా జాతికి చెందిన క్రూరజంతువు) సివంగులూ రాత్రుళ్ళు స్టేషనులోకి వస్తూ ఉంటవి. స్టేషను వెనక పెద్ద లోయ ఉన్నది. ఆ లోయ అంతా సారవంతమైన ప్రదేశం. లోయకవతల తట్టు ఉన్న కొండమీద ఎవరిదో భాగ్యవంతులది పెద్ద సౌధం ఉన్నది. ఈ లోయలో రెండు, మూడు నాలుగు ఉన్నవి.

మాక్లీదుర్గం స్టేషను చాలా చిన్నది. అందులో చిన్న అంగడి ఉంది. రైళ్ళు వచ్చే వేళకు ఆ అంగడి తెరిచి ఉంటుంది. ఒక కుక్క అంగడి తెరిచినప్పుడల్లా అక్కడ తయారు! అంగడి ఎత్తుగా ఉంటుంది. కుక్క తన చూపు అంగడిలోని పళ్ళికలలో ఉన్న మిఠాయి మీద పడేటంత సమరేఖలో ఉంచుకొని, ఊర్ధ్వదృష్టితో తపస్సు చేస్తుంది. ఎప్పుడైనా, వాడంగడి సర్దేటప్పుడైనా, యెవడైనా కొనుక్కునేటప్పుడైనా చిన్నముక్క జారిపడుతుందేమోనని యెదురు చూస్తూ ఉంటుంది. వారానికో, పదిరోజులకో అట్లా ఎప్పుడూ పడదుగాని, పదిరోజుల క్రింద చేసిన పకోడీ కొనుక్కున్నవాడు చద్ది వాసన వేసి పారేస్తే, కుక్క దాన్ని నోటితో అగావుగా పట్టుకొని, పళ్ళతో నొక్కి, అంగట్లోకి పోయేందుకు రెండు గతుకులు గతికి, మ్రింగి, దగ్గ వచ్చి, మళ్ళీ కక్కుతుంది. రైలు వెళ్ళిపోవడంతోటే అంగడివాడు మూస్తాడు. కుక్కపోయి సెలయేట్లో నీళ్ళు తాగుతుంది. ముందుకాళ్ళు చాచి, గడ్డిమీద పడుకొని, లేత గరిక పోచలు కొరుకుతుంది.

ఆ కుక్క మంచి మిడతల వేటకాడు! అప్పుడప్పుడూ పొలము పిచ్చుకలను గూడా పట్టుకుంటుంది. సెలయేటి నీళ్ళూ, మంచి గాలీ, లోయలోకి దిగటం, ఎక్కటం, కుక్క మంచి దేహపటుత్వంలో ఉన్నది. కుక్క ఎప్పుడూ స్టేషనెదురుగా ఉన్న కొండమీదకి పోదు.

ఒకసారి ఒక పెద్దమనిషి ఆడ సీమకుక్కను స్టేషనులోకి తెచ్చాడు. వాటి రెంటికీ ప్రథమ దర్శనంలో ప్రణయం ఏర్పడ్డది. ఆ పెద్దమనిషి చేతిలో కర్ర ఉంది. దాన్ని చూచి మన కుక్క తన ప్రియురాలి దగ్గరకి వెళ్ళింది కాదు. పుట్టింట ఉన్న ఆడపిల్ల వలే, సీమకుక్క మాత్రం నిర్భయంగా తన వలపుకాణ్ణి చూడడం మొదలెట్టింది. పెద్దమనుషులు తనను పోకిరీ అనుకుంటారేమోనని దుర్గపు కుక్క, దాని వంక చూచీ చూడకుండా చూడటం మొదలెట్టింది. పెద్దమనిషి తన కుక్కను కటకటాలకు కట్టివేసి, సామానులు తూయించుకోడానికో, దేనికో వెళ్ళాడు. రెండు కుక్కలూ కలిసి కొన్నవి.

స్టేషను మాస్టరు కొంచెము చదువుకున్నాడు. పెద్దమనిషికీ ఆయనకీ ఆధునిక సిద్ధాంత రాద్ధాంతాల చర్చ జరుగుతోంది.

స్టేషను మాస్టరు: కాదండీ. వర్ణ వ్యవస్థ ఉండాలి! మన పూర్వులు దాన్ని నియమించారు. వాళ్ళు ఏ ప్రయోజనాల కోసం దాన్ని ఏర్పరిచారో ఆ ప్రయోజనాలు తెలియకుండా దాన్ని తీసివేయరాదు!

పెద్దమనిషి: అట్లా అంటే లాభం లేదండీ! ఆ సిద్ధాంతాలేమిటో చెప్పండి. మనవాళ్ళు ఏర్పరిచారు కదా అని, గ్రుడ్డి ఎద్దు చేలో

పడ్డట్టు పోరాదు. మన వాళ్ళు చెప్పారు కదా అని, వినే రోజులు పోయినై! ప్రతీదీ వాదానికి నిలవాలి. వాదానికి నిలవంది మేము ఒప్పుకోము!

స్టే.మా.: వారే ప్రయోజనాలర్థించారో మనకు తెలియదు. మనకు వాటిని తెలుసుకునేటంత మేధాశక్తి లేదు!

పె.మ.: దానికీ నేనొప్పుకోను. జ్ఞానము ప్రపంచము నడిచినకొద్దీ వృద్ధి అవుతుంది గాని, తగ్గడం లేదు. మన పూర్వులకు మనకున్నంత వాదనాశక్తి లేదంటాం. మానసికశాస్త్రం ఇప్పుడు వృద్ధి అయినంత పూర్వం వృద్ధి కాలేదు!

స్టే.మా.: అయితే మీరు వర్ణవ్యవస్థ తీసి పారవెయ్యాలి అంటారా?

పె.మ.: తీసివెయ్యాలంటాను. ఈ వ్యవస్థ మూలముగా అనేక బేధాలేర్పడుతున్నవి. కొందరనవసరముగా, తాము గొప్ప వాళ్ళమనుకుంటున్నారు. తక్కువ కులాల మీద అధికారము చలాయిస్తున్నారు. వర్ణాంతర భోజనాలూ, వివాహములూ జరగవలె! అప్పుడు దేశానికి ముక్తి!

స్టే.మా.: సర్వత భూతములయందూ సమత్వం ఉండాల్సిందే కాని, వర్ణాంతర వివాహం నేను ఒప్పుకోను. పైకి కనబడే బేధాలు మనసా లేకుండా చేసుకోవాలి. మన పూర్వులు కూడా అదే చెప్పారని నా ఉద్దేశం!

పె.మ.: మనవాళ్ళట్లాగు చెప్పలేదు. మనవాళ్ళు సంఘానికి చేసిన ద్రోహం ఇంతంత కాదు!!

పెద్దమనిషి బయటకు వచ్చాడు. తన కుక్కవంక చూచాడు. రెండు కుక్కలూ తమ వర్ణబేధం మర్చిపోయి కలిసికొంటున్నవి. పెద్దమనిషి పరుగెత్తుకొని పోయి, దుర్గపు కుక్కను పది పదకొండు దెబ్బలు కొట్టినాడు. 'జ్ఞాతాస్వాత'మైన ఆ కుక్క వెంటనే వదిలిపెట్టడానికి సమర్థము కాక, చివరకు వదిలించుకొని పోయింది. స్టేషను బయటకు పోయిన తరవాత కుక్కకు తెలిసింది, తన తొంటి విరిగిందని. ఆ పెద్దమనిషి తన కుక్కను కూడా నాలుగు మోదినాడు.

స్టేషనుమాస్టరీ గందరగోళము విని బయటకు వచ్చాడు. సంగతంతా తెలిసికొన్నాడు. "అయ్యో ఎందుకు కుక్కనట్లా కొట్టారు?" అన్నాడు.

పె.మ.: ఇది జాతిగల కుక్క. దీనికి తోడు మగకుక్కను కొనవలెనని చాలా ప్రయత్నం చేసాను. దొరకలేదండీ! దీనికి ఋతువు వచ్చింది. దీన్ని బెంగుళూరు తీసుకుపోతున్నాను. ఈజాతి మగ కుక్కతో కలపవలెనని.

స్టేషనుమాస్టరు కొంచెము నవ్వాడు. పెద్దమనిషి కనుబొమ్మల మీద మాత్రం కొంచెం నల్లని రేఖ ఏర్పడ్డది. ఆయనా నవ్వాడు!

తరవాత మళ్ళీ ఇద్దరూ స్నేహంగా మాట్లాడుకొన్నారు. స్టేషనుమాస్టరు సీమకుక్క అందానికి, మొగాన మచ్చకూ, తోక కుచ్చుకూ, దాని గోధుమరంగు వన్నెకూ మిక్కిలి మెచ్చుకొని దాన్ని ముద్దాడాడు. దానికి పిల్లలు పుడితే నాకో పిల్లను తప్పకుండా ఇవ్వాలని వాగ్దానం చెయ్యించుకున్నాడు.

ఊరకుక్క సంసర్గం చేత సీమకుక్కకు ఒళ్ళంతా మన్నైంది. అంతకుముందే వాన కురిసి, పక్కనున్న పెద్ద బండలమీద నీటి పడెలు కట్టినై. పెద్దమనిషి తన తోలుపెట్టె తెరిచి, రెండుతికిన తువాళ్ళూ, సబ్బుబిళ్ళా తీసి, ఆ పడెలో కుక్కను అభ్యంగనము చేయించి, తువ్వాళ్లతో దాన్ని చక్కగా తుడిచాడు. ఇంతలో రైలు వచ్చింది. ఆయన కంయి కంయి మని అరుస్తున్న కుక్కను తువాళ్ళతో చుట్టి, చంకను పెట్టుకొని, రైల్లో ఎక్కాడు. మగకుక్క ఆడకుక్కకు దూరంగా నిలబడి కుంటుతూ కుంటుతూ

దానివంకే సాకూతంగా చూడడం మొదలుబెట్టింది. ఆయన కిటికీలోంచి తొంగిచూచి, కుక్కవైపు రెండుసార్లు కఱ్ఱ ఆడించాడు. అది మరీ దూరం పోయింది!

రైలు సాగింది. సీమకుక్క కంయి కంయిమని తలుపు దగ్గరకు పోతుంది. తొంగి చూస్తుంది. అతడు గొలుసుతో లాగి పట్టుకున్నాడు. రైలు బెంగుళూరు పోయిన తరువాత, కుక్క ఏడుపు మానేసి యజమాని దగ్గర చనువుగా కూర్చుంది. అతడు దాన్ని ఒళ్ళోకి తీసుకొని "లీలా అల్లా చెయ్యవచ్చునా?" అని దాని నోట్లో నోరుపెట్టి ముద్దు పెట్టుకున్నాడు. ఇందాకటి కుక్క ఈ పనే చేస్తే, అంత హృదయంగమంగా ఊరుకున్న ఆ కుక్క పరపురుష చుంబనం పరిహరించినట్లుగా అతని చుంబనం పరిహరించింది.

★★★

దుర్గములో కుక్క, తన తొంటి, గాడిద గరపాకులకూ, అడ్డసర ఆకులకూ వేసి రుద్దుకొని, సెలయేటి ఒడ్డున ఉన్న ఒండ్రుమట్టితో అద్దుకొని, పదిహేను రోజులకు కాలు సరిచేసుకున్నది. మళ్ళీ స్టేషనులోకి వస్తున్నది. మిఠాయి దుకాణం వంక చూస్తున్నది.

ఒకనాడు ఇద్దరు విద్యార్థులు అక్కడికి వచ్చి, దుకాణంలో ఏదో కొనుక్కొని తింటూ బల్లమీద కూర్చున్నారు. వాళ్ల ఇద్దరి మాటలూ కుక్క చెవిన పడ్డవి.

"మన దేశంలో భూతదయ అన్నది లేదు! పెద్దవాళ్ళందరూ పిన్నవాళ్ళ మీద అధికారం చేస్తారు. నేను బి.యే. ప్యాసైనాను. ఉద్యోగమిచ్చే దిక్కులేదు. పేదవాళ్ళు మలమల మాడిపోతున్నారు. గొప్పవాళ్ళు సోఫాలమీద గాని ఒరగరు!" అన్నాడు ఒకడు.

"మనవాళ్ళు అందరూ స్వార్థపరులే. పిడికెడు బిచ్చం పెట్టరు. చివరకు కుక్కకు వేసినట్టన్నా పేదవాళ్లకింత వెయ్యరు!" అన్నాడు రెండోవాడు.

కుక్క వాళ్ల దగ్గరకు వచ్చి, వాళ్ళ చేతిలో పొట్లం వంక చూసింది. వాళ్ళిద్దరూ ఇంగ్లీషులో మాట్లాడుకుంటున్నారు. అందులో ఒకతని కాళ్ళకు బూట్లు ఉన్నవి. కాలు మీద కాలు వేసుకు కూర్చున్నాడు. ఆ బూటుకాలితో కుక్కను డొక్కలో తన్నాడు. దానికి రెండుమూడు రోజులనుండీ తిండి లేదు. ఆ దెబ్బ పొట్టలో ఏ నరానికి తగిలిందో, అది మెలికలు తిరిగిపోయింది. కొంతసేపటికది తెప్పిరిల్లి లేచిపోయింది. రెండో విద్యార్థి తన చేతిలోది కొంచెం దాని ముందర వేసాడు. అది నొప్పిచేత దానిని ముట్టుకోకుండా పోయింది.

ఆరోజు రాత్రి కొండ మీదనుంచి ఒక వేగోలం దిగి స్టేషనులోకి వచ్చింది. కుక్క భయపడి, దుకాణం కింద గూడుగా ఉంటే, దానిలో దాక్కుంది. స్టేషనంతా నిర్జనంగా ఉంది. వేగోలం పసిపట్టి ఆ కాపలా ఉంది. వేగోలం మూతి గూడులోకి పెడితే, కుక్క లోపల దాక్కొని దాని నోరంతా కరిచింది. వెనక్కు తిరిగితే తోకా, పృష్ఠభాగం గాట్లు చేసింది. వేగోలం మయమరచి ఉంటే కొంచెం బయటకు వచ్చి, దాని మెడ పట్టుకొని గుంజింది. అది కరవ వస్తే గూట్లో దాక్కుంటుంది. అట్లా మూడు నాలుగు గంటలు దాగుడు మూతల యుద్ధం చేసి, ఒక ఒడుపులో వేగోలం పీక పట్టుకొని, దాని ఊపిరి ఆగే దాకా కుక్క వదలలేదు.

తెల్లవారిన తరవాత అందరూ వచ్చారు. కుక్క పౌరుషం చూసారు. ఏడాది రెండేండ్లుగా మర్యాద లేని ఆ కుక్కకు ఆనాటితో మర్యాద ఎక్కువైంది. స్టేషనుమాస్టరు దానికి రోజూ అన్నం వెయ్యమని ఫర్మానా ఇచ్చాడు. ఆ రోజు సాయంకాలం అంగడివాడికి మహా దయ కలిగింది. ఒక బూందీపూస... బీరువోనియ్యని ఆ పిసినిగొట్టు, సంవత్సరము బట్టీ పరిశిష్టము నూనెతో పరిశిష్టముగా వస్తున్న మిఠాయి జంగిలీ దాని ముందర పెట్టాడు. ఆ మిఠాయి మరెవ్వరూ కొనరు. ఎవ్వరూ కొనక

పోవడం చేత, వారం రోజులకొకసారి తాజాగా నూనెలో వేస్తున్నా ఎవ్వరూ కొనలేదు. కుక్కమీద మహాదయ పుట్టి, ఆ జంగిలీ దాని ముందర పెట్టాడు. అది తిన్నది. ఆప్యాయంగా తిన్నది. ఆ కుక్క రాత్రి తెల్లవార్లూ మహా బాధపడుతున్నట్టుగా ఏడవడం మొదలు పెట్టింది. ఇంట్లో పడుకున్న స్టేషనుమాస్టరూ, పోర్టర్లూ వేగోలాలు వచ్చినై అనుకున్నారు. కుక్క పగలుపోయి, పొలాల మీదా, అడవుల మీద తిరిగి వస్తుంది. దానికేదో మహావాతం పుట్టింది. కనపడ్డ ఆకల్లా కొరికింది. ఏ ఆకూ పనిచెయ్యలేదు. ఒంద్రుమట్టి 'నా చేత కాదంది.' సెలయేటి నీళ్ళు 'ఇది మా పని కాదన్నవి.' రాత్రిళ్ళు స్టేషనులో పడి యేడుస్తుంది. మెలికలు తిరిగిపోతుంది. తన నడుము రైలు కింద పడ్డట్టు గోలకెత్తుతుంది.

వారము రోజులీ రీతిగా కొట్టుకులాడితే, దాని వ్యాధి ఉపశమించింది. రెండురోజులు ఉపవాసముండి కూడా వేగోలాన్ని చంపిన ఈ కుక్క వారము రోజులయ్యేటప్పటికి చిక్కి శల్యమయింది. దాని వెనక కాళ్ళూ, మొత్తా తప్పబడిపోయినవి. అది ఎక్కడో ఒకచోట పడుకొని, మూలగడానికి కూడా ఓపిక లేకుండా సన్నగా యేడుస్తుంది. దానికి మిఠాయి అంగడి అంటే భయం వేసింది. అంగడి వైపు పోదు. అంగడి వంక చూడదు. మునుపు స్టేషనులో యధేచ్ఛగా తిరిగేది. స్టేషనుమాస్టరు గదిలోకి పోయి తొంగిచూస్తే, చీదకుక్క, పేలకుక్క అని దాన్ని కొట్టడం మొదలుపెట్టారు.

ఆరు నెలలైంది. ఆ కుక్క చావదు, బతకదు. ఒకరోజు సీమ కుక్కను తెచ్చిన పెద్దమనిషి వచ్చాడు. మాస్టరూ, ఆయనా పూర్వపరిచయాన్ని మగిడించుకొని మాట్లాడుకున్నారు. మాస్టరు "ఏమండీ కుక్క పిల్లలను పెట్టిందా?" అని అడిగాడు.

పెద్దమనిషి ఇల్లా అన్నాడు ""అయ్యా కుక్కను బెంగుళూరు తీసుకువెళ్ళాను. జాతికుక్కను ఎక్కనివ్వలేదు. మీ పాడుకుక్క పాడుచేసింది. కుక్క రెండు పిల్లలను పెట్టింది. ఊరకుక్కల్ని పెట్టింది. నాకు చాలా విచారం వేసింది. ఈసారి మంచి పిల్లలను పెడితే మీకు తీసుకువచ్చి ఇస్తాను!"

స్టేషనుమాస్టరు "మా కుక్క చాలా మంచిదండీ. చాలా పౌరుషశాలి. కొన్నాళ్ళ కింద ఇది వేగోలాన్ని చంపిం"దన్నాడు.

పెద్దమనిషి "పోనిద్దురూ! వెధవకుక్క!! నాకు దానిని చంపవలెనని ఉంది. అది ఇంకా మీ స్టేషనులో ఉంటే చూపించండి. దాన్ని నరికి పోతా"నన్నాడు.

ఇంకా స్టేషనుమాస్టరు "ఏదో పెద్ద వాతం పుట్టి కుక్క పాడైపోయిం"దన్నాడు.

ఇంతలో కుక్క ఈడ్చుకుంటూ అక్కడికి వచ్చింది. స్టేషనుమాస్టరు "ఇదేనండీ" అంటూ చూపించాడు. పెద్దమనిషి కోపం పట్టలేక, తన చేతిలోని పేముబెత్తంతో ఒకటి వేసాడు. అది పారిపోలేక, అక్కడే ఒక పక్క కొత్తిగిలి, మెడా, కాళ్ళూ ఎత్తి ఏడ్చింది. పోర్టరు వచ్చి కాలితో దాన్ని అవతలికి తోసాడు. మాస్టరు నవ్వి "మీకెంత కోపమండీ" అన్నాడు.

వారి ఇద్దరి స్నేహమూ బలిసి, ఆ రాత్రి పెద్దమనిషి మాస్టరుగారి అతిథిగా ఉండిపోయినాడు. ఆనాటి రాత్రి ఆ కుక్క రైలు కింద పడ్డది. రైలు దాని నడుము మీదనుంచి పోయింది.

"అంగవ్రాతములో చికిత్సకుడు దుష్టాంగమ్ము" ఖండించినట్లు, రైలు వ్యాధిగ్రస్తమై, నష్టశక్తియైన దాని పశ్చార్థమును ఖండించింది. కాని, శేషాంగశ్రేణికి రక్ష లేక, అది అరగంట తన్నుకొని చనిపోయినది.

★★★

తరవాత నాల్గు నెలలకు ఆ పెద్దమనిషి తన రెండు కుక్కపిల్లలో ఒకటి చచ్చిపోయినదని చెప్పి, రెండవదానిని స్టేషనుమాస్టరు

గారికి ఇచ్చాడు. అది ఆరునెలలో ఎదిగి తన తండ్రివలే అయినది. దానికి భయము లేదు. ఎదురుగానున్న కొండమీదికి సికారు పోయి వస్తుంది. ఎవరన్నా దానికి మిఠాయి పెట్టబోతారు. అది వాళ్ళకు పళ్ళు చూపించి కరవ వస్తుంది. ఎన్ని ఆడకుక్కలు వచ్చినా వాటి వంక చూడదు. అది పిల్ల వేగోలాలనూ, కుందేళ్ళనూ, నక్కలనూ వేటాడుతుంది. విద్యార్థులు వచ్చి, భూతదయోపన్యాసములు చేస్తుంటే వాళ్ళవంక ఓరగా, తిరస్కారముగా చూస్తుంది. ఆ పెద్దమనిషి వచ్చి, వర్ణవ్యవస్థ గురించి స్టేషనుమాస్టరుతో మాట్లాడుతూ ఉంటాడు. ఈ కుక్క వస్తే దానిని ముద్దుగా ముట్టుకోబోతాడు. అది కోపంగా పళ్ళు చూపించి జీర్ణముకాని వేగోలము మాంసాన్ని కక్కి పోతుంది. రైలు మైలు దూరము నున్నదనగా, ముక్కోళ్ళతో శ్వాస ఎగలాగి, పసిపట్టి, చీదరించుకొని తొలగిపోతుంది.

మిఠాయి దుకాణం వాడొకనాడు చద్ది మిఠాయి దాని ముందర వేయబోయినాడు. అది వాడి పిక్కకండలు పట్టి లాగింది. అది వేగోలంగాని, కుక్క కాదన్నారు అందరూ. దానికి మనుషుల్ని చూస్తే వెగటు వేసింది కాబోలు కొన్నాళ్ళకి జనసమ్మర్దమైన ఆ స్థలాన్ని వదిలిపెట్టి, అడవుల్లోనే ఉంటూ వచ్చింది. అప్పుడప్పుడూ స్టేషను దగ్గరకు వస్తుంది. నిత్యగహన సంచారం వల్లనో, తల్లి పోలికో, తోక కుచ్చు బలిసింది. కోరలు వచ్చినై. మనుష్యగాలి తగిలితే, బృహస్పతి తమ్ముడు సంవర్త మహర్షివలే చీదరించుకొని తొలగిపోతుంది!

*("ప్రతిభ" 1.8.1936 సంచిక నుండి పునర్ముద్రణ)*

విశ్వనాథ వారి రచనల కొరకు సంప్రదించగలరు
"శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ – హైదరాబాద్/విజయవాడ"
ఫోన్: 8019000751

ఈ పత్రిక నిర్వహణకు ప్రతి నెలా ఒకరు ఆర్థికంగా సహాయపడుతున్నారు. ఆసక్తితో పాటు అవకాశం ఉన్నవారిని కథామంజరి కథాయజ్ఞంలో పాలుపంచుకోవలసినదిగా సవినయంగా కోరుతున్నాం. వివరాల కోసం సంప్రదించండి.


అవసరాల వెంకటరావు
9989976688

జయంతి ప్రకాశ శర్మ
9848629151


◈

సద్విమర్శ ఒక రచన ఆరోగ్యాన్ని పరిరక్షించే ఔషధం. కథకులకి మార్గదర్శి వంటిది.
కథామంజరి కథల పైన మీ అభిప్రాయాలను, విశ్లేషణలను, విమర్శలను ఆహ్వానిస్తున్నాం.
మీ అభిప్రాయాలను పంపవలసిన చిరునామా
submit@kathamanjari.in
మంచి రచనలతో కూడిన సంచికను రూపొందించే కార్యక్రమానికి చేయూతనివ్వండి.

◈

కథామంజరి పాఠకులను పెంచండి. కథామంజరిని కథాభిమానులకు చేరువ చేయండి.
వారి ఇమెయిల్ లను నమోదు చేసుకొనడానికి..
www.kathamanjari.in

◈

కొత్త, పాత రచయితలు, రచయిత్రుల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం.
మీ రచనలను పంపవలసిన చిరునామా
submit@kathamanjari.in